www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 199 | సోమవారం | 8 జనవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



క్యాంపస్ నియామకాలం

చదువు పూర్తి కాగానే ఉద్యోగాలు వచ్చే కోర్సులకు, కాలేజీలకే తల్లిదండ్రుల ప్రాధాన్యం

మన తెలంగాణ/ హైదరాబాద్ : కోటి విద్యలు కూటి కోసమే అని నానుడి. కొంతమంది వద్ద ఎన్ని డిగ్రీలు ఉన్నా నిరుద్యోగులుగానే ఉంటుండగా, మరికొందరు ఏదో ఒక డిగ్రీ పూర్తి చేసి మంచి ఉద్యోగంలో స్థిరపడతారు. ఇలాంటి పరిస్థితులు గమనిస్తున్న తల్లిదండ్రుల ఆలోచనా విధానం కూడా మారుతోంది. మంచి ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సుల్లోనే తమ పిల్లలను చేర్పించాలని అనుకుంటున్నారు. అందుకే ఫీజు ఎక్కువైనా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ బాగా ఉన్న కళాశాలల్లోనే ప్రవేశాలు పొందేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మొగ్గుచూపుతున్నారు. ఒకప్పుడు ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలకే పరిమితమైన ప్రాంగణ నియామకాల సంస్కృతి ఇప్పుడు అంతటా వ్యాపించింది. ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి వృత్తి విద్యా కోర్సుల నుంచి సాధారణ డిగ్రీ వరకు కళాశాలల్లో ప్రాంగణ నియామకాలు బాగున్నాయో లేదో తెలుసుకొని మరీ అడుగు ముందుకేస్తున్నారు. ఒక్కో విద్యార్థి రెండు, మూడు ప్రవేశ పరీక్షలకు హాజరైనా, చివరకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ మెరుగ్గా ఉన్న కోర్సుల్లో, కళాశాలల్లో చేరేందుకే ఆసక్తి కనబరుస్తున్నారు.

నైపుణ్యాల ఆధారంగానే నియామకాలు : విద్యార్థుల నైపుణ్యాల ఆధారంగా కంపెనీలు ప్యాకేజీలు ఆఫర్ చేస్తున్నాయి. ప్రస్తుత పోటీ వాతావరణంలో సమర్థులైన అభ్యర్థులకు లక్షల రూపాయల ప్యాకేజీలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. సమర్థులైన అభ్యర్థులకు ఏడాదికి రూ.7 నుంచి రూ.7.5 లక్షల వరకు ఇస్తున్నాయి. ఇన్ఫోసిస్, టిసిఎస్, డిప్రో, అమెజాన్ వంటి ప్రతిష్ఠాత్మక కంపెనీలు సమర్థులైన ఉద్యోగుల కోసం విద్యాసంస్థల ముందు బారులు తీరుతున్నాయి. తమ అవసరాలకు సరిపడే ఉద్యోగుల కోసం ప్రాంగణ నియామకాలు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పులు వస్తున్నాయి. కోర్సు ఏదైనా, కాలేజీ మరేదైనా క్యాంపస్ నియామకాలు ఉన్న కోర్సులకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

టెక్నికల్ వర్సెస్ కన్వెన్షనల్ : ప్రాంగణ నియామకాలలో కంపెనీలు టెక్నికల్ విద్యార్థులకే ప్రాధాన్యమిస్తున్నాయని, సంప్రదాయ డిగ్రీ విద్యార్థులకు అవకాశాలు అందట్లేదనే ఆరోపణల్లో నిజం లేదని కొన్ని ప్రాంగణ నియామకాలు రుజువు చేస్తున్నాయి. డిగ్రీ విద్యార్థులకు కూడా ఇప్పుడు అవకాశాలు విస్తరిస్తున్నాయి. క్యాంపస్ ప్లేస్‌మెంట్ అందించే కొన్ని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఏటా రూ. 50వేల, 60 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఫీజులు ఎక్కువైనా, తలిదండ్రులు తమ పిల్లలపై వెచ్చించే ఖర్చు ఎక్కువైనా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఇచ్చే కళాశాలల్లో చేర్పించేందుకే ఆసక్తి కనబరుస్తున్నారు. సంప్రదాయ డిగ్రీ విద్యార్థుల విషయంలో కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రధాన సమస్య. ప్రాంగణ నియామకాలు కోరుకునే విద్యార్థులు డిగ్రీలో ప్రవేశం పొందినప్పటి నుంచే ఇతర నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంపై దృష్టి సారించాలి.

ఇతర నైపుణ్యాలు అవసరమే : క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో మంచి ప్యాకేజీతో కోరుకున్న ఉద్యోగం వచ్చినప్పుడు మూడు, నాలగేళ్ల విద్యార్థుల శ్రమకు సరైన గుర్తింపు వచ్చినట్లు. ప్రస్తుత నియామకాల తీరును పరిశీలిస్తే కేవలం సంబంధిత డిగ్రీ సబ్జెక్ట్‌లోనే ప్రావీణ్యం సరిపోవడం లేదు. ఇతర

తరువాయి 6లో



11లో

కిమ్‌తో మాట్లాడుతా

- అందుకు షరతులుంటాయి
- ఉభయ కొరియాల మధ్య చర్చలు నా కృషి ఫలితమే : డొనాల్డ్ ట్రంప్

గురికి బారెడు దూరం

నత్తనడకగా రాష్ట్ర పన్నుల వసూళ్లు

- అంచనాల్లో 50% కూడా దాటలేదు
- లక్ష్యం రూ.1,44,986 కోట్లు కాగా, ఇప్పటి వరకు వచ్చింది రూ.73,108 కోట్లు మాత్రమే
- తగ్గిన సేల్స్ ట్యాక్స్ వసూళ్లు
- కేంద్ర పథకాల కింద వచ్చింది బహుస్వల్పమే



మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నవంబరు మాసాంతానికి రాష్ట్ర బడ్జెట్ అంచనాల్లో రెవెన్యూ వసూళ్ళు 50 శాతం కూడా దాటలేదు. ఏప్రిల్ మొదలు ఇప్పటి వరకు వివిధ పన్నుల రూపంలో (జిఎస్‌టి మినహా) రాష్ట్ర ప్రభుత్వం రూ.52,733.13 కోట్లను వసూలుచేసింది. జులై నుంచి జిఎస్‌టి అమల్లోకి రావడంతో నవంబరు వరకు మొత్తం రూ.13,120.66 కోట్లు వసూలయ్యాయి. అంటే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మొత్తం రూ.1,13,083.04 కోట్ల మేర రెవెన్యూ రూపంలో ఆర్జించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంటే నవంబరుతో ముగిసిన

తరువాయి 6లో

పంచాయతీ బిల్లుపై కేబినెట్ సబ్ కమిటీ

- జూపల్లి అధ్యక్షతన ఏర్పాటు
- కమిటీలో కెటిఆర్ తదితరులు

మన తెలంగాణ / హైదరాబాద్ : పంచాయతీరాజ్ చట్టానికి సవరణలు తేవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం బిల్లును రూపొందించే పనులకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా పంచాయతీరాజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన ఏడుగురు మంత్రులతో ఒక ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తూ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదివారం నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సిఎం కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ కమిటీలో పంచాయతీరాజ్

తరువాయి 6లో



ఎస్‌సిల్లో చేర్చాలి

చాకలి పోరుగర్జనలో వక్తల డిమాండ్

మన తెలంగాణ/ ఎల్‌బి నగర్ : అనాదిగా చాకలి కులస్తులు పేదరికం, అవమానంతో జీవనం సాగిస్తున్నారని, రజకుల మనోభావాలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గౌరవించి వారిని బిసి 'ఎ' నుంచి ఎస్‌సి జాబితాలో చేర్చాలని బీహార్ విద్యుత్ శాఖ మాజీమంత్రి, ప్రస్తుత శాసన సభ్యులు శ్యాం రజక అన్నారు. చారిత్రక చాకలి మహాపాదయాత్ర అనంతరం ఆదివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన 'చాకలి పోరుగర్జన' బహిరంగ సభకు శ్యాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో రాణించాలన్నారు. ఇది సాధ్యం కావాలంటే రజకులు కలిసికట్టుగా, ఐక్యంగా ఉండాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో 30 లక్షల జనాభా ఉన్న రజకులకు విద్య, ఉద్యోగాలు, చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టిఆర్‌ఎస్ శాసన సభ్యులు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో రజకులు ఆర్థికంగా, మానసికంగా బాధపడుతున్నారని, వివాహం చేసుకోవాలన్నా,

తరువాయి 6లో

కనీస వేతనాలేవీ ?

భారీగా పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా జీతాలు పెరగక 20 లక్షల మంది ప్రైవేటు కార్మికుల కష్టాలు

మన తెలంగాణ / హైదరాబాద్ : మార్కెట్‌లో పెరిగిన నిత్యావసరాల ధరలు, ఇతర అవసరాలకు అనుగుణంగా జీతభత్యాలు లభించక ప్రైవేటు కర్మాగారాల్లో పని చేస్తున్న కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రెక్కాడితేగానీ డొక్కాడని వీరి బతుకులు దినదినగండంగా మారుతున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 4 వేలకు పైగా ఉన్న చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో ఒక్క హైదరాబాద్‌లోనే సగానికి పైగా (సుమారు 2,500) ఉన్నాయి. ముఖ్యంగా ఆటో మొబైల్, స్టేషనరీ, ప్రింటింగ్ ప్రెస్, తోళ్ళ పరిశ్రమ, లేత్ మిషన్ కట్టింగ్ యూనిట్లు, కాటన్, జిన్నింగ్ పరిశ్రమలు, పవర్‌లూమ్ వీవింగ్ పరిశ్రమలు, కార్పెట్ తయారీ పరిశ్రమలు.. ఇలా అనేక చిన్న, మధ్యతరహా పరిశ్రమలున్నాయి. వీటిల్లో సుమారు 20 లక్షల మంది కార్మికులు పని చేస్తున్నట్లు అంచనా. హైదరాబాద్ నగరంలోనే 10 లక్షల మంది కార్మికులు ఈ పరిశ్రమల్లో పని చేస్తున్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కానీ ఈ కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులకు సరైన వేతనాలు మాత్రం లభించడం లేదు. రోజుకు 8 గంటలు పని నిబంధనలు అమలుకు నోచుకోవడం లేదు. 10 గంటల పాటు పనిచేయాల్సి వస్తోంది. అయినా పనికి తగిన వేతనాలు అందడం లేదు. నెలకు 8 వేల నుండి 10 వేల లోపు వేతనాలనే యాజమాన్యాలు చెల్లిస్తున్నాయి. ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకొని కనీస వేతనంగా 18 నుండి 20 వేల వరకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ రంగంలోని పలు సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్,

తరువాయి 6లో



కశ్మీర్‌లో మోడీ విధాన వైఫల్యం

- అన్ని బలాలు ఉన్నా తప్పుడు విధానం వల్లే అపరిష్కృతం : చిదంబరం

10

సచిన్ కూతురుకు వేధింపులు

- పెళ్లి చేసుకోకపోతే కిడ్నాప్ చేస్తానని బెదిరించిన వ్యక్తి అరెస్టు

10

కత్తి x పవన్ ఫ్యాన్స్

- దర్శకుడు త్రివిక్రమ్, నటి పూనమ్‌పైనా తీవ్ర ఆరోపణలు
- సమాధానాలు చెప్పాలని ఆరు ప్రశ్నలు సంధించిన కత్తి మహేశ్

7

కుంచెపోటు



నీ మొహం.. మేఘాల్లో లేము, రన్‌వే మీదనే పొగమంచులో ఉన్నాం!

నకిలీ విదేశీ మద్యం ముఠా

- కోటి రూపాయల సరుకుతో ఆరుగురి అరెస్టు
- ట్రావెల్ బస్సు సీజ్
- ముగ్గురు పరారీ



మన తెలంగాణ/ హైదరాబాద్: నాలుగేళ్లగా చెన్నై నుంచి హైదరాబాద్‌కు నకిలీ విదేశీ మద్యం సరఫరా, అక్రమ అమ్మకాలు సాగిస్తున్న ఓ ముఠా గుట్టును ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రట్టు చేశారు. ఆదివారం ప్రైవేటు ట్రావెల్ బస్సులో తరలించిన రూ.కోటి విలువైన మద్యం (220 బాటిల్స్)ను సరూర్‌నగర్ వద్ద చాకచక్యంగా పట్టుకున్నారు. ఆరుగురు ముఠా సభ్యులను అరెస్టు చేయగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. మద్యంను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రావెల్ బస్సును సైతం సీజ్ చేశారు. ఈ ముఠాకు సంబంధించిన పూర్తి వివరాలను ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ తన కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. దూల్‌పేట్‌కు చెందిన హరీష్‌సింగ్, రాజేష్, నెల్లూరుకు చెందిన డ్రైవర్లు కాకాని భాస్కర్, గోపికృష్ణ, మలక్‌పేట్‌కు చెందిన గంజి అనీల్‌కుమార్, నిరంజన్‌రెడ్డి, పేట్ బషీరాబాద్‌కు చెందిన దాసరి మహేష్ కుమార్, ఆరాంఘర్‌కు చెందిన కార్తీక్, చెన్నైకి చెందిన మాణిక్, మార్నింగ్

తరువాయి 6లో

నిషాకారు ఢీ

మహిళ దుర్మరణం

- మరి ఇద్దరికి గాయాలు
- హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో డ్రంక్ డ్రైవింగ్ వల్ల ప్రమాదం



మన తెలంగాణ/ సిటీబ్యూరో : మద్యం మత్తులో నడిపిన వాహనం ఢీకొట్టడంతో ఓ మహిళ దుర్మరణం చెందగా, మరో ఇద్దరు గాయాలకు గురైన ఘటన జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. మాదాపూర్‌లో బ్రైట్ స్పార్క్ ప్రైవేట్ పాఠశాలను నడుపుతున్న పాల విష్ణువర్ధన్ (35) గత శనివారం రాత్రి తన మిత్రుడి వద్ద మద్యం సేవించి మాదాపూర్ నుండి జూబ్లీహిల్స్ రోడ్ నెం.10 మీదుగా (టిఎస్ 09 ఇవి 7707) కారులో వెళ్తున్నాడు. అతని మద్యం పాయింట్లు 206గా నమోదయ్యాయి. కాగా, తాడేపల్లి గూడెంకు చెందిన మస్తానీ (35) గత రెండేళ్ళ క్రితం నగరానికి వచ్చి శ్రీనగర్ కాలనీలో నివసిస్తూ బ్యూటిషియన్, జూనియర్ ఆర్టిస్టుగా పనిచేస్తున్నారు. ఆమె స్నేహితురాళ్ళు వైజాగ్‌కు

తరువాయి 6లో

అంబేడ్కర్ వర్సిటీలో డిజిటల్ తరగతి గదులకు శ్రీకారం



మన తెలంగాణ/హైదరాబాద్: ఉన్నత విద్యావకాశాలను అన్ని వర్గాల చెంతకు చేర్చే లక్ష్యంతో పని చేస్తున్న డా. బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో త్వరలోనే డిజిటల్ తరగతి గదులకు శ్రీకారం చుడుతున్నట్లు ఆ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ. సీతారామారావు తెలిపారు. యూనివర్సిటీ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన పిజి అధ్యయన కేంద్రాన్ని ఆయన ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి. ప్రొ. సీతారామారావు మాట్లాడుతూ త్వరలోనే డిజిటల్ తరగతి గదులను కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. ఇప్పటికే విశ్వవిద్యాల ప్రాంగణంలో ఎంఎస్‌సి విద్యార్థులకు అధ్యయన కేంద్రం ఉందని, సోషల్, సైన్స్ విద్యార్థుల కోసం 'మోడల్' అధ్యయన కేంద్రం ఉండాలనే ఉద్దేశంతో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో అన్ని హంగులు, వనరులు ఈ అధ్యయన కేంద్రంలో అందుబాటులోకి వస్తాయన్నారు. డిజిటల్ తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, లాంగ్వేజి ల్యాబ్, ఆడియో, వీడియో పాఠాలు అందుబాటులో ఉండాలనే యోచిస్తున్నామన్నారు. యూనివర్సిటీ గ్రంథాలయం ఆదివారం, సెలవుదినాల్లో కూడా విద్యార్థులకు అందుబాటులో ఉండేలా చూస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖాధ్యక్షులు పాల్గొన్నారు.

అందని బీమా పరిహారం

- ఇప్పటివరకు 31వేల సబ్సిడీ గొర్రెలు మృతి
- ఓవైపు రీ సైక్లింగ్.. మరోవైపు రోగాలు..
- పట్టించుకోని అధికారులు
- నీరుగారుతున్న పథకం లక్ష్యం



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు పంపిణీ చేసిన సబ్సిడీ గొర్రెలలో 31 వేలకు పైగా వివిధ అనారోగ్య కారణాలతో చనిపోయాయి. బీమా పరిహారం చెల్లించాలంటూ గొల్ల కుర్మ లబ్ధిదారులు ఇప్పటివరకు 31,597 మంది బీమా కంపెనీకి దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 4100 దరఖాస్తులను పరిశీలన అనంతరం పరిహారం చెల్లించడానికి ఆమోదించిన బీమా సిబ్బంది 2,322 దరఖాస్తుల్ని నిబంధనలకు సరిపడేలా లేవన్న కారణంతో పరిహారం చెల్లించడానికి అర్హమైనవి కావని నిరాకరించారు. అయితే చనిపోయిన గొర్రెల సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుందని, కానీ గొర్రెల ట్యాగింగ్‌లో లోపాల కారణంగా దరఖాస్తు చేసినా పరిహారం లభించదన్న అనుమానంతో చాలామంది లబ్ధిదారులు బీమా కంపెనీల దృష్టికి తీసుకురావడం లేదని వివిధ గ్రామాల్లోని లబ్ధిదారులు వ్యాఖ్యానించారు. పలు రాష్ట్రాల నుంచి సబ్సిడీ గొర్రెలను దిగుమతి చేసుకుంటున్నందువల్ల అక్కడి వాతావరణానికి, ఇక్కడకు వచ్చిన తర్వాత వాతావరణ పరిస్థితుల్లో ఇమడలేక చాలా గొర్రెలు అనారోగ్యానికి గురై చనిపోతున్నాయి. రవాణా చేసే సమయంలో కొన్ని చనిపోగా, ఇక్కడకు వచ్చిన తరువాత మరికొన్ని చనిపోయాయి. సమయానికి సరైన వైద్యం అందకపోవడంతో గొర్రెలు మృత్యువాత పడుతున్నట్లు లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికే 40వేల గొర్రెల యూనిట్ల వరకు రీ సైక్లింగ్ అయినట్లు అధికారులు అనుమానిస్తుండగా, చనిపోయినవాటికి బీమా పరిహారం రాకపోవడంతో పథకం అమలు తీరుపై విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం ఒక్క యూనిట్‌కు బీమా కింద రూ. 2,515 చెల్లిస్తోంది. ఇందులో కొంత మొత్తం లబ్ధిదారులు కూడా చెల్లించారు. దాదాపు లక్ష యూనిట్లకు సరిపోయే రూ. 25 కోట్లు బీమా ప్రీమియంను గొర్రెలు, మేకల ఫెడరేషన్, నేషనల్ ఇన్సూరెన్సు కంపెనీకి ముందుగానే చెల్లించింది. ఆ తరువాత మిగతా యూనిట్లకు సంబంధించి కొంత మొత్తం చెల్లించింది. గొర్రెలు కొనగానే రవాణకు ముందు బీమా చేయాలనే నిబంధన ఉంది. దీని ద్వారా రవాణా సమయంలో గొర్రె చనిపోయినా, బీమా వర్తిస్తుంది. పరిహారం రావాల్సి ఉన్నప్పటికీ కొనుగోలు సమయంలో సరిగ్గా బీమా చేయకపోవడంతో బీమా కంపెనీలు దరఖాస్తులను తిరస్కరిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటివరకు 2232 బీమా దరఖాస్తులను తిరస్కరించారు. కొన్నింటికి సంబంధించి అన్ని పత్రాలు సరిగ్గా సమర్పించినప్పటికీ బీమా పరిహారం విడుదల కావడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. వేగవంతంగా స్పందించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గొల్ల, కురుమలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు గొర్రెల అభివృద్ధి పథకాన్ని గత ఏడాది జూన్ 20వ తేదీన సిఎం కె. చంద్రశేఖర్‌రావు ప్రారంభించారు. రెండేళ్లలో కోటినర్న గొర్రెలు (7.18 లక్షల యూనిట్లు) పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాదిలో 3,62,445 యూనిట్ల పంపిణీ జరిగింది.

పట్టుబడిన గొర్రెలను ఏం చేద్దాం ?

అక్రమ మార్గంలో రీసైక్లింగ్ అవుతూ పట్టుబడిన గొర్రెలను ఏం చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గొర్రెలను తరలించే వారిపై కేసులు నమోదు చేసినప్పటికీ పట్టుబడిన గొర్రెలను ఎటు తరలించాలి? వాటి సంరక్షణ ఎవరు చూడాలనే దానిపై మాత్రం స్పష్టత లేదు. ఇప్పటి వరకు దాదాపు 1500 గొర్రెల వరకు అక్రమ మార్గంలో తరలుతుండగా పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడంతో కోర్టుల్లో విచారణ పూర్తయినా తీర్పు వాయిదా పడుతూ ఉంది. ప్రస్తుతం వాటిని చూసుకునేందుకు కాపరులను నియమించి, కొన్నింటిని ప్రభుత్వ గొర్రెల పెంపకం కేంద్రాల్లో సంరక్షిస్తున్నారు. దీనిపై గొర్రెల, మేకల పెంప కందార్ల ఫెడరేషన్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. గొర్రెలను విలువ రూపంలో కోర్టుకు చూపే అవకాశంపై న్యాయనిపుణలతో కూడా సంప్రదింపులు చేస్తున్నారు.

జూబ్లీహిల్స్‌లో కోడి పందేలు



- 29 మందిని అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్క్ పోలీసులు
- 27 కోళ్లు, రూ. 80వేల నగదు స్వాధీనం

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రముఖులు, సంపన్నులు నివాసముండే జూబ్లీహిల్స్‌లో కోడి పందేల స్థావరంపై ఆదివారం హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా కోడి పందేల నిర్వాహకులతో పాటు 29మంది పందెం రాయుళ్లను అరెస్టు చేశారు. వీరి నుంచి 26 పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్‌రావు వెల్లడించారు. నెల్లూరు జిల్లాకు చెందిన మల్లా వెంకటకృష్ణ (39), ప్రకాశం జిల్లాకు చెందిన తన్నేరు వెంకట ప్రసాద్ (49) వీరిద్దరు జూబ్లీహిల్స్‌లో నివాసముంటూ బిల్డింగ్ మెటీరియల్ సరఫరా చేస్తుంటారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లో కోడి పందేలు ఆడించేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు వెంకటకృష్ణ తన ఇంటిపైన ఉన్న పెంట్‌హౌస్‌లో కోడి పందేలను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బి.గట్టుమల్లు, ఎస్ఐలు వి.కిషోర్, పి.మల్లిఖార్జున్, ఎల్.భాస్కర్‌రెడ్డి, ఎం.ప్రభాకర్‌రెడ్డి ఆదివారం వెంకటకృష్ణ ఇంటిపై దాడి చేశారు. ఈ సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తున్న వీరిద్దరితో పాటు పందేలు ఆడుతున్న మరో 27 మంది పందెం రాయుళ్లను అరెస్టు చేశారు. వీరి నుంచి 27 పందెం కోళ్లతో పాటు రూ.80 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించారు.

కోడి పందాలపై నిఘా: ఆంధ్రప్రదేశ్‌కు పరిమితమైన కోడి పందాలు నగరంలో నిర్వహించడం దారుణమని టాస్క్‌ఫోర్స్ డిసిపి అన్నారు. హైదరాబాద్‌లో కోడిపందేలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాము. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా పెట్టారని, ఎక్కడైనా పందాలు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

మార్చి నాటికి గోదాములు పూర్తి

- మార్కెటింగ్ శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- అవసరమైతే ఇతర రాష్ట్రాల్లో పర్యటించాలని అధికారులకు ఆదేశం



మన తెలంగాణ/హైదరాబాద్: మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, గుజరాత్ హర్యానా తదితర రాష్ట్రాల్లో మార్కెటింగ్ ఉన్నతాధికారుల బృందం పర్యటించాలని ఆ శాఖ మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లోని మార్కెటింగ్ డైరెక్టర్ కార్యాలయంలో మంత్రి ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా రాష్ట్రాలలో వివిధ వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయలు, రైతులకు ప్రభుత్వాల నుంచి లభిస్తున్న కనీస మద్దతు ధరలపై అధ్యయనం చేయాలని సూచించారు. అలాగే పంటల దిగుబడి, వాటి కొనుగోలు విధివిధానాలను, అక్కడ అవలంబిస్తున్న మంచి పద్ధతులను పరిశీలించాలన్నారు. ఈ నెల 13వ తేదిలోగా అధికారుల బృందం నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని రైస్ మిల్లుల, జిన్నింగ్ మిల్లుల, పప్పు మిల్లుల, ఆయిల్ మిల్లుల వివరాలు, వాటి మిల్లింగ్ సామర్థ్యం, ఆయా ప్రదేశాలలో అంచనా వేసిన వివిధ పంటల ఉత్పత్తులు తదితర వివరాలను ఈ నెల 13వ తేదిలోగా సంబంధిత జిల్లా మార్కెటింగ్ అధికారులు ప్రధాన కార్యాలయానికి సమర్పించాలని మంత్రి ఆదేశించారు. 'మన కూరగాయల' విక్రయ కేంద్రాలను జి హెచ్ఎంసి సమీకృత మార్కెట్లలో అనువైన మెట్రో రైల్వే స్టేషన్లలో త్వరగా ప్రారంభిం చాలని ఆదేశించారు. మన కూరగాయల విక్రయ కేంద్రాల్లో ఆర్గానిక్ కూరగాయలు, సేంద్రియ బి య్యం అమ్మడానికి సంబంధిత రైతులను ప్రోత్సహించాలని సూచించారు. మొత్తం 330 నాబార్డు గోదాములలో మిగిలిన 18 గోదాముల నిర్మాణం, ఈ మార్చి 2018లోగా ఎట్టి పరిస్తితులలోను పూర్తిచేయాలని ఆదేశించారు. స్థల వివాదం ఉన్న గోదాములకు సంబంధించి, సంబంధిత జిల్లా కలెక్టర్లతో మాట్లాడి, స్థలం వెంటనే కేటాయించేటట్లు చూసి నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. సూర్యాపేట, చివ్వేంల తదితర ప్రదేశాలలో గోదాముల నిర్మాణానికి స్థల విషయంలో మంత్రి జగదీశ్వర్ రెడ్డితో ఫోన్ లో మాట్లాడి సమస్య పరిష్కరించి, స్థలం కేటాయించేలా చూడాలని కోరారు. కొత్తగా నిర్మించిన నాబార్డు గోదాములను సంబంధిత జిల్లా జాయింట్ కలెక్టర్లతో మాట్లడి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, భారత కాటన్ కార్పొరేషన్, భారత అహార సంస్థ తదితర ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. కేంద్ర ప్రభుత్వ 'మోడల్ చట్టం' ప్రకారం రాష్ట్రం లో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా వ్యాపారస్తు లు, కమిషన్ ఏజెంట్లకు కొత్తగా జారీచేసే లైసెన్సుల విషయంలో బ్యాంకు పూచీకత్తు విషయంలో అవగాహన కల్పించి నూతన లైసెన్స్ లు జారీ చే యాలన్నారు. 2018 మార్చిలోగా అన్ని పశువుల మార్కెట్లను ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీ చేయిం చాలని ఆదేశించారు. మార్కెటింగ్ శాఖలో చాలా కాలంగా వివిధ హోదాలలో ఉన్న ఖాళీలను త్వర తగతిన భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ బా యి ఇతర అధికారులు పాల్గొన్నారు.

భారత మత్స్యకారులు విడుదల

ఇస్లామాబాద్: తమ ప్రాదేశిక జలాల్లో చేపల వేటకు వచ్చారనే ఆరోపణలతో ఎనిమిది నెలల క్రితం అరెస్టయిన 147 మంది భారత మత్స్యకారులను ఆదివారం పాకిస్థాన్ విడుదల చేసింది. మత్స్యకారులు వాఘా సరిహద్దు ద్వారా భారత్‌కు చేరుకుంటారని కరాచి జైలు అధికారులు తెలిపారు. ఇంకా 262 మంది మత్స్యకారులు జైల్లోనే ఉన్నారని తెలిపారు. అరేబియా సముద్రంలో భారత్, పాక్ ప్రాదేశిక జలాల సరిహద్దులపై స్పష్టత లేకపోవడంతో ఇరు దేశాలకు చెందిన మత్స్యకారులు తరచు అరెస్టవుతున్నారు. పరిపాలన, న్యాయపరమైన జాప్యం కారణంగా కొన్ని నెలల పాటు మత్స్యకారులు జైళ్లలోనే మగ్గుతున్నారు.

మయన్మార్, భారత్ సరిహద్దు ప్రాంతంలో భూకంపం

- రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 6.0 గా నమోదు

న్యూఢిల్లీ: మయన్మార్, భారత్ సరిహద్దు ప్రాంతంలో ఆదివారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.0గా నమోదయింది. మధ్యాహ్నం 12.15 గంటలకు, 35 కిలో మీటర్ల లోతులో భూకంపం సంభవించిందని నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ(ఎన్‌సిఎస్) తెలిపింది. మయన్మార్, భారత్ సరిహద్దు ప్రాంతంలో 24.7 ఉత్తర అక్షాంశం, 94.7 తూర్పు రేఖాంశం వద్ద భూకంపం సంభవించిందని తెలిపింది.

లక్ష్యం చేరని వ్యవసాయ రుణాలు

- రాష్ట్రం ఏర్పడిన తరువాతే తగ్గుముఖం

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రకటనలు ఎన్ని చేసినా... లక్ష్యం పెద్ద మొత్తంలో నిర్దేశించుకున్నా.. ఆశించిన మేర రుణాలు రైతులకు అందడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో 'అగ్రి టర్మ్ రుణాలు' లక్ష్యానికి రెట్టింపుగా ఇవ్వగా రాష్ట్రం ఏర్పడిన తరువాత లక్ష్యంలో సగానికి పరిమితమవుతూ వస్తున్నాయి. గత 3 సంవత్సరాల అగ్రి టర్మ్ రుణాల లక్ష్యాలు, సాధించినవి చూస్తే రైతులకు రుణాలను ఇప్పించే విషయంలో ప్రభుత్వాలు, ఇచ్చే విషయంలో బ్యాంకులు ఎంత చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నాయో అర్థమౌతోంది. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి టర్మ్ రుణాలు 18 శాతమే ఇచ్చారంటే పరిస్థితి తీవ్రత ఎలా ఉందో అర్థమవుతుంది. 2011–12 నుంచి 2013–14 వరకు ఈ రుణాల పంపిణీ 200 శాతం ఉంది. ఇక రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014–15లో రూ. 6238 కోట్లు లక్ష్యం ఉండగా 62 శాతం రూ. 3885 కోట్లు మాత్రమే ఇచ్చారు. 2015–16కు వచ్చేసరికి రూ. 7494 కోట్ల ఇవ్వాల్సి ఉండగా రూ. 4792 కోట్లు మాత్రమే ఇచ్చారు.


2011–12 నుంచి అగ్రి టర్మ్ రుణాల వివరాలు (రూ. కోట్లలో)

సంవత్సరం	లక్ష్యం	ఇచ్చినవి
2011–12	3298	6749
2012–13	2727	5631
2013–14	2816	5641
2014–15	6238	3885
2015–16	7494	4792
2016–17	7815	5214
2017–18 (డిసెంబర్ వరకు)	10714	1948

ఆర్మూర్ డిక్లరేషన్ బూటకం

మన తెలంగాణ/హైదరాబాద్: ఆర్మూర్ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెడుతోందని టిఆర్ఎస్ ఎంఎల్‌సి టి.భాను ప్రసాద్ ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఏనాడూ రైతుల సంక్షేమా న్ని పట్టించుకోలేదని, అధికారం పోగానే రైతులపై ఎనలేని ప్రేమను కురి పిస్తోందని పేర్కొన్నారు. టిఆర్ఎస్ఎల్‌పి కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆ పార్టీ అధికారంలో రాదని, పైగా ప్రస్తుతం ఉన్న ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా దక్కదని పేర్కొన్నారు. పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి రైతుల గురించి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. అధికారంలో ఉన్న సమయంలో స్వామినాథన్ కమిటీ సిఫార్సులను పెడచెవిన పెట్టిన కాంగ్రెస్, ఇప్పుడు వాటి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మధుయాష్కిగౌడ్ తాను ఎంపిగా ఉన్న సమయంలో పసుపు బోర్డును ఎందుకు సాధించలేకపోయారని ప్రశ్నించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న 24 గంటల విద్యుత్ సరఫరాను ప్రశంసిస్తూ స్వామినాథన్ సిఎం కెసిఆర్‌కు లేఖ రాసిన విష యాన్ని ఆయన గుర్తు చేశారు.

ఉద్యమంలో విశ్రాంత ఇంజినీర్ల పాత్ర కీలకం



విశ్రాంత ఇంజినీర్ల సంఘం డైరీ విద్యాసాగర్ రావుకు అంకితం

మన తెలంగాణ/హైదరాబాద్: బంగారు తెలంగాణ నిర్మాణంలో విశ్రాంత ఇంజినీర్ల భాగస్వామ్యం కీలకమైందని పలువురు ఇంజినీర్లు, మేధావులు ప్రశంసించారు. కీలకమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందన్నారు. విశ్రాంత ఇంజినీర్ల అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని ఆర్అండ్‌బి ఇఎన్‌సిలు గణపతి రెడ్డి, రవీందర్‌రావు, జెఎన్‌టియు మాజీ విసి డి ఎన్ రెడ్డి ఆదివారం రోడ్లు, భవనాల శాఖ కార్యాలయ ప్రాంగణం లో ఆవిష్కరించారు. 'తెలంగాణ నీళ్ల మనిషి'గా గుర్తింపు పొందిన దివంగత రామరాజు విద్యాసాగర్‌రావుకు ఈ డైరీని అంకితం చేశా రు. ఈ సందర్భంగా గణపతి రెడ్డి మాట్లాడుతూ రోడ్లు, భవనాల శాఖకు ఏటా రూ.3000 కోట్లకు తక్కువ కాకుండా ప్రభుత్వం వెచ్చిస్తోందని స్పష్టం చేశారు. రవీందర్‌రావు మాట్లాడుతూ ప్రతి ఇంజినీర్ ఉత్పాదకతను పెంచాలని, సమర్థతను నిరూపించుకోవాలని సూచించారు. డిఎన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావానికి ముందూ, తర్వాతా కీలక రంగాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని చాటిచెప్పడం, వాటి పరిష్కారమార్గాలు సూచించడంలో విశ్రాంత ఇంజినీర్ల కృషి మరవలేనిదన్నారు. విశ్రాంత ఇంజినీర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సంగెం చంద్రమౌళి, శ్యాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల, డిండి ఎత్తిపోతల, కాళేశ్వరం రీడిజైనింగ్‌లో రిటైర్డ్ ఇంజినీర్లు సూచించిన కీలక ప్రతిపాదనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. పైపులైన్ల ద్వారా సాగునీటిని అందించడం ద్వారా ఎక్కువ భూమి సాగులోకి వస్తుందని, దీనిపై కేంద్ర ప్రభుత్వ స్థాయిలో అధ్యయనం జరిగిందని, అనేక దేశాలు అమలు చేస్తున్నాయని గుర్తు చేసిన శ్యాంప్రసాద్‌రెడ్డి తెలంగాణలో సైతం ఈ విధానం అమలుపై దృష్టి సారించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. గతంలోనే ఈ సూచనను ఇచ్చామని, ప్రభుత్వం కాళేశ్వరం ప్యాకేజీ 21లో అమలు చేస్తోందని గుర్తుచేశారు. గోదావరి నీటిని కావేరికి మళ్లించేలా కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌డబ్ల్యుడిఏ (జాతీయ నీటి అభివృద్ధి ఏజెన్సీ) చేసిన సూచనల్ని తాము వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. గోదావరి నదిపై అకినేపల్లికి బదులుగా తుపాకులగూడెం నుంచి నీటిని మళ్లించేలా, అందులోనూ తెలంగాణ ప్రాంతానికి ఎక్కువ లభ్యత, ఎక్కువ ఆయకట్టు ఉండేలా ప్రతిపాదనల్లో మార్పుచేర్పులు చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో డైరెక్టర్ సూర్యప్రకాశ్, రిటైర్డ్ ఇఎన్‌సి నరేందర్‌రెడ్డి, ఇంజినీర్స్ జెఏసి చైర్మన్ వెంకటేశం, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీ, హైదరాబాద్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్, చక్రధర్ తదితరులున్నారు.

సమష్టి కృషితోనే బంగారు తెలంగాణ

- ఆర్థిక, పౌర సరఫరాల శాఖ మంత్రి ఈటల

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రభుత్వం, ఉద్యోగులు వేరువేరు కాదని, పటిష్ట సమన్వయంతో సమష్టి కృషి సల్పడం ద్వారానే బంగారు తెలంగాణ సాకారమవుతుదని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యోగుల సంఘం డైరీని రవీంద్రభారతిలో ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర సాధన ఉద్యమంలో టిఆర్ఎస్ విజయం సాధించిందని, ఆ తర్వాత ఎన్నికల్లోనూ ప్రజలు పట్టం కట్టారని, ఇప్పుడు పరిపాలనలో దేశంలోనే ఉత్తమమైన పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చోటు సంపాదించుకున్నదని అన్నారు. అభివృద్ధిలో దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణను నిలబెట్టడంలో ప్రజలతో పాటు పరిపాలనలో ప్రభుత్వానికి అండగా నిలిచిన ఉద్యోగుల కృషి కారణమని ఈ సందర్భంగా మంత్రి అన్నారు.



నా డాక్టర్ డిగ్రీ తప్పని రుజువైతే రాజకీయాల నుంచి తప్పుకుంటా : లక్ష్మారెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్: కేవలం బురదజల్లే ఉద్దేశంతోనే కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి తనను వివాదాల్లోకి లాగుతున్నారని, ఎన్నికల సమయంలో తాను సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్న డాక్టర్ డిగ్రీ తప్పు అని రుజువు చేస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మంత్రి లక్ష్మారెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పటికే తాను చదువుకున్న కళాశాల గురించీ, విద్యార్హత గురించీ, డాక్టర్ డిగ్రీ గురించీ స్పష్టత ఇచ్చానని, అయినా ఉద్దేశపూర్వకంగానే రేవంత్‌రెడ్డి పదేపదే ఈ అంశాల్ని ప్రస్తావిస్తూ విషం గక్కుతున్నారని, ఇప్పటికైనా ఆయన ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేస్తే మంచిదని లక్ష్మారెడ్డి హితవు పలికారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నిజంగా తన డాక్టర్ డిగ్రీపై అనుమానం ఉన్నట్లయితే రేవంత్‌రెడ్డే పది మంది పాత్రికేయులతో ఒక కమిటీ వేసి, వారిని గుల్బర్గా విశ్వవిద్యాలయానికి తీసుకెళ్లి రుజువు చేస్తానని వ్యాఖ్యానించారు. పాత్రికేయులే ఈ అంశంలో నిజానిజాలను వెలికితీస్తారన్నారు. ఒకవేళ తాను డాక్టర్ కోర్సు చేయలేదన్న విషయం రూడీ అయితే తక్షణం రాజకీయ సన్యాసం తీసుకుంటానని అన్నారు. ఎన్నికల సంఘానికి సమర్పించిన తన అఫిడవిట్‌లో తప్పులుంటే ఆ సంగతిని ఆ సంఘం అధికారులే చూసుకుంటారని అన్నారు. సంపత్‌రావు తన క్లాస్‌మేట్ కాదని, తనకు విద్యాబోధన చేసిన గురువు అని వివరించారు.

జవాబులూ జంబ్లింగ్!

పకడ్బందీగా ఆన్‌లైన్ పరీక్షలకు ఏర్పాట్లు

మన తెలంగాణ/హైదరాబాద్: ఆన్‌లైన్ పరీక్షలు... ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబిఎ, ఎంసిఎ, లా తదితర కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షలకు సిద్ధమవుతున్న వారి నోటి నుంచి బాగా వినిపిస్తున్న మాట ఇది. ఎంసెట్, ఐసెట్, ఎడ్‌సెట్, లాసెట్ తదితర ప్రవేశ పరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహించాలని ఇప్పటికే ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఈ సారి పిఇసెట్ మినహా మిగతా ప్రవేశ పరీక్షలన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగనున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని ప్రశ్నపత్రాల లీకేజి, మాస్ కాపీయింగ్ తదితర సమస్యలకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ఏడాది ఆన్‌లైన్ పరీక్షలను ప్రవేశపెడుతోంది. ఇప్పటివరకు జాతీయ స్థాయిలో నిర్వహించే క్యాట్, గేట్, జెఇఇ పరీక్షలకే పరిమితమైన ఆన్‌లైన్ పరీక్షలు మన రాష్ట్రంలోని ప్రవేశపరీక్షలకు కూడా అమలు కానున్నాయి. ప్రవేశ పరీక్షల్లో చూచిరాతల నిరోధానికి ఇప్పటివరకు ఆఫ్‌లైన్ విధానంలో ప్రశ్నలు జంబ్లింగ్ చేసేవారు. అంటే పక్కపక్కన ఉన్న విద్యార్థుల్లో ప్రశ్నల వరుస సంఖ్య మారేది. కానీ ఈసారి సమాధానాలను కూడా జంబ్లింగ్ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అంటే ప్రశ్నల వరుస సంఖ్యతో పాటు దానికింద ఇచ్చే సమాధానాల్లోని ఎ,బి,సి,డి ఆప్షన్ల వరుస కూడా మారుతుంది. గతంలో ఎంసెట్ పరీక్షలో జవాబులకు కూడా 'జంబ్లింగ్' విధానం అమలుచేయాలనే ప్రయత్నం జరిగినా అది కార్యరూపం దాల్చలేదు. అయితే ఇప్పుడు నిర్వహించనున్న ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షల్లో ప్రశ్నలతోపాటు జవాబులు కూడా జంబ్లింగ్ చేయాలని నిర్ణయించింది. దాంతో పక్కపక్కన కూర్చున్న విద్యార్థుల ప్రశ్నలు, జవాబులకు సంబంధం ఉండదు. దీంతో కాపీ కొట్లరు. ఈసారి జరుగబోయే పరీక్షల్లో ఒక విడతలో 25వేల మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో పరీక్ష రాయడానికి అవకాశం ఉండగా, వారందరికీ ప్రశ్నాపత్రం ఒకటే అయినా ప్రశ్నల వరుస సంఖ్య, వాటి కింద ఇచ్చే జవాబుల వరుస మాత్రం మారుతుంది.

ప్రతి సెంటర్‌లో అదనంగా కంప్యూటర్లు

గత ఏడాది తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఇసెట్ పరీక్షలో తలెత్తిన సాంకేతిక సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రవేశ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రతి పరీక్షా కేంద్రంలో 10 శాతం కంప్యూటర్లను అదనంగా అందుబాటులో ఉంచుకోవాలని నిర్ణయించారు. పరీక్ష రాస్తున్న సమయంలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే వెంటనే అదనంగా ఉన్న కంప్యూటర్లను కేటాయించనున్నారు. దాంతో పాటు పరీక్షలకు సాంకేతిక సహకారం అందించేందుకు టిసిఎస్‌తో ఒప్పందం కుదుర్చుకోనున్నారు.

పెరగనున్న ఫీజులు: ప్రవేశ పరీక్షల దరఖాస్తు ఫీజులు ఈసారి పెరగనున్నాయి. ఇందుకు ఆన్‌లైన్ పరీక్షలు ఒక కారణం కాగా, వస్తు, సేవల పన్ను(జిఎస్‌టి) మరో కారణం. ఈ రెండు కారణాలతో గత ఏడాదితో పోల్చితే ఒక్కో దరఖాస్తుపై రూ.50 నుంచి రూ.100 వరకు ఫీజు పెరిగే అవకాశం ఉంది. ప్రవేశ పరీక్షలు నెల రోజుల పాటు జరుగనున్నాయి. ఆన్‌లైన్ విధానంలో రోజుకు గరిష్టంగా 25వేల నుంచి 30వేల మంది విద్యార్థులు పరీక్ష రాయడానికి అవకాశం ఉంటుంది. అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యే ఎంసెట్‌ను మే 2 నుంచి 5 వరకు నాలుగు రోజులపాటు నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే మే 9న ఇసెట్, 17న ఐసెట్, 25న లాసెట్, 26న పిజిఎల్ సెట్, 31న ఎడ్‌సెట్ పరీక్షలు జరుగనున్నాయి.

రాష్ట్రంలో తొలిసారి ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, ఈ పరీక్షలకు అలవాటుపడేందుకు, పరిజ్ఞానం పెంపొందించుకునేందుకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో మాక్ టెస్టులు ప్రాక్టీస్ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం అనేక వెబ్‌సైట్లు ఆన్‌లైన్ పరీక్షలను అందుబాటులో ఉంచుతున్నాయి. కొన్ని కళాశాలలు, శిక్షణ సంస్థలు తమ విద్యార్థులకు వీటిని అందుబాటులోకి ఉంచుతూ ఇప్పటివరకు ప్రాక్టీస్ చేయిస్తున్నారు. ఆన్‌లైన్ మాక్ టెస్టులు రాయడం వల్ల వాస్తవ పరీక్ష విధానానికి త్వరగా అలవాటుపడతారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా, ప్రశాంతంగా పరీక్ష రాసేందుకు అవకాశముంటుంది.



పారదర్శకతకు పెద్దపీట

ప్రవేశ పరీక్షలు మరింత పారదర్శకంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్ పరీక్షల విధానాన్ని ప్రవేశపెడుతున్నాం. ఈ విధానంలో పేపర్ లీకేజిలకు, మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఉండదు.

– టి.పాపిరెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్

రేవంత్‌కు రాజకీయ సమాధి తప్పదు

- **టిఎస్ఐఐసి చైర్మన్ బాలమల్లు**

మన తెలంగాణ/హైదరాబాద్: కేవలం ఉనికి కోసం, సంచలనాల కోసం కారుకూతలు కూస్తున్న రేవంత్‌రెడ్డికి ప్రజలు రానున్న ఎన్నికల్లో రాజకీయ సమాధి కడతారని టిఎస్ఐఐసి ఛైర్మన బాలమల్లు వ్యాఖ్యానించారు. నోటుకు ఓటు కేసులో అడ్డంగా దొరికిపోయి జైలుకు వెళ్ళి వచ్చినా ఆయన తీరు మారకపోవడం సిగ్గుచేటని అన్నారు. సిఎం కెసిఆర్, మంత్రులు కెటిఆర్, లక్ష్మారెడ్డిపై పరుష పదజాలంతో విమర్శలు చేస్తున్న రేవంత్‌రెడ్డి రాజకీయ భవితవ్యం త్వరలోనే తేలిపోతుందని ఒక ప్రకటనలో గ్యాదరి బాలమల్లు వ్యాఖ్యానించారు. మంత్రులను బెదిరించే తీరులో, భౌతిక దాడులను ప్రేరేపించే తీరులో బ్లాక్‌మెయిలింగ్‌లకు రేవంత్‌రెడ్డి పాల్పడుతున్నారని, కుల వైషమ్యాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే కుతంత్రాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి చిల్లర రాజకీయాలకు ఎలా బుద్ధి చెప్పాలో ప్రజలకు, టిఆర్ఎస్ శ్రేణులకు బాగా తెలుసని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరిన తర్వాత రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకం కావడంతో టిఆర్ఎస్ నాయకులపై ఆరోపణలు చేస్తూ ఎప్పుడూ ప్రజల దృష్టిలో ఉండాలని తాపత్రయపడుతున్నారని, కానీ అతని నోటిదురుసే చివరకు రాజకీయ పతనానికి దోహదపడుతుందన్నారు. తెలంగాణకు శనిగా, చీడపురుగుగా దాపురించిన రేవంత్‌రెడ్డి గతంలో తెలంగాణ వ్యతిరేకిగా, సమైక్యవాదిగా వ్యవహరించిన రేవంత్‌రెడ్డి గత చరిత్ర గురించి తెలంగాణ ప్రజలకు బాగా తెలుసని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని బాలుమల్లు ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

నేడు తుమ్మిళ్లకు శంకుస్థాపన

మన తెలంగాణ/హైదరాబాద్: తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకానికి సోమవారం నాడు ప్రభుత్వం శంకుస్థాపన చేయనుంది. రాజోలిబండ నీటి మళ్లింపు పథకం చివరి ఆయకట్టు స్థిరీకరణకు వీలుగా తుమ్మిళ్ల ఎత్తిపోతలను నిర్మిస్తున్నారు. సుంకేశుల బ్యాక్ వాటర్ నుంచి తుమ్మిళ్ల గ్రామం వద్ద నిర్మించనున్న ఈ ఎత్తిపోతల పథకానికి మంత్రి హరీశ్‌రావు నేడు శంకుస్థాపన చేయనున్నారు. తొలుత 4వతేదీనే ఈ కార్యక్రమం అనుకున్నప్పటికీ స్థానిక కారణాలతో 8కి వాయిదా వేశారు. ఇప్పటికే ఈ పనుల కోసం టెండర్లు పిలిచారు. దుమ్ముగూడెం ఎత్తిపోతల పంపులు, పైపులను ఇందుకోసం వినియోగిస్తున్నారు. రెండు దశలుగా నిర్మిస్తున్న ఈ పథకంలో తొలుత సిద్ధంగా ఉన్న ఆర్డీఎస్ కాలువల్లోకి నీటిని ఎత్తిపోస్తారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో నీటిని అందించాలని లక్ష్యం విధించుకున్నారు. రెండో దశలో రిజర్వాయర్‌ను నిర్మించి, నీటిని నిల్వ చేసి, ఆయకట్టును స్థిరీకరిస్తారు.

మైనింగ్ క్రషర్స్‌లో వడ్డెర్లకు ప్రాధాన్యం

- **భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు**



మన తెలంగాణ/ హైదరాబాద్: మైనింగ్, క్రషర్ల నిర్వహణలో వడ్డెర కులస్తులకు ప్రాధాన్యత ఇస్తామని రాష్ట్ర సహకార, సాగునీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన వడ్డెర్ల రాష్ట్ర కార్యాలయాన్ని వడ్డెర్ల రాష్ట్ర కార్యాలయాన్ని ఎంపి ప్రభాకర్ రెడ్డి, తెలంగాణ వడ్డెర లక్ష్య సాధన కన్వీనర్ రాములు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రాజు తదితరుల సమక్షంలో హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వడ్డెర్లను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తమను ఎస్‌టి జాబితాలో చేర్చాలంటూ వడ్డెర్లు చాలా కాలంగా కోరుతున్నారని, వారి ఆకాంక్షలను సిఎం కెసిఆర్ త్వరలోనే నెరవేస్తారన్న నమ్మకం తనకుందన్నారు. వడ్డెర్ల సంక్షేమానికి ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్ర బడ్జెట్‌లో ఎంబిసి కార్పొరేషన్ ద్వారా వెయ్యి కోట్లను కేటాయించిందని గుర్తు చేశారు. ఎంబిసిల కోసం ఇప్పటికే ప్రభుత్వం 119 గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిందని, వీటిని వడ్డెర విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి హరీశ్‌రావు కోరారు.

యుపిలో ఘోర రోడ్డు ప్రమాదం

- **త్రీవీలర్‌ను ఢీకొన్న ట్రక్కు, 11 మంది మృతి**

ఫిరోజాబాద్: ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌లో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక ట్రక్కు త్రీవీలర్‌ను ఢీకొనడంతో దుర్ఘటన చోటు చేసుకుంది. ట్రక్కు పల్టీలు కొడుతూ కారును ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదంలో చనిపోయిన వారిలో ఇద్దరు మహిళలు, ఒక యువకుడు, ఆరుగురు పురుషులు, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు ఫిరోజాబాద్ జిల్లా మెజిస్ట్రేట్ నేహా శర్మ తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో కాన్పూర్ నుంచి ఆగ్రా వెళుతున్న ట్రక్కు అదుపుతప్పడంతో ప్రమాదం చోటు చేసుకుంది. జాతీయ రహదారిపై మలుపు తిరిగే సమయంలో ఎదురుగా వస్తున్న త్రీవీలర్‌ను ట్రక్కు ఢీకొంది. 10 మంది అక్కడికక్కడే చనిపోగా మరో ఇద్దరు చికిత్స పొందుతూ మృతిచెందారు. సంఘటనా స్థలంలో జెసిబిని ఉపయోగించి మృత దేహాలను వెలికితీసారు. శవాలన్నింటినీ పంచనామా(పోస్ట్‌మార్టెమ్)కు పంపారు. ట్రక్కు డ్రైవర్ పరారీలో ఉన్నాడు. అతని కోసం పోలీసులు వేట సాగిస్తున్నారు.

స్టాక్‌హోం మెట్రో స్టేషన్ వద్ద పేలుడు

స్టాక్‌హోం: స్టాక్‌హోం మెట్రోస్టేషన్ సమీపంలో జరిగిన పేలుడులో ఒక వృద్ధుడు మరణించగా ఒక మహిళ గాయపడింది. రోడ్డు మీద ఉన్న ఒక వస్తువును చేతిలోకి తీసుకునే క్రమంలో అది పేలిపోయిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పేలుడు జరిగిన వెంటనే గాయపడిన వ్యక్తులను ఆసుపత్రికి తరలించారు. అందులో 60 ఏళ్ల వృద్ధుడు చికిత్స పొందుతూ మరణించాడు. పేలుడు సందర్భంగా మహిళకు ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. ఆమె ప్రస్తుతం ఆసుపత్రిలో తేరుకుంటోంది. పేలుడు పదార్థం గ్రనేడ్ అయి ఉం డ వచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మెట్రో పరిసర ప్రాంతాలను పోలీసులు తమ అదుపులోకి తీసుకున్నారు. బాంబులను నిర్వీర్యం చేసే బృందాలు రంగంలో దిగాయి. సమీప ప్రాంతాల్లో బాంబులేవైనా ఉన్నాయో లేదో పరిశీలిస్తున్నాయి. ఈ ఘటన వెనక ఉగ్రవాదుల హస్తం ఉందని చెప్పడానికి తగిన ఆధారాలు లేవని పోలీసులు స్పష్టం చేశారు. అదే విధంగా ప్రత్యేకంగా ఎవరినీ టార్గెట్ చేస్తూ జరిగిన దాడి అని కూడా చెప్పలేమని పోలీసులు తెలిపారు.

గరిష్ఠ స్థాయికి జడ్జిలు, ప్రజల నిష్పత్తి

న్యూఢిల్లీ : దేశంలో న్యాయమూర్తులు, ప్రజల మధ్య నిష్పత్తి గత మూడేళ్లలో గరిష్ఠ స్థాయికి చేరిందని న్యాయ మంత్రిత్వ శాఖ తాజాగా గణాంకాలు పేర్కొంటున్నాయి. ఓవైపు మంజూరవుతున్న పోస్టుల సంఖ్య పెరుగుతున్నా ఈ పరిస్థితి నెలకొంటోందని తెలిపింది. 2011 జనాభా లెక్కలు, సుప్రీంకోర్టులో మంజూరు చేసిన న్యాయమూర్తుల సంఖ్యను తీసుకుంటే 24 హైకోర్టులు, అనుబంధ కోర్టుల్లో నిష్పత్తి మిలియన్ (పది లక్షలు) మందికి 19.66 మంది న్యాయమూర్తులు మాత్రమే ఉన్నారని తెలుస్తోంది. 2014 నాటికి ఈ నిష్పత్తి మిలియన్ మంది ప్రజలకు 17.48కు చేరిందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. సుప్రీంకోర్టులో మంజూరైన పోస్టులు 31 కాగా, ప్రస్తుతం 25 మంది జడ్జిలతోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నదని మంత్రిత్వ శాఖ వివరించింది.

కరెంటు తీగలపై కాకుల్లా మడిపోతారు

- **ఎంపి కల్వకుంట్ల కవిత**



మన తెలంగాణ/హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగులతో పాటు పలు అంశాల్లో ఆటంకాలను సృష్టించే వారు కరెంటు తీగలపై కాకుల్లాగా మాడిపోక తప్పదని టిఆర్ఎస్ ఎంపి కల్వకుంట్ల కవిత అన్నారు. విద్యుత్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తుంటే ఓర్వలేని కొందరు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం వివిధ విద్యుత్ కార్మిక సంఘాలకు చెందిన నాయకులు, కార్మికులు కవిత సమక్షంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం(టిఆర్ఎస్ అనుబంధమైన టిఆర్‌వికెఎస్)లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆమె గులాబి కండువను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కవిత మాట్లాడుతూ విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం విద్యుత్ శాఖలో 650 సిజిఎల్‌ఎంలను నియమించాలనే అంశాన్ని తాను త్వరలోనే సంబంధిత శాఖ మంత్రి, సిఎండితో మాట్లాడుతానన్నారు. జెన్‌కోలో పనిచేస్తున్న కార్మికులకు హెల్త్ క్రెడిట్ కార్డులను ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని, విద్యుత్ ఉద్యోగుల ఆరోగ్య అంశంలో మంచి సేవలను అందించే ప్రయత్నం చేస్తామన్నారు. జెఎన్‌టియు, ఐఎంయు ద్వారా డిప్లొమా చేసిన వారికి సబ్ ఇంజినీర్‌గా అవకాశం కల్పించాలన్న అంశాన్ని అడ్వకేట్ జనరల్‌తో చర్చిస్తామని పేర్కొన్నారు. 2018లో రావాల్సిన పిఆర్‌సి అంశంపై సిఎంతో మాట్లాడుతానని, జనరేటింగ్ స్టేషన్‌లో పనిచేస్తున్న కార్మికులకు నివాస సౌకర్యం కల్పించేలా తన వంతు ప్రయత్నిస్తామని చెప్పారు. ట్రాన్స్‌కోలో 1005 పోస్టులు మంజూరయ్యాయని, ఫోర్‌మెన్ గ్రేడ్–1, గ్రేడ్–2 పోస్టులు మంజూరు కోసం కూడా ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. అసాధ్యమైన 24 గంటల విద్యుత్ సరఫరాను ముఖ్యమంత్రి కెసిఆర్ సుసాధ్యం చేసి చూపించారని, దీనికి విద్యుత్ శాఖ మంత్రి, ఉద్యోగులు ఎంతో శ్రమపడ్డారని తెలిపారు. నిరంతర విద్యుత్ సరఫరా అంశంలో దేశవ్యాప్తంగా, పార్లమెంట్‌లో కూడా ఎంతో సగౌరవంగా చెప్పుకుంటున్నామని చెప్పారు. విద్యుత్ రంగంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సిఎం పరిష్కరించారన్నారు. వివిధ సంఘాల ప్రతినిధులు టిఆర్‌వికెఎస్‌లో చేరడం సంతోషమన్నారు. కెసిఆర్‌ను, ఆయన పనులను బలపర్చడమంటే తెలంగాణ ప్రజలను బలపర్చడమేనని ఆమె వ్యాఖ్యానించారు.

24 గంటలు పాటు ఊపిరి పీల్చుకోవడం ఎంతో ముఖ్యమో, పారిశ్రామిక ప్రగతి జరగాలన్నా, వ్యవసాయ ఉత్పత్తులు పెరగాలన్నా కరెంటు ఉండాల్సిందేనని, దీనికి విద్యుత్ ఉద్యోగులు ఐక్యంగా పనిచేసి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి. శ్రీనివాస్‌రెడ్డి, టిఆర్‌వికెఎస్ అధ్యక్షుడు జాన్సన్, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్, టిఆర్ఎస్‌వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలంటూ సెల్‌టవర్ ఎక్కిన ఆదివాసీలు



మన తెలంగాణ/చర్ల: లంబాడీలను ఎస్‌టి బాబితా నుంచి తొలగించా లంటూ గత కొద్ది రోజులుగా ఆదివాసీలు చేపట్టిన ఉద్యమం ఆదివారం కొత్త మలుపు తిరిగింది. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ ఖమ్మం జిల్లా చర్లకు చెందిన 20 మంది ఆదివాసీ యువకులు సెల్ టవర్లు ఎక్కారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు నూపా నాగేశ్వరరావు, పాండ్రు సుందర్‌ల ఆధ్వర్యంలో 20 మంది ఆదివాసీ యువకులు ఆంధ్రా బ్యాంకు వెనుక గల రెండు సెల్ టవర్లను ఎక్కారు. విషయం తెలుసుకున్న చర్ల ఎస్ఐ సత్యానారాయణ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు గోబ్యాక్, కలెక్టర్ ఇక్కడికి రావాలి, లేదంటే తాము టవర్ పై నుంచి దూకి చస్తామంటూ నినాదాలు చేశారు. లంబాడీలను ఎస్‌టి బాబితా నుంచి తొలగించాలని, ఏజెన్సీ ప్రాంతంలో 144 సెక్షన్‌ను ఎత్తివేయాలని, మేడారం ట్రస్టు బోర్డు కమిటీలో లంబాడీలను తొలగించాలని, ఆదివాసీలపై ఉద్యమ సమయంలో పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఆ యువకులు టవర్‌పై నుంచి డిమాండ్ చేశారు. సుమారు రెండు గంటల పాటు సెల్ టవర్ మీద ఉన్న యువకులు కిందికి దిగకపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఎస్ఐ సత్యనారాయణ ఆదివాసీల నాయకులు సుందర్, నాగేశ్వరరావులతో చర్చలు జరిపి వారి డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళతామని హామీ ఇవ్వడంతో ఆదివాసీ యువకులు సెల్‌టవర్ దిగొచ్చారు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

చర్లపల్లి జైలులో ఖైదీ మృతి

మన తెలంగాణ/సిటీబ్యూరో:చర్లపల్లి జైలులో జీవిత ఖైదు శిక్షను అనుభవిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గురప్ప ఆదివారం మృతి చెందాడు. 2016లో ఓ హత్య కేసులో మహబూబ్‌నగర్ కోర్టు అతనికి శిక్ష వేసింది. అప్పటి నుంచి గురప్ప చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. అయితే గురప్ప మృతికి గల కారణాలు తెలియరాలేదు.

నిబంధనలకు రవాణా శాఖ పాతర

- **ఇష్టానుసారంగా జరిమానాల వసూలు**
- **వాహనదారుల ఇబ్బందులు**



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర రవాణా శాఖ నిబంధనలకు నిత్యం పాతరేస్తూ ఆదాయమే పరమావధిగా వాహనదారుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నది. కొత్త నిబంధనల పేరుతో వాహనదారుల నుంచి అధికారులు వేలకు వేలు జరిమానాలను వసూలు చేస్తుండడంతో వాహనదారులు, ఆటో డ్రైవర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రవాణా సేవల చార్జీలు, ఆలస్యానికి జరిమానాలను పెంచుతూ కేంద్ర రోడ్డు రవాణ, రహదారుల మంత్రిత్వ శాఖ 2016 డిసెంబర్ 29న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా ఆ నిబంధనలను రాష్ట్ర రవాణా శాఖ 2017 జనవరి 11వ తేదీ నుంచి అమలు చేస్తున్నది. అయితే అప్పటికే గడువు తీరిపోయిన డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనాల ఫిట్ నెస్, కొత్త వాహనాల రిజిస్ట్రేషన్లు తదితర ధృవీకరణ పత్రాల రెన్యూవల్‌కు కూడా కొత్త నిబంధనల ప్రకారం జరిమానాలను వసూలు చేయడం గమనార్హం. గత రెండు రోజుల కింద సంతోష్ (పేరు మార్చాం) అనే వాహనదారుడు 2015 అక్టోబర్‌తో గడువు ముగిసిన తన డ్రైవింగ్ లెసెన్సును రెన్యువల్ చేసుకునేందుకు హైదరాబాద్‌లోని ఈస్ట్ జోన్ ఆర్‌టిఎ కార్యాలయంలో దరఖాస్తు చేసుకో గా రూ.835ల ఛార్జీలతో పాటు ఏకంగా రూ.4 వేల జరిమానా చెల్లించాలని చెప్పడంతో ఆయన ఒక్కసారిగా కంగుతిన్నాడు. కొత్త నిబంధనలు 2017 జనవరి 11 నుంచి అమలులోకి వచ్చినప్పటికీ 2015లో గడువు తీరిపోయిన ధృవీకరణ పత్రాలకు పాత నిబంధనలనే వర్తింపజేయాలి. ఆ లెక్కన 2015లో గడువు తీరిన డ్రైవింగ్ లైసెన్సు రెన్యువల్‌కు అప్పటి నుంచి ఐదేళ్ళ పాటు రూ. 100 లను మాత్రమే వసూలు చేయాలి. అలాకాకుండా 2017 జనవరి 11వ తేదీకి ముందు గడువు తీరిన ధృవీకరణ పత్రాల రెన్యువల్‌కు కూడా కొత్త నిబంధనలను అమలు చేస్తూ భారీ ఎత్తున వేల రూపాయలను వసూలు చేస్తున్నారని వాహనదారులు లబోదిబోమంటున్నారు.

గతేడాది ఫిబ్రవరిలో రవాణ శాఖ కొత్త నిబంధనలను అమలు చేస్తూ ఆటో ఫిట్‌నెస్ కోసం పెంచిన ఛార్జీలు, జరిమానాల ప్రకారం ప్రతి రోజూ రూ.50ల చొప్పున రూ.53 వేల జరి మా నా చెల్లించాలని రవాణా శాఖ నోటీసులిచ్చింది. దీనిపై స్పందించిన లారీ, ఆటో డ్రైవర్ల సంఘాల నాయకులు, వాహనదారులు కేంద్ర రోడ్డు రవాణ శాఖకు ఫిర్యాదు చేయగా పెంచిన ఛార్జీలు, జరి మానాల వసూలుపై స్పష్టతనిస్తూ కేంద్ర రోడ్డు రవాణా శాఖ సర్క్యులర్ జారీ చేసింది. 'డిసెంబర్ 29వ తేదీ కంటే ముందుకు సంబంధించిన రవా ణా సేవలపై కొత్త ఛార్జీలు, జరిమానాలు వసూలు చేయవద్దు' అని సర్క్యులర్‌లో స్పష్టం చేశారు. అయినప్పటికీ ఇప్పటికీ రాష్ట్ర రవాణా శాఖ వాహనదారుల నుంచి పెంచిన జరిమానాలను వసూలు చేస్తూనే ఉన్నది. రాష్ట్ర రవాణ శాఖకు ఎప్పుడు చూసినా ఆదాయాన్ని ఎలా రాబట్టాలనే యావ తప్ప వాహనదారులకు సరైన సేవలందించి న్యాయ బద్ధంగా డబ్బులు తీసుకుందామనే ఉద్దేశ్యమే కన బడడం లేదని వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా రవాణ సేవల ఛార్జీలు, జరిమానాల వసూలును ప్రభుత్వం పూర్తి గా కంప్యూటరీకరించిందని, వాహనదారులు సేవల కోసం దరఖాస్తు చేసుకోగానే వారికి వర్తించే ఛార్జీలు, జరిమానాలు అందులో స్పష్టంగా వస్తాయ ని, తాము చేసేదేమీ లేదని అధికారులు, సిబ్బంది చెబుతున్నారు.

వెంకయ్యకు ఘన స్వాగతం



మన తెలంగాణ/హైదరాబాద్: ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆదివారం నాడు హైదరాబాద్‌కు చేరుకున్నారు. బేగంపేట విమానాశ్రయంలో వెంకయ్య నాయుడుకు ఈ సందర్భంగా గవర్నర్ నర్సింహన్, శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీతో పాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

ప్రభుత్వ తీరుపై పార్లమెంటరీ ప్యానెల్ అసంతృప్తి

న్యూఢిల్లీ : ఐఎఎస్, ఐపిఎస్ అధికారులకు జీతాలు, అలవెన్సుల రూపేణా ఎంత వ్యయం చేస్తున్నారన్న సమాచారాన్ని ఇవ్వకపోవడంపై పార్లమెంటరీ ప్యానెల్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్‌లు జాతీయ ప్రగతి కోసం చేస్తున్న కృషిపై సరైన విధానాన్ని అవలంబించాలని అంచనాల కమిటీ ఇటీవల అందజేసిన నివేదికలో పేర్కొంది. రాష్ట్రాల్లో, కేంద్రంలో ఐఎఎస్, ఐపిఎస్ అధికారులకు జీతాలు, అలవెన్సులకు ఎంత వ్యయమవుతుందన్న వివరాలను అందించకపోవడంతో కమిటీ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసిందని బిజెపి నాయకుడు మురళీ మనోహర్ జోషీ నేతృత్వంలోని ప్యానెల్ నివేదికలో పేర్కొంది. దీంతో కేంద్రం ఈ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వాలు, కేం ద్రం వెచ్చిస్తున్న మొత్తంపై సంవత్సరాల వారీగా మూడు మాసాల్లో కమిటీకి అందజేసే అవకాశముంది. అయితే, ఈ సర్వీసుల ద్వా రా దేశానికి అందుతున్న సేవలపై నివేదిక అందించేందు కు ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రయత్నం చేయకపోవడం పట్ల కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికీ ఈ సేవలను లెక్కించేందుకు అవసరమైన విధానమేదీ ప్రభుత్వం వద్ద లేదని కమిటీ పేర్కొంది.

నేడు హనుమంతరావు సంస్మరణ సభ



మన తెలంగాణ/హైదరాబాద్: చతుర్విధ జలప్రక్రియ రూపకర్త, ప్ర పంచ బ్యాంకు మాజీ కన్సల్టెంట్, రిటైర్డ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ టి.హను మంతరావు సంస్మరణ సభ సోమవారం నాడు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్‌లో జరగనుంది. హనుమంతరావు మరణించి ఏడాది అయిన సందర్భంగా కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో సంస్మరణ సభ జరుగుతోంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు కలిగేలా చతుర్విధ జల ప్రక్రి యను వాటర్ షెడ్ ప్రోగ్రాం పేరుతో ఉమ్మడి రాష్ట్రంలో అమలు కావడంలో హనుమంతరావుది కీలకపాత్ర. నాలుగేళ్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు జల సంరక్షణ మిషన్ సాంకేతిక కమిటీ చైర్మన్‌గా కూడా హనుమంతరావు వ్యవహరించారు. ఇరిగేషన్ రంగంలో చేసిన సేవలు గుర్తుచేసేలా సభ ఉంటుందన్నారు.



బిసిల తెలంగాణ కథ



డా.చింతం ప్రవీణ్ కుమార్
9346 886 143


తెలంగాణ సమాజం భిన్న అస్తిత్వాల సముదాయం. ప్రతీ అస్తిత్వం దేనికదే ప్రత్యేకం. ఒక వ్యక్తి అనేకమైన అస్తిత్వాలు కలిగి ఉంటాడనేదానికి తెలంగాణ రాష్ట్రమే ఒక చక్కని ఉదాహరణ. ఈ బహుళ అస్తిత్వాలే తెలంగాణ రచనల్లో వైవిధ్యం రావడానికి కారణమైనాయి. ఇందుకు తెలంగాణ కథ మినహాయింపేమి కాదు. బండారు అచ్చమాంబ మొదలుకుని నేటి ఆధునిక యువ రచయితల వరకు ఈ వైవిధ్యాలు వారివారి రచనల్లో కొనసాగుతున్నాయి.

ముఖ్యంగా తెలంగాణానే ఒక వెనుకబడిన ప్రాంతం.అందులోనూ వెనుకబడిన తరగతులైన బహుజనుల పరిస్థితి మరీ దుర్భరం. టచబుల్స్‌గా ఉన్న ఈ సమాజం కేవలం చాకిరీ కులాలుగా మాత్రమే మిగిలారు. అన్‌టచబుల్స్‌గా దళితులు ఊరవతల ఎదుర్కొన్న వివక్ష ఒక విధమైతే ఊరిలో ఉన్న ఈ బహుజన్ టచబుల్స్ ఎదుర్కొన్న వివక్ష మరో విధం. స్పృశ్యులుగా ఉన్న ఈ బహుజనులు చాకిరీలోను,వెట్టి చాకిరీలోనూ,అవమానాల్లోనూ,అత్యాచారాల్లోనూ తీవ్ర హింసకు గురయ్యారు. కేవలం ఊరిలో ఉంటున్న మాటేగాని జంతువుల్లా స్వేచ్ఛ లేకుండా జీవించిన చరిత్ర బహుజనులది. దొరోడి కచ్చరం ముందు పరిగెత్తే దగ్గర నుండి దొర గడీలకు సర్వం అర్పించుకున్నారీ బహుజనులు. దొరోడి పొలానికి నాగళ్ళ తయారీ నుండి దుక్కి దున్ని పంట చేతికొచ్చే వరకు చెమట చిందించింది బీసీ బహుజనులే. ఫలితంగా పంట దొరోడికి చెందగాపరిగె బీసీలకు మిగిలేది. దీనికి తోడు నిజాం దోపిడీ పీడనలు దీనికి అదనం.

ఊరికి ఊరవతలకి వారధిగా ఉన్న ఈ శూద్రులను చూస్తే ఊరవతల ఉన్న దళితులకు కూడా కోపమే. ఎందుకంటే ఇష్టమున్నా లేకున్నా అగ్రవర్ణాల ఆజ్ఞలను అమలు చేయాల్సింది బీసీలే కదా. బీసీలకు సొంత జీవితం ఎక్కడుంది?ఎవరో కొందరు అగ్రవర్ణ బీసీలు దళితుల పట్ల చూస్తున్న చిన్నచూపుకు మొత్తం బీసీ జాతిని దళితులు అనుమానించాల్సిన పరిస్థితి. కాని కొన్ని అగ్రకులాలను అనుసరించే బీసీ కులాలు మినహా మిగతా వారికి స్వేచ్ఛ ఎక్కడిది?శూద్ర బీసీ ఉమ్మి నిషేదంఅడుగులు నిషేదంపాదరక్షలు నిషేదం...కాని వాడి శ్రమ అంగీకారం. ఇవన్నీ ఒక ఎత్తయితే కోపమొచ్చిన దొరోడు కోరికొచ్చిన దొరోడు తమ ప్రతాపాన్ని చూపెట్టేది ఊర్లో ఉన్న బీసీల మీదనే కదా. కనుక ఆధిపత్య కులాల ప్రవర్తనను బట్టి ఊరి బీసీల జీవితం మారుతా ఉండేదని చరిత్ర స్పష్టంగా చెబుతున్నది. చరిత్ర ఎందుకు నిజాం పాలన నుండి నేటి వరకూ తెలంగాణాలో బీసీల జీవితం అలానే ఉంది ఎటువంటి మార్పు లేకుండా

తెలంగాణ ప్రాంతం ఆంగ్లేయుల ప్రత్యక్ష పాలనలో లేకపోవడం..,నిజాం పాలనలో తెలంగాణ బందీ అయ్యి ఉండడం..,ఆ నిజాం దోపిడీ పీడనలకు దొరలు,పటేల్,పట్వారీలు,వతన్‌దారులు వత్తాసు పలికి ఆ ఆజమాయిషీనంత ఊరి బహుజనులపై చూపెట్టేది. ఫలితంగా ఊర్లో ఉన్న సబ్బండ వర్ణాలు తీవ్ర పీడనకు గురయ్యేటివి. ఇవన్నీ ఊర్లో ఉండడం చేత బీసీ బహుజనులు ప్రత్యక్షంగా ఎదుర్కోవలసి వచ్చేది. ఇంకొంత ముందుకు వస్తే...తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వేలాది మంది బహుజనులు ఊర్లో ఉన్న ఫలానికి ఊచకోత కోయబడ్డారు.ఈ కాలంలోనే జరిగిన రజాకార్ల,మిలిటరీ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిందీ...అత్యాచారాలకు గురైంది బహుజనులే.

ఆ తర్వాత 69లో వచ్చిన తెలంగాణ తొలిదశ పోరాటంలో ప్రాణాలు కోల్పోయింది మెజార్టీ బహుజనులే. ఆ తర్వాత 90ల్లో వచ్చిన ప్రపంచీకరణ బహుజనులను నిండా ముంచి నిలువనీడ లేకుండా చేసింది. ఆ దెబ్బ నుండి నేటికీ కోలుకోకుండా వలసబాట పడుతూనే ఉన్నది బహుజన సమాజం. ఆ తర్వాత మలిదశ తెలంగాణ ఉద్యమంలో వెయ్యికి పైగా అమరులైంది బహుజనులే. ఇంత గోస,త్యాగం కలగలిసిన బహుజన జీవితాల్లో పత్తి రైతు ఆత్మహత్యలు,ఎన్‌కౌంటర్ మరణాలు, ఆర్థిక మరణాలు, ఆకలి చావులు, నిరుద్యోగితా చావులు, వలస చావులు ఇవన్నీ బహుజనులను అల్లకల్లోలం చేసాయి. మొత్తంగా బతకడమే అనుమానాస్పదమైన బీసీ జీవితాలను తెలంగాణ కథ పైన పేర్కొన్న అన్ని అంశాలను దాదాపుగా అక్షరాలా చిత్రిక పట్టింది. కవిత్వంతో పోలిస్తే తెలంగాణ కథ మిక్కిలి ఎక్కువగా బహుజనుల తరపున నిలబడిందిబహుజనుల గొంతుకై నిలిచింది. అయితే ఈ బహుజనుల జీవితాలు ఇలా ఉండడానికి కారణం రాజ్యం,రాజ్యస్వరూపం అని చెప్పిన తెలంగాణ కథ ఈ రాజ్యం మనదని...అత్యధికులైన బీసీల ఓటు శక్తితోనే ఈ రాజ్యానికి ఒక రూపం వచ్చిందని చెప్పడంలో మాత్రం విఫలమైంది. ఇంత త్యాగపూరితమైన

డా॥ కాలువ మల్లయ్య | బి.ఎస్.రాములు

బహుజన సమాజం...తమ చెమటను ఇంధనంగా సమాజాన్ని నడుపుతున్న బహుజన సమాజం రాజ్యాంగం ద్వారా రాజ్యాధికారం వైపు పయణించాలని చెప్పడంలో తెలంగాణ కథ తడబాటు చెందింది. త్యాగాలు ఎవరివిభోగాలు ఎవరివని ప్రజలను చైతన్యపరచడంలో నిర్లక్ష్యం వహించింది. బీసీ బహుజనులకు ఈ బానిస మనస్తత్వం ఎందుకు ఇంతలా చొరబడిందో?నని చెప్పడంలో బహుజన కథకులు అలసత్వం వహించారు. మరీ ముఖ్యంగా బహుజన కథలను నేరుగా కాకుండా పేదరికం అని..,మధ్యతరగతి అని కథల్లో పొందుపరచడం వలన బహుజన జీవితాల వాస్తవ జీవిత చిత్రణ జరగలేదు. ఫలితంగా బహుజన జీవితాల కుల సంస్కృతులు,కుల చరిత్ర, కుల మనస్తత్వాలు..అన్నింటికంటే ముఖ్యమైన కులచైతన్యాలు బయటికి రాలేదు. బహుజన రచయితలు ఈ కుల చైతన్యాన్ని ప్రస్తావించకుండా చాలా మట్టుకు వారి స్థితిని మాత్రమే ఏకరువు పెట్టారు. బీసీ కులాల్లో బీసీఏ సేవా కులం,బీసీబి శ్రామిక కులం,బీసీడి ఉత్పత్తి కులం...ఇందులో ప్రతీ కులం ఒకొక్క తరహాలో ఒక్కో కుల అస్తిత్వాన్ని,కుల చైతన్యాన్ని కలిగి ఉన్నాయి.బహుజన కథ ఈ అంశాన్ని అంత ప్రాముఖ్యమైన అంశంగా తీసుకోలేదు ఎందుకనో? దీనికి ఈ రచయితలకు బహుజన దృక్పథం లేకపోవడమే అని అర్థం చేసుకోవచ్చు. చాలామట్టుకు బహుజన రచయితలు బహుజన జీవితాలను ఆర్థిక కోణం నుండే చూసి వారి పేదరికాన్ని,వారి బాధలను ఏకరువు పెట్టడం వలన వారి ఆర్థిక స్థితిగతులు ఆ విధంగా ఉండడానికి ఆర్థిక అంశాలే కారణమన్నట్టుగా ఈ రచయితల రచనలు కొనసాగాయి.సరే ఆర్థిక స్థితిగతులు ఇలా ఉన్నాయి అని చెప్పినప్పుడు వాటిని అధిగమించడానికి మళ్ళీ ఉద్యమాలు,విప్లవాలనే సూచించారు తప్ప బహుజనులు పోరాటం చేయాల్సింది రాజ్యాధికారం కోసమని చెప్పిన రచయితలు తక్కువ.

తెలంగాణ బహుజన కథలను పరిశీలిస్తేకాలువ మల్లయ్య, బి.ఎస్ రాములులాంటి కొందరు మినహాయిస్తే చాలా మంది రచయితలు బహుజన కథలను బహుజన ఐడియాలజీ నుండి రచించినవి తక్కువ.''తెలుగు కథలో రచయితలు ఎక్కువ మంది రచయితలు అగ్రకులాల వారు కావడం చేత వాళ్ళ జీవితాలే అందులో ప్రతిఫలించాయని,బహుజన రచయితలు సైతం వాళ్ళ మార్గంలోనే ప్రయాణిస్తూ తమ స్వీయ జీవిత చిత్రణను మరిచిపోయారని విమర్శకు పెట్టారు బహుజన తత్వవేత్త బి.ఎస్ రాములు. వామపక్ష ఉద్యమ స్ఫూర్తితో కథలు రాసిన బహుజన కథకులు అనేకులు తమ తమ కులమూలాలను విస్మరించి కథలు రాశారని,వాళ్ళకు బహుజన రక్త సంబంధాలు,వాళ్ళ సంస్కృతివంటివి కనిపించకుండా పోయాయని అభిప్రాయపడ్డారాయన. ఈ అభిప్రాయం తెలంగాణ బహుజన రచయితలకు ముమ్మాటికీ వర్తిస్తుందనడంలో సందేహం లేదు.

ఇదిలా ఉంటే,బహుజన సామాజిక వర్గాల జీవిత చిత్రణ విషయంలో తెలంగాణాతో పోలిస్తే ఉత్తరాంధ్ర,కోస్తాంధ్ర రచయితలు చాలా వెనకబడిపోయారన్నది నిజం. దీనికి కారణం తెలంగాణ దళిత,బహుజనుల జీవితాల్లో ఉన్న పీడనలు,నిర్బంధం,అణిచివేతలు ఈ స్థాయిలో ఉత్తరాంధ్ర,కోస్తాంధ్ర ప్రాంతంలో లేవు. తెలంగాణఆంధ్రప్రదేశ్ ఏర్పాటు,విభజన విషయాల్లోనూ ఇక్కడి దళిత బహుజనుల రచయితలున్నంత చైతన్యంగా అక్కడి వారు లేరు.

ఇంతెందుకు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంలో కూడా వచ్చే తెలంగాణను ఏలేది ఎవరు?అనే ప్రశ్నను లేవనెత్తింది ఇక్కడి దళిత బహుజన రచయితలే. కనుక ఇక్కడి బహుజన రచయితలకు పోరాట చైతన్యం ఎక్కువ. అయితే ఈ పోరాట చైతన్యం ఉద్యమాల్లో,పోరాటాల్లో మాత్రమే కనబడి అసలు విషయమైన ఓటు చైతన్యం దగ్గర కనిపించకపోవడం అసలు లోపం. ఈ విషయంలో ఇంకాస్త ముందుకెళితే దళిత రచయితలకు బాబాసాహెబ్,కాన్షీరాం స్ఫూర్తి, ఓటు బ్యాంకు చైతన్యం ఉంది. కాని బీసీ బహుజన రచయితలు ఇంకా ఓటు చైతన్యం అనే అంశాన్ని అంత సీరియస్ అంశంగా తీసుకోవట్లేదు...కనుకనే తెలంగాణ బీసీ రచయితల కలాల్లోంచి వేల కథలు వెలువడ్డా ఓటు చైతన్యం అనే అంశం ఎక్కడా కనబడదు. ఫలితంగా తెలంగాణ బహుజన కథలు రాజ్యాధికార కథలుగా రూపొందడంలో విఫలమైనాయి. కనుకనే బీసీ కథ అంటే కులవృత్తులు,వృత్తుల ధ్వంసం,ఉన్న ఊరు,కన్నతల్లి,వలసలు,ఆత్మహత్యలు,పేదరికం,ప్రపంచీకరణ దగ్గరే ఆగిపోయింది.కేవలం స్థితిగతులను చిత్రిక పట్టిన కథల వలన తాత్కాలిక ఉపశమనాన్ని బహుజన పాఠకుడు పొందుతాడేమో కాని బహుజనుల జీవితాల్లో సమూల మార్పు రావాలంటే,సామాజిక న్యాయం కోసం పోరాడాలని..,అప్పుడే సామాజిక మార్పు సాధ్యమని అయితే ఆ సామాజిక మార్పు రాజ్యాధికారం ద్వారా మాత్రమే సాధ్యమనే విషయాన్ని మొదట బహుజన రచయితలు విశ్వసించగలగాలి. దానికి ఓటు చైతన్యం ముఖ్యమనే విషయాన్ని బలంగా చెప్పగలగాలి. ఏదేమైనా 'పొలిటికల్ పవర్ ఈస్ ద మాస్టర్ కీ' అని తెలియజేసే కథలు విస్తృతంగా వెలువడాల్సిన అవసరం ఉంది.ఈ చైతన్యం తెలంగాణ పోరాటాల గడ్డలో అంత కష్టమైందేమి కాదు ఎందుకంటే ఇక్కడ ఏదైనా ఆరంభమే కష్టం అందుకుంటే ఇక ఎదురుండదు.

అయితే ఇటీవల తెలంగాణ బహుజన రచయితల్లో పెరుగుతున్న ఫూలేఅంబేద్కర్ భావజాలం దృష్ట్యా, జనాభా దామాషా ప్రకారం ''మేమెంత మందిమో మాకంత వాటా'' ఉద్యమాలు పెరుగుతున్న దృష్ట్యా ఓటు చైతన్యంరాజ్యాధికారంలాంటి బహుజన భావజాలాన్ని తెలంగాణ రచయితలు తమ కథల్లో కథాంశంగా విరివిగా అక్షరీకరించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇది శుభ పరిణామం.

మనో కాలుష్యం



మనిషి ఎదుగుదలను నిరోధించే
అవరోధాల అవలక్షణం

మానసిక వికాసాన్ని అడ్డుకునే
మనో కాలుష్యం
పచ్చ కామెర్ల ఆక్వేరియంలో
కదలాడే కుబుద్ధి వికాసం

ఈర్ష్య...
మానవీయ విలువల ధ్వజస్తంభాన్ని కుళ్ళబొడిచే కుటిలబుద్ధి చెదలు
విచక్షణను విధ్వంసం చేసే తీక్షణ
మానసిక క్షోభ

మురుగు కాలువ ప్రవాహంలో పొంగే సంకుచిత నురగల తరగలు
పొట్టిదైన తొట్టిలో పెరిగే మానసిక
మరుగుజ్జు మర్రిచెట్టు

మానవ సంబంధాలపై చెవిటికి
ఉద్బోధించే మూగవాడి ఉపన్యాసం
మనస్సును వికారాల పొరలు కప్పిన ఆనందానుభూతుల భ్రాంతి
ఈర్ష్య....
మనో దర్పణాన్ని మసకబారించే దట్టమైన దుర్వాసనా
దుష్ప్రభావాల పొగమంచు

బంధు మిత్ర బాంధవ్యాల వ్యాప్తిని వెక్కిరించుతున్న వెర్రి తెలివి
అభివృద్ధి వైపువేసే అడుగులకు సంకెళ్లు
ట్రేడ్ మిల్లు పట్టాలపై పరుగెత్తే పురోగతి

దానిని వదిలేస్తేనే
విశాల సహృదయ అభినందనీయ సంస్కారం
సకుటుంబ ఆయురారోగ్యాభివృద్ధే శ్రేయస్కరం

యాదయ్య కొప్పోలు, 9494273703

తొలితరం కవి కాంచనపల్లి



కడివెండి మమత
9440402691

స్వాతంత్ర్య పోరాట యోధునిగా, రాజకీయ నాయకునిగా, న్యాయవాదిగా చరిత్ర గర్వించదగ్గ మహామనిషి కాంచనపల్లి చినవెంకట రామారావు. ఈయన స్వగ్రామం నల్లగొండ పట్టణ సమీపంలోని చారిత్రాత్మకమైన పానగల్లు. 10 ఏప్రిల్ 1921న కాంచనపల్లిలో జన్మించారు. తల్లి శేషమ్మ, తండ్రి కాంచనపల్లి రామచందర్‌రావు.

కాంచనపల్లి రెండు సంవత్సరాల వయసులో ఉండగా తల్లి కాలం చేసింది. ఆ తర్వాత కాంచనపల్లి తండ్రి రామచందర్ రావు తాయమ్మను రెండో వివాహం చేసుకున్నారు. ఆమెకు ముగ్గురు కుమారులు. కాంచనపల్లి ఆలనాపాలనా అమ్మమ్మ, పెదతల్లి సీతమ్మ చూసుకునేవారు. కాంచనపల్లి తండ్రి రామచందర్ రావు భూస్వామి. రెండు వందల ఎకరాల ఆసామి. పానగల్లు, తిప్పర్తి మండలం సర్వారం గ్రామాలలో భూములుండేవి.

కాంచనపల్లి బడి ఈడుకు వచ్చేనాటికి నిజాం పాలన కొనసాగుతూనే ఉంది. నాడు ఉర్దూ మీడియం పాఠశాలలే అందుబాటులో ఉండేవి. కాంచనపల్లి ఉర్దూ మీడియంలోనే చదువుకున్నారు. విద్యార్థి దశలోనే ఆయనకు పత్రికలు చదవడం అలవాటయ్యింది. నాడు షబ్నవీసు వెంకట రామ నర్సింహారావు సంపాదకత్వంలో వెలువడిన 'నీలగిరి' పత్రిక ఆయనపై ప్రభావాన్ని చూపింది. సాహిత్యంపై అభిమానం కలిగింది. హైదరాబాద్‌లో న్యాయవిద్యను చదువుకున్నారు. అప్పటి అయిదో ఆంధ్ర మహాసభ(1936)ఆరో మహాసభలకు(1937) మిత్రులతో కలిసి సైకిల్‌పై పోయి హాజరయినారు. దేవుపల్లి రాఘవేంద్రరావుతో కలిసి బ్రిటిషాంధ్రలో పర్యటించారు. బెజవాడలో ఖద్దరు బట్టలు కొనుక్కొని నాగపూరు వందే మాతరం ఉద్యమంలో పాల్గొన్నారు. 1941 లో న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించారు. మూడవ ఆంధ్ర మహాసభ అధ్యక్షుడు, న్యాయవాది పులిజాల వెంకట రంగారావు వద్ద జూనియర్‌గా చేరారు. సాయుధ పోరాటంలో పాల్గొని ఉరిశిక్షకు గురైన నల్లా నరసింహులు, బాల నిందితుడిగా జైల్లో మగ్గిన ఎర్రబోతు రాంరెడ్డి తదితర కామ్రేడ్ల తరఫున వాదించారు. ఆంధ్రమహాసభల్లో కాంచనపల్లి చురుకుగా పాల్గొన్నారు. భువనగిరిలో రావి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన పదకొండవ ఆంధ్ర మహాసభ నాటికి ఆయన అతివాదుల వైపు మొగ్గు చూపారు. ఆ తర్వాత కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వం తీసుకున్నారు. సాయుధ పోరాట కాలంలో కృష్ణాజిల్లా రామాపురం గ్రామంలో అరెస్టు అయినారు. కడలూరు, రాయవెల్లూరు, వరంగల్లు జైళ్లలో ఏడాది శిక్షను అనుభవించారు. 1964 కమ్యూనిస్టు పార్టీ చీలిక సమయంలో కూడా కాంచనపల్లి అరెస్టు అయ్యారు. రాజమండ్రి, ముషీరాబాద్ జైళ్లలో గడిపారు. 1952 లో మొదటి సార్వత్రిక ఎన్నికల్లో నల్లగొండ జిల్లా చినకొండూరు నియోజకవర్గం నుంచి శాసనసభ్యునిగా పిడిఎఫ్ తరుపున ఎన్నికైనారు. శాసనసభాపక్ష ఉపనాయకునిగా పనిచేశారు. 1962లో నల్లగొండ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. జిల్లా బోర్డు ఉపాధ్యక్షునిగా నల్లగొండ జిల్లా సహకార మార్కెటింగ్ డైరెక్టరుగా కూడా పనిచేశారు. ఈ కాలంలోనే ఆయన పానగల్లు మ్యూజియం ఏర్పాటుకు ఎంతో కృషి చేశారు. నల్లగొండ పట్టణంలోని నాగార్జున డిగ్రీ కళాశాల గవర్నింగ్ బాడీ సభ్యుడిగా సేవలందించారు. సాహిత్యం పట్ల అభిలాషతో విద్యార్థిగా ఉండి సొంతగ్రామమైన పానగల్లులో ప్రతాపరుద్ర ఆంధ్ర భాషా నిలయం స్థాపించారు. ఆ రోజుల్లో లిఖిత మాసపత్రికను కూడా నడిపారు. గోల్కొండ, ఆంధ్రవాణి తదితర పత్రికల్లో పలు వ్యాసాలు రాశారు. ఆయన రాసిన కథలు, కవిత్వం కూడా ఈ పత్రికల్లో అచ్చయ్యాయి. 1952లో ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షునిగా కూడా ఆయన విలువైన సేవలందించారు.1967లో నల్లగొండలో ఏర్పాటైన యువరచయితల సమితికి ఆయన పెద్ద దిక్కుగా వ్యవహరించారు. ఎంతోమంది యువ రచయితలను ప్రోత్సహించారు. మాలిక, దర్పణం, సమర్పణ కథా సంకలనాలను వెలువరించారు. సంఘర్షణ వంటి కవితా సంకలనాలను అందించారు. ''దర్పణం'' సాహితీ త్రైమాసిక పత్రిక సంపాదకుడిగా వ్యవహరించారు. తను రాసిన కథలను కూడా యువ రచయితల సమితి ద్వారానే వెలువరించారు.



కాంచనపల్లి చినవెంకట రామారావు
(10.04.1921-13.03.1992)

నల్లగొండ జిల్లా సాహిత్య సభలు నిర్వహించడంలో కాంచనపల్లి పాత్ర విలువైనది. మూడుసార్లు జిల్లా మహాసభలు నిర్వహించిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఆయన 1970,1974,1983లో జిల్లా మహాసభలు నిర్వహించారు. కాంచనపల్లి సాహితీ ట్రస్టును ఏర్పాటు చేశారు.

కాంచనపల్లి బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన కవిత్వం, కథలు, నాటకాలు, గొల్లసుద్దులు రాసారు. తొమ్మిది కథలతో ''మా వూళ్ళో కూడానా?!'' పేరుతో 1973లో కథా సంపుటిని వెలువరించారు. ఆనాటి వెట్టిచాకిరీ, దానిని పనిపాటలలో ఎదిరించిన తీరు మా ఊళ్లో కూడా నా కథలో అద్భుతంగా చిత్రించాడు కాంచనపల్లి. నాటి నైజాం పాలనలో ముస్లింల పాత్ర చురుకైనది. ఈ కథలో ముస్లిం పాత్రలు అద్భుతంగా చిత్రించారు. కాంచనపల్లి. ''అరుణ రేఖలు'' పేరుతో కవితా సంపుటిని అందించారు. ఆయన జీవిత కోరిక అయిన రష్యా పర్యటన చేసి ఆ అనుభవాలను ''మధుర స్మృతులు''గా అందించారు. కమ్యూనిస్టు నాయకుడు నర్రా రాఘవరెడ్డి నాడు ప్రదర్శించిన గొల్లసుద్దులు, బుర్రకథలు రాసింది కాంచనపల్లే.

విశిష్టమైన వ్యక్తిత్వాన్ని రూపొందించుకున్న కాంచనపల్లి 13 మార్చి 1992న కాలం చేశారు. ఆయన సతీమణి జానకమ్మ 2007లో కాలధర్మం చెందింది. కాంచనపల్లి గొప్ప మానవతావాది. న్యాయవాదవృత్తి, సాహిత్యంతో ఆయన అనుబంధాన్ని పెంచుకున్నారు. విలువలకు మారుపేరుగా నిలిచారు. తెలంగాణ గర్వించదగ్గ తొలితరం కథకుల్లో కాంచనపల్లి చినవెంకట రామారావు ఒకరు.


యాదాద్రి



ఇది తెలంగాణ తిరుపతి
శ్రీశైలానికి తగ్గని పుణ్యనిధి
శిల్ప కళలకు కాణాచి
సర్వ కథలకు సాక్షి
శిల్పాల ఉలుల మంచి ఆకృతి
కవుల కల్పనల దివ్య ప్రకృతి
అమరావతిని మరిపిస్తుంది
శిల్ప భంగిమలతో మురిపిస్తుంది
ఎందరినో అలరించిన కన్న తల్లి
తెలుగు సాహిత్య లోకాని కల్పవల్లి
మనల్ని ఆదుకొనే అన్నపూర్ణ
బుద్ధ విగ్రహాన్ని ఇచ్చిన శాంతి పూర్ణ
స్వర్గము కన్న మిన్న
మన యాదాద్రియే ఎన్న
అర్పిద్దాం శిల్పులకు జోహార్లు
తరాలకు తరగని శిల్ప మెహర్లు
(యాదాద్రి గుట్ట లోని శిల్పకళా నైపుణ్యానికి స్పందిస్తూ..)

డా॥ ఎస్. విజయ భాస్కర్, 9290826988

బాలగేయం



వచ్చింది వచ్చింది
సంక్రాంతి పండుగ
సెలవులే ఇచ్చింది
మా ఇంటి పండుగ..!!
అమ్మ నాకై చేసింది
లడ్డు మిటాయి..!!
నాన్న నాకై
కొని ఇచ్చాడు
రంగు రంగుల
గాలిపటాలు..!!
నేనే ఎగిరేసాను గాలిపటం
ఆకాశాన్ని చేరింది
సూర్యుని చెలిమే కోరింది
పక్షులతోనే ఆడింది
మబ్బుల చాటున దాగింది
పైపైకి ఎగిరి ఆనందాన్నే
ఇచ్చింది..!!!!

అఖిలాశ,
07259511956,
బెంగళూరు

ఆశాదోషము




రచన : బరారు శ్రీనివాసశర్మ
పుటలు : 178 వెల రూ. 100/-
ప్రతులకు : డా. భీంపల్లి శ్రీకాంత్
8-5-38, టీచర్స్ కాలనీ,
మహబూబ్‌నగర్ - 509001

శ్రీ వత్సాంకం




రచన : డా.ఎన్.వి.ఎన్. చారి
పుటలు : 183 వెల : లేదు
ప్రతులకు : రచయిత
2-11-387, విద్యారణ్యపురి
హన్మకొండ

ఆవేదన అక్షరమైతే



రచన : మేడిశ్రీ శివకుమార్
పుటలు : 24 వెల రూ. 50/-
ప్రతులకు : రచయిత,
యాదగిరి దేవస్థానం, యాదగిరి
యాదాద్రి భువనగిరి జిల్లా

తెలంగాణ పదాలు



రచన : వడిచర్ల సత్యం
పుటలు : 80 వెల రూ.50/-
ప్రతులకు : రచయిత,
2-2-87/29 సాయినగర్,
సాయిపూర్, తాండూర్,
వికారాబాద్ జిల్లా.

చిన్నకథల పోటీ

చిన్న కథల పోటీని త్వరలో ప్రారంభించబోయే మెట్రో ఇండియా నిర్వహించబోతున్నది. చేతిరాతలో మూడు పేజీలు, యూనికోడ్‌లో వెయ్యి పదాలకు మించకుండా మినీ కథలు పంపాలి. విజేతలకు 3వేలు, 2వేలు, 1వెయ్యి రూపాయలు బహుమతులుగా ఇస్తాం. ఈ నెలాఖరు వరకు, ఎడిటర్, మెట్రో ఇండియా, ఫ్లాట్ నెం.126/ఎ, రోడ్ నెం.63/ఎ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33కు గానీ, ఈమెయిల్ saahithi@ metroi ndia.netకు పంపాలి. వివరాలకు 9652967036 సంప్రదించవచ్చు.

యువకవి సమ్మేళనం

అలిశెట్టి ప్రభాకర్ యాదిల్లో 'తెలంగాణ సాహితి' ఈ నెల 9వతేదీ సాయంత్రం 5 గంటలకు 'యువత-భవిత' అనే అంశంపై హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రం షోయబ్ హాల్‌లో యువకవి సమ్మేళనం నిర్వహించబోతున్నది. అనంతోజు మోహన్ కృష్ణ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జయధీర్ తిరుమలరావు, అతిథులుగా తంగిరాల చక్రవర్తి, భూపతి వెంకటేశ్వర్లు, రమేశ్ రాంపల్లి పాల్గొంటారు.

తెలంగాణ రచయిత్రుల కథలు

వట్టికోట ఆళ్వారు స్వామి హాల్, నవచేతన బుక్ హౌస్, ఆబిడ్స్ హైదరాబాద్‌లో నవచేతన పబ్లిషింగ్ వారు ప్రచురించిన 'తెలంగాణ రచయిత్రుల కథలు' కథయిత్రులకు గ్రంథ వితరణ సభ ఈ నెల 9న ఉదయం 11 గంటలకు జరుగనుంది. డా॥ ఏటుకూరి ప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి డా॥ ఎస్వీ సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. పుస్తక సమీక్షకులుగా ఓల్గా, గ్రంథ పర్యవేక్షకులు డా॥ ముదిగంటి సుజాతరెడ్డి, పుస్తక సంపాదకులు అనిశెట్టి రజిత, నవచేతన పబ్లిషింగ్ హౌస్ కార్యనిర్వాహక సంపాదకులు ఎన్.మధుకర్ తదితరులు పాల్గొంటారు.

బూర్లకు 'అలిశెట్టి' అవార్డుకు

తెలంగాణ రచయితల వేదిక కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అభ్యుదయ సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న వారికి ప్రదానం చేస్తున్న విప్లవకవి అలిశెట్టి ప్రభాకర్ స్మారక సాహిత్య పురస్కారానికి ఈ యేడు బూర్ల వేంకటేశ్వర్లు ఎంపికయ్యారు. ఈ నెల 12న కూకట్ల తిరుపతి అధ్యక్షతన జరిగే పురస్కార ప్రదాన సభలో ముఖ్య అతిథిగా ప్రముఖ కవి దేవిప్రియ అతిథులుగా నారదాసు లక్ష్మణరావు,నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథం, నిజాం వెంకటేశం, గాజోజు నాగభూషణం, నగునూరి శేఖర్ తదితరులు పాల్గొంటారు.

కవితల పోటీలు

యువతలో దేశభక్తి స్ఫూర్తి నింపే యత్నంలో భాగంగా 15-35 సంవత్సరాల లోపు యువతీ యువకులకు 'సమాజంలో యువత పాత్ర'పై కవిత్వ పోటీలు నిర్వహిస్తున్నారు. 200 పదాలకు మించని 18-25 లైన్లు వచ్చేలా కవితలు రాసి, ఈ నెల 16లోపు మెరుగు ప్రవీణ్, పిన్ రెడ్డి తిరుపతిరెడ్డి, #2-10-895, మాధవ నిలయం, కెన్‌క్రెస్ట్ స్కూల్ వెనుక, జ్యోతినగర్-కరీంనగర్ - 505001 చిరునామాకు పంపాలి.

మన తెలంగాణ
5
హైదరాబాద్
సోమవారం
8 జనవరి, 2018
www.manatelangana.news

విజేత

సక్సెస్ ఫార్ములా

నేరాలపై ఉక్కుపాదం

సామాజిక అంశాలపై ప్రసన్ననేత్రం



మహేష్ భగవత్



నేరం ఏ రూపంగా ఉన్నా అణచివేయడం ఆయన నైజం... సమస్యలు ఏ కోణంలో ఉన్నా వాటిని పరిష్కరించడమే ఆయన ధ్యేయం. శాంతి భద్రతలతో సమస్యలు లేని సమాజంలో ప్రజలంతా జీవించాలనే తపన ఆయన అంతరంగం. ఇంజనీరుగా అన్నాహజారే స్వగ్రామం రాలేగన్ సిద్ధిలో వాటర్ షెడ్ నిర్మాణంలో చురుగ్గా పాల్గొన్నారు. ములసి డ్యామ్ ముంపు బాధితుల సమస్యల పరిష్కారం కోసం మేథాపాట్కర్ తో పాటు దీక్షలు చేశారు. రాచకొండ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మహేష్ మురళీధర్ భగవత్‌కు మహిళా అక్రమ రవాణా నిరోధానికి చేసిన కృషికి యు.ఎస్.ఏ ప్రభుత్వం అరుదైన అవార్డును ఇచ్చి సత్కరించింది. ప్రపంచంలోని ఎనిమిది దేశాలకు లభించిన ఈ అవార్డు భారతదేశంలో మహేష్‌భగవత్‌కు లభించడం విశేషం. ఈ నేపథ్యంలో మహేష్ భగవత్‌తో ముచ్చట్లు...

గతంలో సామాజిక కార్యకర్తగా అనేక కార్యక్రమాలు నిర్వహించిన అనుభవం విధి నిర్వహణకు ఉపయోగపడుతుందా?

సామాజిక కార్యకర్తగా ప్రజలతో కలిసి పనిచేసినప్పుడు పరిశీలించిన అంశాలు విధినిర్వహణకు ఉపయోగకరంగా ఉన్నాయి. 2001లో బెల్లంపల్లి ఎస్.పిగా 2004 లో అదిలాబాద్ ఎస్.పి గా పనిచేసినప్పుడు నక్సలైట్ల సమస్యలను సామాజిక కోణంలో పరిశీలించే అవకాశం లభించింది. నక్సలైట్ల ప్రాబల్య గ్రామాలను గుర్తించి యువత తీవ్రవాద కార్యకలాపాల్లోకి వెళ్ళకుండా అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాం. విద్య,ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చాం. దొంగటీచర్ల గుట్టువిప్పి విద్యావ్యవస్థలో ప్రమాణాలు పెంచే అవకాశం లభించింది. ఆదివాసి పిల్లలకు విజ్ఞానయాత్రలు నిర్వహించి సామాజిక చైతన్యం కల్పించాం. నక్సలైట్ల సమస్యలు క్యూబింగ్‌తో పరిష్కారం కావు ప్రజల్లో చైతన్యం రగిలించాలి. ఈ చైతన్యం తోనే 26 గ్రామాల్లో నక్సలైట్లపై ప్రజలు తిరుగుబాటు చేశారు . 150 మంది నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలిశారు.



సామాజిక కార్యకర్తగా సేవ చేయాలనే ఆలోచన ఎలా కలిగింది?

ఇంజనీరింగ్ పూర్తి కాగానే టాటామోటర్స్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరాను. మహారాష్ట్రలో టాటామోటర్స్ దత్తత తీసుకున్న 18 గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, పాఠశాలలు, చెక్ డ్యాంల నిర్మాణాలు చేస్తూ ప్రజల సమస్యలను సున్నితంగా అవగాహన చేసుకున్నాను. ఆ రోజుల్లో ప్రజల్లో మూఢనమ్మకాలు అధికంగా ఉండేవి.ప్రజల అమాయకత్వాన్ని దొంగస్వాములు ఉపయోగించుకునేవారు. స్వాములు చేసే దొంగ విద్యలు ప్రజలకు చేసి చూపించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రయత్నించాను. సామాజిక మార్పు కోసం ఎంత ప్రయత్నించినా అధికారం ఉంటేనే సాధ్యం అనే ఆలోచనతో ఉద్యోగం వదిలి సివిల్స్ వైపు దృష్టి సారించాను. తొలి ప్రయత్నంలో నిరాశ ఎదురైనా చరిత్రను ఆప్షనల్ గా తీసుకుని మరాఠి సాహిత్యాన్ని అంశంగా చేసుకుని తిరిగి సివిల్స్ కు చేసిన ప్రయత్నం ఫలించింది. 1995 లో మణిపూర్ క్యాడర్ లో చేరాను. 1997 నుంచి 1999 వరకు మణిపూర్ ఎస్.పిగా విధులు నిర్వహించి తీవ్రవాద సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేశాను. అక్కడే మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారాన్ని అణిచివేసి ప్రశంసా పత్రాన్ని సొంతం చేసుకున్నాను. ఆ తర్వాత ఏలూరులో పనిచేసేటప్పుడు ఒకపాత హత్యఫైల్ ఓపెన్ చేసి ప్రజల నుంచి సమాచారం సేకరించి దోషులను శిక్షించడంతో పాటు అంతరాష్ట్ర దొంగల ముఠా గుట్టురట్టవడం ఆ రోజుల్లో సంచలనం సృష్టించింది. అనంతరం 2004 లో హైదరాబాద్ సౌత్ జోన్ డి.సి.పి గా పదోన్నతి లభించింది. మనీలెండర్స్,దొంగస్వాములు,మహిళా అక్రమ రవాణా ముఠాలు,దోపిడీ దొంగలను పట్టుకోవడమే కాకుండా చట్టపరిధిలో వారికి శిక్షపడింది.

మహిళా అక్రమ రవాణాను తీవ్రంగా అణిచివేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

సమాజంలో కొంతమంది మహిళలను అక్రమంగా రవాణాచేసి వ్యభిచార కూపంలోకి నెడుతున్నట్లు వచ్చిన సమాచారంతో నేరపరిశోధన వేగవంతం చేశాం. నల్గొండ ఎస్పీగా ఉన్నప్పుడు యాదగిరి గుట్టపై కొందరు వ్యభిచారగృహాలను నిర్వహిస్తున్నట్లు వచ్చిన ప్రాథమిక సమాచారాన్ని లోతుగా పరిశీలించి దోషులను జైలుపాలు చేశా. వందలాది మందికి ఆశ్రయం కలిపించడంతో పాటు పాఠశాలల్లో చేర్పించాం. అలాగే నిర్భయ సంఘటన కంటే ఘోరమైన సంఘటన కొత్తగూడెంలో జరిగింది. ఒక అమ్మాయిపై 9 మంది లైంగికదాడికి పాల్పడగా నలుగురు వీడియో తీశారు. ఒకడు కాపలాగా ఉన్నాడు. తొలుత ఈ కేసుపై ఎవరూ ఫిర్యాదు చేయలేదు. ప్రజల సహకారంతో14 మందిపై కేసు నమోదు చేయగా 9 మందికి యావజ్జీవ కారాగార శిక్షపడింది. 2007 లో ఈ సంఘటన జరిగితే 2009 లో వెలుగుచూసింది. సమాజంలో కొంతమేరకు చైతన్యం వస్తోంది. షీ టీంలు బాగా పనిచేస్తున్నాయి. ప్రతి కళాశాల నుంచి ఒకరికి షీ టీం శిక్షణ ఇస్తోంది. ఇప్పటికి 300 మంది విద్యార్థినులు షీటీంకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నారు. ప్రజల్లోనూ ఈ చైతన్యం రావాలి. ప్రజాచైతన్యంతో నేరాలను అదుపుచేసే మార్గాలు సులువు అవుతాయి. ప్రస్తుతం సమాజంలో వేగవంతమైన టెక్నాలజీ ఉంది. క్షణాల్లో ఫింగర్ ప్రింట్స్‌ను కనిపెట్టవచ్చు. సి.సి. టివీల్లో నేరస్తుల కదలికలు తెలుసుకోవచ్చు.

ఇటీవల మీకు అమెరికా ప్రభుత్వం అరుదైన అవార్డును ప్రదానం చేసింది. ఏ రంగానికి ఈ అవార్డు లభించింది.

స్వతంత్ర్య భారతదేశంలో ఇప్పటికీ మనుషులను రవాణాచేసే దారుణం నన్ను కలిచివేస్తుంది. ఈ నేపథ్యంలో ప్రధానంగా మహిళల అక్రమరవాణాపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి అనేక ముఠాలను కోర్టు ముందు నిలిపాను. సామాజిక కార్యకర్తగా ఆనాడు నేను పరిశీలించిన సమాజాన్ని ఈనాటి ఉద్యోగానికి మేలు చేస్తుంది. మహిళా అక్రమ రవాణాను తీవ్రంగా అణచి వేస్తున్నందుకు అమెరికా ప్రభుత్వం అవార్డును ప్రకటించింది. వైట్ హౌజ్ ప్రపంచదేశాలన్నింటిని పరిగణలోకి తీసుకుని ఎనిమిది దేశాలకు అవార్డులను ప్రదానం చేసింది. ఆ ఎనిమిది దేశాల్లో భారతదేశం నుంచి నాకు ఈ అవార్డు లభించింది. అవార్డు బాధ్యతలను గుర్తు చేస్తుంది. గతంలో భారత రాష్ట్ర పతి నుంచి అవార్డును అందుకునే అవకాశం వచ్చింది. అవార్డులు రివార్డులు బాధ్యతలను పెంచుతాయనేది నా ప్రగాఢ విశ్వాసం. ప్రస్తుతం రాచకొండ పోలీసు కమిషనర్ గా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. శాంతి భద్రతలను కాపాడుతూనే ఉత్సాహవంతులైన 1250 మంది యువతకు పోలీసు నియామకాల కోసం జరిగే రాతపరీక్షకు శిక్షణ ఇస్తున్నా.

మహారాష్ట్ర లోని అహ్మద్ నగర్ నుంచి ఉపాధ్యాయుల కుటుంబం నుంచి అంచెలంచెలుగా ఎదిగి మహిళా అక్రమ రవాణాలపై లాఠీ ఝుళిపిస్తున్న మహేష్ మురళీధర్ భగవత్ రాసిన పుస్తకాలు ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం యాంటీ ట్రాఫికింగ్ డిప్లొమా కోర్సుకు పాఠ్యాంశాలు కావడం గమనార్హం... ఆయన మరికొంతమంది అధికారులకు ప్రేరణగా నిలిచి మహాత్ముని కలలను సాకారం చేస్తారని ఆశిద్దాం....

వి. భూమేశ్వర్

ఇంట్లో పాతబడిన షూలు ఉంటే ఏం చేస్తాం ...ఇదేం ప్రశ్న అనుకుంటున్నారా? బయట పడేస్తాం. అంతేకదా..పాత షూలను చెప్పులుగా మార్చి పేదలకు అందించాలనే వినూత్న ఆలోచనే గ్రీన్‌సోల్ స్టార్టప్‌కు శ్రీకారం చుట్టింది. అసలు ఈ ఆలోచన ఎవరికి వచ్చింది...ఎలా వచ్చిందో చూద్దాం...

గ్రీన్‌సోల్‌తో సమాజసేవ

ముంబయికి చెందిన శ్రేయాన్స్ అతని స్నేహితుడు రమేశ్ ధామి ఇద్దరూ మారథాన్ రన్నర్లు. ప్రాక్టీస్‌లో, పోటీల్లో వీరిద్దరూ ఉత్సాహంగా పాల్గొనేవారు. దీంతో నెలకు రెండుమూడు జతల బూట్లు పాడైపోయేవి. వాడుకున్న ఖరీదైన బూట్లను ఊరికే బయట పడేసే బదులు రీఫర్నిష్ చేసి తిరిగి వాడుకుంటే బాగుంటుంది కదా అని అనుకున్నారు. ఈ ఆలోచనే గ్రీన్‌సోల్‌కు బీజం వేసింది. సామాజిక బాధ్యతగా ప్రారంభమైన ఈ సంస్థ వ్యాపార రూపం దాల్చింది. రతన్‌టాటా, ఒబామా లాంటివారి ప్రశంసలు అందుకుంది. 2014లో పదిలక్షల పెట్టుబడితో ముంబయి కేంద్రంగా గ్రీన్‌సోల్ సంస్థను స్థాపించారు. జనం వాడి పడేసే బూట్లను సేకరించి, మరమ్మతు చేసి విరాళంగా అందించడం, ఇంకాస్త ఫ్యాషన్‌గా తయారుచేసి విక్రయిస్తుందీ సంస్థ. వ్యక్తులు, కార్పొరేట్ సంస్థలు ఎవరైనా సరే పాత బూట్లు, చెప్పులు, సోల్, లేసులను విరాళంగా అందించవచ్చు. షూ మరమ్మతు కోసం అయ్యే ఖర్చు కూడా దాతే ఇవ్వాలి. ఒక్కో జతకు రూ.199 అందించాల్సి ఉంటుంది. బూట్ల సేకరణ కోసం దేశంలో నాలుగువేల కేంద్రాలున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 15 పాయింట్లున్నాయి. గతేడాది లక్ష జతల బూట్లను, రూ.20కోట్లను విరాళంగా సేకరించారు. టాటా, రోల్స్ రాయిస్, ల్యాండ్ రోవర్, ఎల్ అండ్ టీ, వివంత, నాప్‌టోల్, జస్ట్ డయల్, యాక్సిస్ బ్యాంక్, సిగ్నా టీటీకే, మేక్‌మై ట్రిప్ వంటి వందలాది కార్పొరేట్ సంస్థలతో ఒప్పందం కూడా చేసుకున్నారు. సేకరించిన బూట్లను ముంబయిలోని రీఫర్బిష్ కేంద్రలో మరమ్మతు చేస్తారు. ఒక జత తయారుచేయడానికి అరగంట పడుతుంది.







మరమ్మతు చేసిన చెప్పులను నెలకోసారి ఒక్కోప్రాంతంలో చెప్పుల్లేని ప్రజలకు , గ్రామాల్లోని పాఠశాలలకు అందజేస్తున్నారు.

ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 62వేల జతల చెప్పులను దానం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో 4వేల జతల బూట్లను విద్యార్థులకు అందజేశారు. వీటిని అడిడాస్ కంపెనీ స్పాన్సర్ చేసింది. ఒరిస్సాలో 4,500 జతల చెప్పులను అందించారు.

ఆన్‌లైన్‌లోనూ...

గ్రీన్‌సోల్ కంపెనీ నిర్వహణ, ఉద్యోగుల జీతభత్యాలు తదితర ఖర్చుల కోసం కొన్ని రకాల ఫ్యాషన్ చెప్పులను కూడా తయారుచేస్తున్నారు. వీటి విక్రయాల ద్వారా వచ్చే సొమ్మును నిర్వహణ ఖర్చులుగా వినియోగిస్తున్నారు. డిజైన్‌ను బట్టి వీటి ధర రూ. 600, 1200లుగా ఉంటుంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.10లక్షల వ్యాపారాన్ని చేసినట్లు వారు తెలిపారు. ఈ ఏడాది రూ.20లక్షల టర్నోవర్‌ను లక్ష్యంగా పెట్టుకున్నారు. సంస్థ మరింత వృద్ధి చెందాలని కోరుకుందాం.

కారు ఇంజన్‌తో బైక్!!

ఇదేంటి కొత్తగా ఉందే అనుకుంటున్నారా...ఇలాంటి బైక్ తయారుచేయాలనే ఆలోచన గుజరాత్‌కు చెందిన కుర్రాడిది. 20ఏళ్ల రుజ్బే అనే విద్యార్థి మారుతి 800 కారు నుంచి ట్రాన్స్‌మిషన్ సిస్టమ్, ఇంజన్, ఇతర విడి భాగాలను సేకరించి హమ్మర్‌హెడ్ 800 అనే మోడిఫైడ్ బైకును తన సొంత పరిజ్ఞానంతో తయారుచేశాడు. కారుకు ఉండాల్సిన స్పెసిఫికేషన్స్ బైక్‌లో ఉన్నాయన్న మాట. కారు మొత్తాన్ని చిన్నచిన్న భాగాలుగా విడగొట్టి అందులో నుంచి సేకరించిన విడి భాగాలను ఉపయోగించి 800సీసీ ఇంజన్‌తో, ఇంజన్ పవర్ ఫ్రంట్, రియర్ వీల్‌కు అందేలా బైకును రూపొందించాడు.


1983 కాలంలో మారుతి 800 కారు భారతీయులకు పరిచయమైంది. అప్పటి నుండి మారుతి 800 కారు ఆధారంగా ఎన్నో మాడిఫైడ్ కార్లు బైకులకు ప్రాణం పోశాయి. ఎలాంటి రూపంలోకైనా మార్చేయడానికి మారుతి 800 ఎంతో అనువైనది. దీని అధారంగా వచ్చిన మరో అద్భుత సృష్టే ఈ బైక్. బైకు మధ్యలో 796 సీసీ కేపాసిటి గల మారుతి పెట్రోల్ ఇంజన్ ఉంటుంది. ఇంజన్ ఉత్పత్తి చేసే పవర్ ముందు, వెనుక చక్రానికి వేర్వేరు ప్రొపెల్లర్ షాఫ్ట్ ద్వారా సరఫరా అవుతుంది. సాధారణ బైకుల్లో ఇంజన్ పవర్ రియర్ వీల్‌కు మాత్రమే అందితే, ఇందులో రెండు చక్రాలకు ట్రాన్స్‌ఫర్ అవుతుంది. ప్రొపెల్లర్ షాఫ్ట్ నుండి వీల్‌కు పవర్ ఎలా వెళ్తుందనే డౌట్ చాలా మందిలో ఉంటుంది. ఇందులో సాధారణ బైకుల తరహాలో చైన్ ద్వారా కాకుండా ఇంజన్ నుండి చక్రం వరకు చిన్న పరిమాణంలో ఒక షాఫ్ట్ ఉంటుంది (బస్సులు, లారీల్లో కింది వైపు ఇంజన్ నుండి డిఫరెన్షియల్ వరకు ఉండే షాఫ్ట్ తరహా, ఇదే పవర్‌ను చక్రాలకు సరఫరా చేస్తుంది. ఈ బైకులో ఉన్న ఇంజన్, గేర్‌బాక్స్, డ్రైవ్ సిస్టమ్ బరువును తట్టుకునేలా డైమండ్ ఆకృతిలో ఉన్న ఫ్రేమ్ కావడంతో బైక్ మొత్తం బరువును తట్టుకోగలుగుతుంది. బైక్‌ని నడపడానికి చాలా అనువుగా ఉంటుంది.



నాసిరకం పత్తి విత్తనాలను నిర్వీర్యం చేయండి : పార్థసారథి



మన తెలంగాణ/ హైదరాబాద్ : ప్రైవేట్ కంపెనీల ఆధ్వర్యంలో రైతులు ఉత్పత్తి చేసిన నాసిరకం పత్తి విత్తనాలను నిర్వీర్యం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారధి అన్ని జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు. మార్కెట్ డిమాండ్‌ను బట్టి ప్రైవేట్ పత్తి విత్తన కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటం, నాసిరకం విత్తనాలు అని తెలిసినా రైతులకు అంటగడుతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీనిని దేశవ్యాప్తంగా అమలు చేయాలని కోరుతూ పార్థసారధి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ప్రైవేట్ విత్తన కంపెనీలు ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు రైతుల పొలాల్లోనే పత్తి విత్తనాలను ఉత్పత్తి చేస్తున్నాయి. ఇలా ఉత్పత్తి అయిన విత్తనాలకు మొలకెత్తే లక్షణం ఉందా లేదా అని ముందుగా అంకురోత్పత్తి (జర్మినేషన్) పరీక్ష చేస్తారు. అనుకున్న స్థాయిలో మొక్క ఎదిగితే పత్తి విత్తన రకంకు సంబంధించిన జన్యు స్వచ్ఛతను (డబ్ల్యు ఒటి) పరీక్షిస్తారు. ఇందులో జన్యు స్వచ్ఛత 90 శాతం కంటే తక్కువగా ఉండరాదు. అయితే పత్తి విత్తన లాట్‌లను కంపెనీలు స్వీయ ధృవీకరణ (సెల్ఫ్ సర్టిఫై) చేసి మార్కెట్‌లోకి తెస్తున్నాయి. ఈ క్రమంలో డిమాండ్‌ను బట్టి జన్యు స్వచ్ఛత 90 శాతం కన్నా తక్కువగా ఉన్నా వాటిని కూడా సెల్ఫ్ సర్టిఫై చేసి విక్రయిస్తున్నాయి. దీంతో పత్తి సాగు చేసే రైతులు నష్టపోతున్నారు.



లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణకు పోరాటం: అజీజ్ పాషా

మన తెలంగాణ / హైదరాబాద్ : బిజెపి పాలనలో మతతత్వ సంఘ్ పరివార్ శక్తుల ఆగడాలు పెరిగిపోయి లౌకిక వ్యవస్థకు ప్రమాదం ఏర్పడిందని, మైనారిటీలు, దళితులు, బడుగు బలహీనవర్గాలు అభద్రతా భావంతో ఉన్నాయని అఖిల భారత తన్‌జీమ్ ఎ ఇన్సాఫ్ అధ్యక్షులు అజీజ్ పాషా అన్నారు. మఖ్దూంభవన్‌లో ఆదివారం జరిగిన ఇన్సాఫ్ రాష్ట్ర సమితి సమావేశంలో ఆయన ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పగా ప్రకటిస్తున్న సంక్షేమ పథకాలు ముస్లిం మైనారిటీలకు అందడం లేదని అజీజ్‌పాషా విమర్శించారు. ముస్లిం మైనారిటీలు 14 శాతం వుండగా బ్యాంకుల్లో వారికి 0.5 శాతం మాత్రమే రుణాలు అందుతున్నాయన్నారు. మైనారిటీలలో మెజారిటీ ప్రజలకు పథకాలు అందడం లేదన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో మైనారిటీల పరిస్థితి చాల అధ్వాన్నంగా వున్నదని, దానిని మెరుగుపర్చేందుకు సుధీర్ కమీషన్ చేసిన సిఫార్సులను ప్రభుత్వం పరిశీలించి తక్షణమే అమలు చేసి మైనారిటీల సంక్షేమానికి పాటుపడాలని డిమాండ్ చేశారు. షాదీ ముభారక్ నిధులు అర్హులైన వారికి అందకుండా మధ్య దళారులే స్వాహా చేస్తున్నారని, వీటిపై విచారణ చేసి బాధ్యులను శిక్షించాలన్నారు. ఈ సమావేశానికి ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షులు మున్నీర్ పటేల్ అధ్యక్షత వహించగా, నాయకులు కరీంముల్లా, మహ్మద్ షఫీ పాల్గొన్నారు.

రేపు ఎన్ఎంయు ధర్నా

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఆర్‌టిసి కార్మికులకు 62 శాతం ఫిట్‌మెంట్‌తో గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి వేతన సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ, పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న బస్ భవన్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు టిఎస్‌ఆర్‌టిసి ఎన్ఎంయు ఒక ప్రకటనలో తెలిపింది. డ్రైవర్లకు వేతన సవరణలో 3 సర్వీసు వెయిటేజీలు ఇవ్వాలని, బలవంతపు టిమ్స్ డ్యూటీల నుంచి ఊరట కలిగించాలని, 22 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన కార్మికులకు కచ్చితమైన పదోన్నతులు కల్పించాలని ఎన్ఎంయు సంస్థ యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. రిటైర్డ్ ఉద్యోగులకు కనీస పెన్షన్‌ను రూ.10 వేలకు పెంచాలని, కార్మికులను ఇబ్బందులకు గురి చేసే సర్క్యులర్ –1ని రద్దు చేయాలని ఎన్ఎంయు కోరింది.

గీతన్నల ఎక్స్‌గ్రేషియా రద్దు చేయొద్దు

మన తెలంగాణ / హైదరాబాద్ : చెట్టుపై నుంచి పడి మరణించిన వారి కుటుంబాలకు, గాయపడిన పెన్షన్‌దారులైన గీత వృత్తిదారులకు ఎక్స్‌గ్రేషియాను రద్దు చేయాలనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు. కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవనోపాధిని పొందుతూ కుటుంబాలను కాపాడుకుంటున్న గీత వృత్తిదారులకు ఎక్స్‌గ్రేషియాను రద్దు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు వస్తున్న వార్తల పట్ల గీత కార్మికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. వెయ్యి రూపాయల పెన్షన్ సాకుతో వృత్తి నుండి వెళ్లగొట్టే చర్యలకు ప్రభుత్వం పూనుకుంటే గీత వృత్తిదారులు పోరుబాట పట్టక తప్పదన్నారు. రాష్ట్రంలోని అన్ని సొసైటీలకు వన పెంపకం 560 జీఓ అమలు చేస్తూ 10 ఎకరాల భూమి కేటాయించాలని కోరారు. కార్మికులకు పెన్షన్‌ను రూ.2 వేలకు పెంచాలని, బడ్జెట్‌లో గీత వృత్తి అభివృద్ధి, సంక్షేమానికి రూ.1000 కోట్లు కేటాయించాలని ప్రభాకర్ కోరారు.

డిజిపిల సదస్సులో 'టి కాప్'పై కురిసిన ప్రశంసల జల్లు

మన తెలంగాణ/ హైదరాబాద్: మధ్యప్రదేశ్‌లోని బిఎస్ఎఫ్ అకాడమీలో జరుగుతున్న అన్ని రాష్ట్రాల డిజిపిల సమావేశంలో తెలంగాణ పోలీసులు ఇటీవల రూపొందించిన టి–కాప్ మొబైల్ యాప్‌పై ప్రశంసల జల్లు కురిసింది. దేశంలోనే తొలిసారిగా అత్యున్నత శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో తయారైన టి–కాప్ యాప్‌ను 54 అంశాలతో రూపొందించిన విషయం తెలిసిందే. మధ్యప్రదేశ్‌లో ఈ నెల 6వ తేదీ నుంచి మూడు రోజుల పాటు డిజిపిల సమావేశం జరుగుతోంది. ఈ సమావేశంలో పాల్గొన్న డిజిపి మహేందర్‌రెడ్డి తెలంగాణ పోలీసులు పారదర్శకంగా విధులు నిర్వహించేందుకు రూపొందించిన టి–కాప్ గురించి వివరించారు. దాని వల్ల కలిగే ఫలితాలు భేష్‌గా ఉన్నాయని ఆయా రాష్ట్రాల పోలీసులు ప్రశంసల జల్లు కురిపించారు. నేరాల నివారణ, శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నారని పలువురు డిజిపిలు మహేందర్‌రెడ్డిని కొనియాడారు. టి–కాప్ లాంటి మొబైల్ యాప్‌ను తమ తమ రాష్ట్రాల్లో కూడా ప్రవేశపెట్టేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకుంటామన్నారు. ఈ యాప్ పని విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఆయా రాష్ట్రాల పోలీసు బృందాలు త్వరలో హైదరాబాద్ రానున్నాయి.

నకిలీ విదేశీ మద్యం ముఠా

(మొదటిపేజీ తరువాయి)

స్టార్ ట్రావెల్ మేనేజర్ నరేష్‌లు ఒక ముఠాగా ఏర్పడ్డారు.ఈ ముఠా చెన్నై సముద్ర మార్గం గుండా రాజమండ్రి, కాకినాడ, అక్కడి నుంచి ట్రావెల్ బస్సులో హైదరాబాద్‌కు నకిలీ విదేశీ మద్యంతో పాటు సుంకం చెల్లించకుండా ఒరిజినల్ విదేశీ మద్యాన్ని కూడా నాలుగేళ్ల నుంచి సరఫరా చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఉన్న ప్రముఖులతో పాటు ఇతర వ్యక్తులకు వీరు విక్రయించేవారు. ప్రతి నెల ఈ ముఠా రూ.50 లక్షల వ్యాపారం నిర్వహించేది. ఇప్పటి వరకు ఈ ముఠా రూ.24 కోట్ల వ్యాపారం నిర్వహించినట్లు పోలీసులు తేల్చారు. ఈ క్రమంలోనే ఈ ముఠా ఆదివారం రాజమండ్రి నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ట్రావెల్స్ బస్సులో రూ.కోటి విలువైన నకిలీ విదేశీ మద్యంతో పాటు సుకం చెల్లించని విదేశీ మద్యం బాటిల్స్‌ను సరఫరా చేసింది.ఈ మేరకు విశ్వసనీయ సమాచారం రావడంతో అసిస్టెంస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పవన్‌కుమార్, సిఐలు ప్రవీణ్‌కుమార్, రాజేశ్వర్‌రావు, వెంకటేశం సరూర్‌నగర్ వద్ద ఉదయం బస్సును తనిఖీ చేయడంతో విదేశీ మద్యం భాగోతం వెలుగు చూసింది. వీటిని సరఫరా చేస్తున్న ఆరుగురిని అరెస్టు చేయగా మరో ముగ్గురు నిందితులు కార్తీక్, మాణిక్, నరేష్‌లు పరారీలో ఉన్నారు.

అనుమతి లేని విదేశీ మద్యం, మత్తు పదార్థాలు, డ్రగ్స్, గంజాయి వంటి పదార్థాలను ట్రావెలింగ్ బస్సులలో సరఫరా చేసినట్లయితే అట్టి బస్సులను ఆబ్కారీ శాఖ స్వాధీనం చేసుకుంటుంది. ఇలాంటి మత్తు పదార్థాలు లేని ప్రయాణికులను మాత్రమే ట్రావెల్ బస్సులో ఎక్కించుకోవాలి. వారి బ్యాగ్‌లను ముందుగానే ట్రావెల్ యాజమాన్యం తనిఖీ చేయాలి. ఆబ్కారీ తనిఖీల్లో మద్యం పట్టుపడితే బస్సు యాజమాన్యమే బాధ్యత వహించాల్సి వస్తుంది. ఇలాంటి నేరానికి పదేళ్ల జైలు శిక్ష విధించబడుతుంది. విదేశీ మద్యానికి అలవాటు పడిన వినియోగదారులు అధికారిక షాప్‌లలోనే కొనుగోలు చేయాలి.

నేడు కార్యదర్శులతో సిఎస్ సమావేశం

- బడ్జెట్ ప్రతిపాదనలపై కీలక చర్చ



మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పి సింగ్ అధ్యక్షతన అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సోమవారం మధ్యాహ్నం సచివాలయంలో కీలక సమావేశం జరగనుంది. ఈ నెల 4వ తేదీన జరగాల్సిన సమావేశానికి నాలుగు అంశాల ఎజెండాను రూపొందించుకున్నప్పటికీ అనేక శాఖల కార్యదర్శుల బదిలీ జరగడంతో ఆ సమావేశం వాయిదా పడింది. రానున్న బడ్జెట్‌లో వివిధ మంత్రిత్వశాఖల తరఫు ప్రతిపాదనలపై చర్చించడానికి షెడ్యూలు ప్రకారం ఈ నెల 8వ తేదీన సమావేశాన్ని సిఎస్ నిర్వహించాల్సి ఉంది. దీంతో నాల్గవతేదీ నాటి సమావేశపు ఎజెండా అంశాలతో పాటు 8వ తేదీ సమావేశం ఎజెండా అంశాలను కూడా కలిపి సుదీర్ఘ సమావేశాన్ని సిఎస్ సోమవారం ఏర్పాటు చేశారు. నాలుగైదు గంటల పాటు ఈ సమావేశం జరిగే అవకాశం ఉందని సమాచారం. ఫిబ్రవరి మూడవ వారంలోనే రాష్ట్ర బడ్జెట్‌ను సమర్పించే అవకాశం ఉన్నందువల్ల అన్ని విభాగాల నుంచి ఆయా పథకాలకు సంబంధించి నిర్దిష్టంగా బడ్జెట్ అంచనాలను పంపాల్సిందిగా ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు గత నెల చివరి వారంలోనే ఒక సర్క్యులర్‌ను జారీ చేశారు. ఆ ప్రకారం ఈ నెల 8వ తేదీ నాటికి ఆన్‌లైన్‌లో వాటిని సమర్పించాల్సి ఉంది. వాటిని ఆయా శాఖల కార్యదర్శులు రెండు రోజుల పాటు అధ్యయనం చేసి ముసాయిదా ప్రతిపాదనలను 10వ తేదీకల్లా సమర్పించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆయా శాఖల నుంచి ఇప్పటికే అందిన ప్రతిపాదనలతో పాటు ఆచరణకు అనుగుణంగా ఉండేలా ముసాయిదా ప్రతిపాదనలను రూపొందించడానికి అన్ని శాఖల కార్యదర్శులు తీసుకోవాల్సిన చొరవపై ప్రధాన కార్యదర్శి ఈ సమావేశంలో స్పష్టత ఇవ్వనున్నారు. ప్రతి విభాగం నుంచి అవి ప్రతిపాదించే, చర్చించే అంశాలకు సంబంధించిన డాక్యుమెంట్లను, వివరాలను కూడా ఈ సమావేశానికి తీసుకురావాల్సిందిగా ఇప్పటికే సిఎస్ తగిన సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనకు అనుగుణంగా ఆయా విభాగాల ప్రతిపాదనలపై సిఎస్ వివరణ ఇచ్చే అవకాశం ఉంది. అదే విధంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, నిధుల వినియోగం, వినియోగపు ధృవీకరణ పత్రాల (యు.సి.) తయారీ తదితరాలపై కూడా సిఎస్ ఈ సమావేశంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేయనున్నారు.

10న టిఎస్‌ఆర్‌టిసి మహాసభ

మన తెలంగాణ / హైదరాబాద్ : టిఎస్‌ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ 9వ మహాసభను ఈ నెల 10వ తేదీన రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఎ. రహమాన్, ప్రధాన కార్యదర్శి బి.వి.కోటయ్య తెలిపారు. మహాసభలో ముఖ్య అతిధిగా రాష్ట్ర హోం శాఖ మంత్రి నాయిని నరసింహారెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, రవాణ శాఖ మంత్రి పి.మహేందర్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీష్‌రెడ్డి, ఆర్‌టిసి ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ, మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణరావు పాల్గొంటారని వారు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో చర్చించి తగిన కార్యాచరణను రూపొందిస్తామని వారు ఒక ప్రకటనలో తెలిపారు.

నిషాకారు ఢీ

(మొదటిపేజీ తరువాయి)


మృతురాలు మస్తానీ


కారు నడిపిన విష్ణు వర్ధన్


గాయాలపాలైన అనూష

చెందిన అనూషారెడ్డి అలియాస్ ప్రియారెడ్డి(29) నగరంలో ఉంటున్నారు. కూకట్‌పల్లిలో తన అత్త ఇంట్లో ఉంటూ ఇంటర్ చదువుతున్న అనూష(19)కు వీరు పరిచయస్తులు. శనివారం రాత్రి మాదాపూర్ నుండి మస్తానీ, ప్రియారెడ్డిలు కలిసి కూకట్‌పల్లిలోని అనూష ఇంటికి వెళ్ళారు. తిరిగి మాదాపూర్‌కు స్కూటర్‌పై వీరు ముగ్గురు వెళ్తున్నారు. ప్రియారెడ్డి నడుపుతుండగా మస్తానీ మధ్యలో, వెనుక అనూష కూర్చున్నారు. జూబ్లీ హిల్స్ రోడ్ నెం.10లో వీరి స్కూటర్‌ను విష్ణువర్ధన్ కారు ఢీ కొట్టింది. దీంతో మస్తానీ అక్కడికక్కడే మృతి చెందగా అనూష డివైడర్‌కు ఢీకొనగా తలకు బలమైన గాయమైంది. ప్రియారెడ్డీ గాయాలకు గురయ్యారు. వీరిని ఢీకొట్టిన విష్ణువర్ధన్ మరికొంత దూరం వెళ్ళి కారును డివైడర్‌కు ఢీకొట్టాడు. అదే మార్గంలో ప్రయాణిస్తున్న వారు చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వచ్చి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. నిందితుడు విష్ణువర్ధన్‌ను అరెస్టుచేశారు.

ప్రమాదాలిలా...

నగరంలో మద్యంమత్తులో వాహనాలు నడపరాదని నిరంతరం తనిఖీలు జరుపుతున్నా వాహనదారులు ఆ మత్తును వీడటం లేదు. ప్రమాదాలను చేయకా మానడంలేదు. మందుబాబులు మత్తులో విచక్షణ కోల్పోయి అమాయక ప్రజల ప్రాణాలను బలిగొంటున్నారు. గత రాత్రి జరిపిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 14 మంది వాహనాలను సీజ్ చేశారు. 14 మందిపై కేసులు నమోదు చేశారు. అందులో ముగ్గురు యువతులు ఉండటం గమనార్హం. 2017లో రోడ్డు ప్రమాదాలు 277 జరిగాయి. అందులో 285 మంది మరణించారు. గాయపడినవారు 2133లు. పాదచారులు మరణించింది 125 మంది. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నమోదైన కేసులు 17,265. విధించిన జరిమానా రూ. 2, 16, 28, 600లు. జైలు శిక్ష పడింది 3.803 మందికి. ఎంవి చట్టం ప్రకారంగా నమోదైన కేసులు 30, 57, 721లు. జరిమానా రూ. 24, 17, 88, 980లుగా ఉన్నవి.

నిత్యం కౌన్సిలింగ్...

మత్తులో వాహనాలను నడిపేవారిని పట్టుకుని నిత్యం కౌన్సిలింగ్‌ను పోలీసులు జరుపుతున్నారు. యువకులకు వారి కుటుంబ సభ్యులను పిలిచి మరీ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ మద్యం సేవించి నడిపే పద్దతికి ఫుల్‌స్టాప్‌పెట్టడంలేదు. ఆ క్రమంలోనే నిత్యం టివిలో ఉండే ప్రదీప్ వంటి యాంకర్ కూడా పోలీసులకు చిక్కాడు. అతని మద్యం పాయింట్లు 178గా నమోదైనట్టు పోలీసులు వెల్లడించారు. ఆస్థాయి మత్తులో ఉన్న అతను కూడా వాహనాన్నితోలుతే రోడ్డు మీద వెళ్ళే వాహనదారులకు, పాదచారులకు ప్రమాదమనేది విష్ణువర్ధన్ చేసిన ఘోర ప్రమాదం వెల్లడిస్తుంది. ఇది ఎక్కువగా సంపన్నవర్గాలు ఉండే జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్ ప్రాంతాల్లోనే చోటుచేసుకుంటున్నందున అక్కడ నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

గురికి బారెడు దూరం

(మొదటిపేజీ తరువాయి)

ఎనిమిది నెలల కాలానికి రూ. 65,853.79 కోట్లను సమకూర్చుకోగలిగింది. ఇక వివిధ మార్గాల్లో రాష్ట్రం రూ. 31,903.48 కోట్ల మేరకు అప్పుల రూపంలో ఆర్థిక వనరులను సమీకరించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంటే నవంబరు నాటికి రూ. 20,313.21 కోట్లను సమకూర్చుకుంది. బడ్జెట్ అంచనాల ప్రకారం పన్నుల వసూళ్ళు, అప్పుల ద్వారా మొత్తం రూ. 1,44,986.52 కోట్లను సేకరించాలన్న లక్ష్యంలో ఇప్పటివరకు రూ. 73,108.48 కోట్లు మాత్రమే సాధ్యమైంది. అంటే దాదాపు సగానికి కాస్త ఎక్కువ మాత్రమే సమకూర్చుకోగలిగింది. మిగిలింది నాలుగు నెలలే కాబట్టి సేల్స్‌టాక్స్, జివిస్టి, ఎక్సయిజ్, అప్పులు, కేంద్రం నుంచి గ్రాంట్లు.. ఇలా అన్నీ కలిపి రూ. 72,493.26 కోట్లను సమకూర్చుకోవాల్సి ఉంటుంది. సేల్స్ టాక్స్ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 46,500 కోట్లను ఆర్జించాలని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అంచనా వేసుకున్నప్పటికీ నవంబరు నాటికి కేవలం రూ. 31,051.90 కోట్ల మేరకే వసూలైంది (ఇందులో జూలై నుంచి అమల్లోకి వచ్చిన జిఎస్‌టి వసూళ్ళు రూ. 13,120.66 కోట్లు ఉన్నాయి). కేంద్రం నుంచి గ్రాంట్లు, సాయం రూపంలో రాష్ట్రానికి రూ. 26,857.67 కోట్ల మేరకు వస్తుందని అంచనా వేసుకున్నా ఎనిమిది నెలల కాలంలో ఇది కేవలం రూ. 5,145.43 కోట్లు మాత్రమే అందింది. ఒకవైపు జివిస్టి రాకతో సేల్స్‌టాక్స్ వసూళ్ళు తగ్గిపోవడం, ఆశించిన తీరులో కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో సకాలంలో అందకపోవడంతో ఆదా య వనరులు పడిపోయాయి. బడ్జెట్ అంచనా ప్రకారం 2018 మార్చి చివరి నాటికి రూ. 4,571.31 కోట్ల మేర మిగులు రెవిన్యూ ఉండాల్సిన పరిస్థితుల్లో ఈ ఎనిమిది నెలల ఆర్థిక పరిస్థితిని బేరీజు వేసుకుంటే రూ. 3,150.43 కోట్ల లోటులోకి వెళ్ళిపోయింది. రానున్న నాలుగు నెలల్లో ఈ పరిస్థితిని గాడిలోకి తేవడం ప్రభుత్వానికి సవాలుగా మారింది. ఇప్పటికే ఒక నెల పూర్తికావడంతో ఇక మూడు నెలల్లోనే మొత్తం పరిస్థితిని చక్కదిద్దాల్సి ఉంది. ఇప్పటివరకు వివిధ ద్రవ్య సంస్థల నుంచి ప్రభుత్వం రూ. 20,313.21 కోట్లను సమకూర్చుకోగలిగింది. ఇంకా అప్పు తెచ్చుకోగలిగింది రూ. 5,783 కోట్లు మాత్రమే. ఖర్చు మాత్రం బడ్జెట్ అంచనాలకు కొంచెం అటూయిటుగానే ఉంది. రెవిన్యూ ఖర్చు, ద్రవ్య ఖర్చు, ఉద్యోగుల వేతనాలు, అప్పులపై వడ్డీల చెల్లింపు, అడ్వాన్సు రుణాల చెల్లింపు... ఇలా వివిధ ఖర్చులకు ఈ ఎనిమిది నెలల కాలంలో సుమారు రూ. 95,200 కోట్లను ఖర్చు చేసింది. గతంలోని వ్యాట్‌తో పోలిస్తే జివిస్టి విధానంలో అనేక వస్తువులపై పన్ను విధింపు తక్కువ కావడంతో వసూళ్ళు కూడా ఆ మేరకు తగ్గిపోయాయి. దీంతో బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా వసూళ్ళు ఉండే అవకాశం అనుమానంగా తయారైంది. అక్టోబరుతో పోలిస్తే జివిస్టి వసూలు పెద్దగా తగ్గకపోయినా సేల్స్ టాక్స్ (పెట్రోలియం ఉత్పత్తులు) వసూళ్ళు మాత్రం స్వల్పంగా తగ్గాయి. మద్యం ద్వారా వసూలుకావాల్సిన ఎక్సయిజ్ ఆదాయం అక్టోబరుతో పోలిస్తే (రూ. 1411.83 కోట్లు) నవంబరులో రెండు వంతులు తగ్గిపోయి రూ. 568 కోట్లు మాత్రమే నమోదైంది. రానున్నది ఎన్నికల బడ్జెట్ కాబట్టి ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ప్రభుత్వం భారీ స్థాయిలోనే ఖర్చు చేయనుందని ఇప్పటికే అధికార పార్టీకి చెందిన నాయకులు వ్యాఖ్యానిస్తున్నా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సమకూరిన ఆదాయం ఒకింత ఆందోళనకరంగానే ఉంది. ఖర్చుకు తగిన ఆదాయ వనరులు ఎలా అన్నది ఇప్పుడు ఆర్థికశాఖ అధికారులకు సవాలుగా తయారైంది. పన్నేతర ఆదాయం, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, ఎక్సయిజ్, ఇతర పన్నుల ద్వారా ఆదాయం సమకూరుతున్నప్పటికీ రానున్న బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేస్తున్న మేరకు ఖర్చుకు సరిపోయేంత స్థాయిలో ఉండే అవకాశం లేదు. గత ఆర్థిక సంవత్సరంలో సైతం ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి వరకు రెవిన్యూ లోటు కొనసాగినా ఒక్క మార్చి నెలలోనే మొత్తం పరిస్థితి మారిపోయి రూ. 4,459 కోట్ల మేరకు మిగులులోకి వచ్చింది. ఆర్థిక సంవత్సరం ముగింపుకు వస్తుండడంతో ప్రభుత్వం సీరియస్ దృష్టి పెట్టి బకాయిలను వసూలు చేయడంతో పరిస్థితి గాడిలోకి వచ్చింది. ఈ సారీ అలాంటిది పునరావృతమైతేనే ఆదాయ వనరులు మెరుగుపడడం, ఎన్నికల బడ్జెట్‌లో ప్రభుత్వం భావిస్తున్నట్లుగా సంక్షేమానికి, అభివృద్ధికి ఖర్చు పెట్టడం సాధ్యమవుతుంది.

రజకులను ఎస్‌సిల్లో చేర్చాలి



(మొదటిపేజీ తరువాయి)

జన్మించినా, చివరికి చనిపోయిన చాకలి వారు లేనిది ఏ పని జరగదన్నారు. చాకలి వారు చేస్తున్న వృత్తి సామాజిక సేవనేనన్నారు. హక్కుల సాధన కోసం రజకులు రాజకీయ శక్తిగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో రజక భవనం నిర్మాణానికి కృషి చేస్తానని, 100 శాతం రాయితీపై వాషింగ్ మిషన్లు ఇప్పిస్తామని చెప్పారు. అదే విధంగా రజకులను ఎస్సీ జాబితాలో చేర్చడానికి తన వంతు కృషి చేస్తామని శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ శ్రీలక్ష్మి ని వారం రోజుల్లో సిఎం కేసిఆర్ వద్దకు తీసుకెళ్లి వారి సమస్యలపై చర్చలు జరుపుతామని చెప్పారు. శ్రీనివాస్‌గౌడ్ వాషింగ్ మిషన్లు, రజక భవనం నిర్మాణం చేస్తామని తన ప్రసంగంలో అనగానే అవి మాకు వద్దు, ఏదైనా మాట్లాడితే రజకులను ఎస్సీల్లో చేర్చే విధంగా ఏమి చర్యలు తీసుకుంటారని చెప్పాలని సభ నుంచి యువత కేకలు వేశారు. దాంతో ఆయన మీ సమస్యలన్ని సిఎం కేసిఆర్ దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు.

దోభీఘాట్స్, ఇస్త్రీ పెట్టెలు వద్దే వద్దు

రజకులకు ప్రభుత్వం ఇస్తామంటున్న ఇస్త్రీ పెట్టెలు, దోభీఘాట్స్, వాషింగ్ మిషన్లు తమకు వద్దే వద్దని, అట్టడుగులో ఉండి దుర్భరజీవనం సాగిస్తున్న రజకులను వెంటనే ఎస్సీ జాబితాలో చేర్చడానికి అసెంబ్లీలో తీర్మాణం చేయాలని చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ కొత్తకొండ శ్రీలక్ష్మి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 30 లక్షల జనాభా ఉన్న రజకులకు విద్యా, ఉద్యోగాలు, రాజకీయాల్లో అన్యాయం అవుతుందని చెప్పారు. జనాభా ప్రకారం తమకు రావాల్సిన వాటా రావాలన్నారు. రజక కులస్తులు ఎన్నికల్లో పార్టీల అభ్యర్థులను గెలిపించే సత్తాలేకున్నా, ఓడించే సత్తామాత్రం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని పార్టీలు రజకులను గుర్తించి టికెట్లు ఇవ్వాలన్నారు. రజకుల సమస్యలు తీర్చి, రజకుల అభివృద్ధికి బిసి ఎ నుంచి రజకులను ఎస్సీ జాబితాలో చేర్చడానికి వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే తిర్మాణం చేయాలని సిఎం కేసిఆర్‌కు లక్ష్మి విజ్ఞప్తి చేశారు. ప్రతి రజక కుటుంబానికి బ్యాంకులకు లింకులు లేకుండా రూ. 5లక్షలు రుణాలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఎలిజాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగన సభలో వి.చంద్రశేఖర్, (కర్ణాటక), అమిత్ ఖత్రీ(హర్యానా), రాఘవేంద్ర (మహారాష్ట్ర), రజక సంఘం నేతలు భీమరవపు సుబ్బారావు, ముదిగొండ వెంకట సుబ్బయ్య, రాయల శ్రీనివాస్, జి.రామకృష్ణ, ప్రొ.అక్కినపల్లి పున్నయ్య, ప్రొ. బి.వి.రాఘవులు, ఫ్రొ.ఇ.దత్తత్రేయలతో పాటుగా రజక యువ నేతలు, ఓయు జేఏసి నాయకులు పాల్గొన్నారు.

క్యాంపస్ నియామకాలం

(మొదటిపేజీ తరువాయి)

స్కిల్స్, విశ్లేషణా సామర్థ్యం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నారు. అందుకే విద్యార్థులు కోర్సులే చేరినప్పటి నుంచి అకడమిక్ అంశాలకే పరిమితం కాకుండా ఇతర నైపుణ్యాలు పెంచుకునేందుకు కృషి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే ఎప్పటి పరీక్షల్లో అప్పుడే ఉత్తీర్ణత సాధిస్తూసాధిస్తూ బ్యాక్‌లాగ్స్ లేకుండా చూసుకోవడం కూడా చాలా అవసరం.

కేబినెట్ సబ్ కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులుగా గతంలో పనిచేసిన ప్రస్తుత వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, ప్రస్తుత మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్‌లతో పాటు గతంలో జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పనిచేసిన ప్రస్తుత గృహనిర్మాణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, రోడ్లు భవనాల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సాగునీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ పంచాయతీరాజ్ చట్టానికి ఎలాంటి సవరణలు చేస్తే బాగుంటుందనేదానిపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుంది. దీని ఆధారంగా ముఖ్యమంత్రి కెసిఆర్ తగిన మార్పులు చేర్పులు చేసి బిల్లు రూపకల్పనకు ఆదేశాలు జారీ చేస్తారు. గత నెలలోనే ఈ బిల్లు తయారీ జరుగుతుందని భావించినా మంత్రుల ఉపసంఘం ఏర్పాటుతో బడ్జెట్ సమావేశాలకంటే ముందుగానే బిల్లు తయారయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలోని పలు లంబాడా తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్నందువల్ల దానికి అనుగుణంగా మంత్రివర్గ ఉపసంఘం ఆలోచించి నివేదికలో పొందుపరుస్తుంది.

కనీస వేతనాలేవీ?

మొదటిపేజీ తరువాయి)

ఔట్ సోర్సింగ్ సిబ్బంది కూడా తమ వేతనాలను 20 వేలకు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు ప్రభుత్వం గత ఏడాది లో జిఒ నెం. 16 ద్వారా పలువురి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించింది. వీరిలో గ్రామీణ నీటి సరఫరా విభాగంలో 125 మంది ఏఈలు, అటవీశాఖలో 130 మంది పార్ట్‌టైమ్ కంటిజెన్సీ, అలాగే జూనియర్, సినియర్ అసిస్టెంట్లు ఉన్నారు. పారా మెడికల్, లాబ్ టెక్నీషియన్‌కు సంబంధించి కూడా 280 మంది, హెల్త్ అసిస్టెంట్లు 33 మంది సిబ్బందిని రెగ్యులరైజ్ చేసింది. ఇంకా సుమారు 28 వేల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది రెగ్యులరైజేషన్ కోసం నిరీక్షిస్తున్నారు. తమను రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వం కొర్రీలు వేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ కొత్త రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత కొందరిని ప్రభుత్వం సీనియారిటీ, విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగాలను క్రమబద్ధీకరించింది. అసంఘటిత రంగంలోని కార్మికుల్లో సెక్యూరిటీ గార్డుల వేతనాలు గొర్రె తోక చందంగా ఉన్నాయి. యాజమాన్యం దయాదాక్షిణ్యాల మీదనే వీరికి వేతనాలు అందుతున్నాయి. ఒక్కో సెక్యూరిటీ గార్డు రోజుకు 8 నుండి 12 గంటల పాటు పని చేస్తున్నా వీరికి అందుతున్న జీతం మాత్రం రూ. 8000 నుంచి రూ. 12000 దాటడం లేదు. నిజానికి ఈ సెక్యూరిటి గార్డులు పని చేస్తున్న సంస్థలు, క్రమం తప్పకుండా కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లిస్తున్నా అందులో కొంత మొత్తాన్ని కమిషన్‌గా తీసుకుని మిగతా మొత్తాన్ని (రూ8 వేలు) వేతనాలుగా చెల్లిస్తున్నాయి. కార్మిక శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అధ్యక్షతన మినిమం వేజ్ అడ్వయిజరీ బోర్డును నియమించినా ప్రభుత్వం దాని సిఫారసులను మాత్రం అమలు చేయడం లేదు.

సలహా మండలి తీర్మానాన్ని అమలు చేయాలి : నరసింహన్



జాతీయ స్థాయిలో కార్మికులకు కనీస వేతనాలను రూ. 18 వేలకు తగ్గకుండా చెల్లించాలని 7వ వేతన కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసిందని, ఈ సిఫారసులను యధాతథంగా అమలు చేసేందుకు కేంద్రం అంగీకారం తెలిపిందని, తెలంగాణ రాష్ట్రంలో కూడా 'మినిమం వేజెస్ అడ్వయిజరీ బోర్డు' కనీస వేతనంగా రూ. 15453 చెల్లించాలని ప్రభుత్వానికి సిఫారసు చేసిందని ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు నర్సింహన్ గుర్తుచేశారు. ఏకగ్రీవంగా చేసిన ఈ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం గౌరవించి ఆమోదం తెలిపి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఫారసు లేఖను అందుకుని మూడున్నరేళ్లు అవుతున్నా ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోక పోవడం సరికాదని గుర్తుచేశారు. షెడ్యూల్ ఎంప్లాయిమెంట్‌లో 43 రంగాలలో మాత్రమే ఈ సిఫారసుల్ని అమలుచేశారని, మిగిలిన అన్నింటినీ కూడా పరిగణనలోకి తీసుకుని కార్మికులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మన తెలంగాణ
7
హైదరాబాద్
సోమవారం
8, జనవరి 2018
www.manatelangana.news



అర్చకులకు రూ.25 వేలు వేతనం ఇవ్వాలి : షబ్బీర్ అలీ

మన తెలంగాణ/కామారెడ్డి: ధూప, దీప నైవేద్యాల కింద అర్చకులకు ప్రభుత్వం ఇచ్చే 6 వేల రూపాయలను 25 వేల రూపాయలకు పెంచాలని శాసన మండలి ప్రతి పక్షనేత షబ్బీర్ అలీ అన్నారు. ఆదివారం సిరిసిల్లా రోడ్డులో కామారెడ్డి జిల్లా బ్రాహ్మణ వికాస పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో సంఘం లేని కులమంటూ ఉందంటే బ్రాహ్మణ కులమే అన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో 36 ఆలయాలకు ధూప, దీప నైవేద్యం కింద ప్రభుత్వం నుండి జీవో వచ్చిందన్నారు. అలాగే పూర్తిగా మూసి వేయబడిన 18 ఆలయాలకు సైతం ధూప, దీప నైవేద్యాల కింద ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు. నిర్మిస్తున్న ఆలయానికి కోటి 50 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని వికాస పరిషత్ సభ్యులు ఎమ్మెల్సీకి వివరించగా గతంలో 5లక్షలు ప్రకటించారు. మొదటి ఆలయ అంతస్తుకు కావాల్సిన నిధులకు తాను అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే తెలంగాణ ప్రభుత్వ సలహాదారు రమణాచారితో ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వం తరుపున 20 లక్షల రూపాయలు మంజూరైనట్లు ప్రకటించారు. బిక్కనూరు ప్రభాక్ శర్మ, కామారెడ్డి దిగంబర్ శర్మలకు ఎమ్మెల్సీ 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వికాస పరిశత్ అధ్యక్షులు వైద్యకిషన్ రావ్, ప్రధాన కార్యదర్శి యజ్ఞం సంపత్ కుమార్, జిల్లా అధ్యక్షులు శశిధర్ శర్మ పాల్గొన్నారు.

ఆటో బోల్తా : 15 మందికి గాయాలు



మన తెలంగాణ/-చింతలపాలెం : ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి ఐదుగురికి తీవ్రగాయాలు, కాగా 10 మందికి స్వల్ప గాయాలైన సంఘటన మండల పరిధిలోని చింత్రియాల గ్రామం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన కూలీలు చింతలపాలెం మండలం పరిధిలోని పాత కిష్టాపురం గ్రామంలో మిర్చి పంట ఏరడానికి 15 మంది కూలీలతో వెళ్తున్న ఆటో (ఎపి24 డబ్ల్యూ5486) చింత్రియాల వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ని తపించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ జోషికి చేయి విరగగా మిగిలిన 4 గురికి తీవ్రగాయాలయ్యాయి. మరో 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమా దాన్ని గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై పరమేష్ సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని పరిశీలించి అనంతరం మాట్లాడారు. డ్రైవర్లు ఆటో పరిమితిని మించి ప్రయాణికులను తరలించరాదని, అలా ఎవరైన పరిమితికి మించి ఎక్కిస్తే వారిపై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కరీంనగర్‌లో దొంగబాబా అరెస్టు

పెద్ద మొత్తంలో నగదు, బంగారం స్వాధీనం

మన తెలంగాణ/కరీంనగర్ క్రైం: తనకు అపూర్వమైన శక్తులు ఉన్నాయంటూ మాయ మాటలు చెప్పి అమాయక ప్రజలను మోసగిస్తూ లక్షలాది రూపాయలతో పాటు బంగారు, వెండి అభరణాలను దోచుకుంటున్న ఓ బురిడీ బాబా కేంద్రంపై ఆదివారం కరీంనగర్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి బాబాను అరెస్టు చేశారు. దొంగబాబా వద్ద నుండి భారీగా బంగారం, వెండి, నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆయనకు సహకరిస్తున్న మరో ఇరువురిని సైతం అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని విద్యానగర్‌కు చెందిన ఎం.డి.బషీర్ కొంతకాలంగా మంత్రాలతో అన్ని విధాలుగా ప్రయోజనం చేకూరుస్తానని ప్రజలను మోసగిస్తున్నాడు. ఇతని గురించి సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దొంగ బాబా తోపాటు అతనికి సహకరిస్తున్న అబ్దుల్ రజాక్, దొంగల మధులను అదుపులోనికి తీసుకోని కరీంనగర్ టూటౌన్ పోలీసులకు అప్పగించగా వారు కేసు నమోదు చేశారు. బషీర్ వద్ద నుండి రూ.4 లక్షల 23వేల 820 నగదులో పాటు 22 తులాల బంగారం, 5 తులాల వెండిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని సిఐ సుందరగిరి శ్రీనివాస్‌రావు వివరించారు. కాగా, మాయలు, మంత్రతంత్రాలతో రోగాలు నయం చేస్తామని అదేవిధంగా సంతానం కలిగిస్తామని, ఉద్యోగ ధన ప్రాప్తి కలిగిస్తామని మాయ మాటలు చెప్పి మోసం చేసే దొంగబాబాలను నమ్మి మోసపోవద్దని కరీంనగర్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ సిఐ సుందరగిరి శ్రీనివాస్‌రావు విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

మన తెలంగాణ/కరీంనగర్‌క్రైం: కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన ఓ రైతు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు కొత్తపల్లి ఎస్ఐ ఎం.రమేష్ తెలిపారు. చింతకుంటకు చెందిన న్యాలమడుగు శీనయ్య (42) వ్యవసాయం చేసుకుంటు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎప్పటిలాగే పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లగా కరెంట్ మోటార్ నుంచి నీరు రాకపోవడంతో బావిలోని కరెంట్ మోటార్ వద్దకు చేరుకుని రిపేర్ చేసేందుకు ప్రయత్నించాడు. ఉన్నట్టుండి ఒక్క సారిగా విద్యుత్ సరఫరా జరిగి విద్యుత్‌షాక్ తగలడంతో బావిలో పడిపోయాడు. బావిలో పడిన శీనయ్య తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య న్యాలమడుగు రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు కొత్తపల్లి ఎస్ఐ ఎం.రమేష్ వివరించారు.

మత రాజకీయాలు చేస్తున్న కేంద్రం

ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ వలీఉల్లా ఖాద్రీ



మన తెలంగాణ/ఎన్‌జిఒస్ కాలనీ: కేంద్ర ప్రభుత్వం విద్యాలయాల్లో మత రాజకీయాలకు పాల్పడుతుందని ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు వలీఉల్లా ఖాద్రీ విమర్శించారు. ఆదివారం హన్మకొండలోని సుబేదారిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పాఠశాలల మూసివేత పేరుతో ఒకవైపు, మరొకవైపు విశ్వవిద్యాలయాల్లో మతరాజకీయాలను ప్రోత్సహిస్తోందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ పాఠశాలలు మూసివేస్తున్నందుకు వ్యతిరేకంగా ఈనెల 25న దేశ వ్యాప్త ఆందోళన, 30న మతోన్మాద వ్యతిరేక దినంగా, మార్చి 10, 11 తేదీల్లో దేశ వ్యాప్త విశ్వవిద్యాలయాల జాతీయ సమ్మేళనం ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహిస్తున్నామన్నారు.ఎఐఎస్ఎఫ్ జాతీయ మహాసభలు జులై మాసంలో బీహార్‌లో నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. సమావేశంలో పలు రాష్ట్రాల కార్యదర్శులు రహిలా పార్విన్, విక్కి, నితిన్, సునీల్, శివరామకృష్ణ, రంగన్న, దినేష్, సాగర్,వేణు, స్టాలిన్, సుబ్బారావు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడి : 13మందికి గాయాలు



మన తెలంగాణ/మెదక్/చేగుంట : మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలో పిచ్చికుక్క దాడిలో 13 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఆదివారం ఉదయం చేగుంటలోని 2 వార్డు ఎస్‌సి కాలనీ నుండి ఒక పిచ్చికుక్క పరిగెడుతూ దారిలో కనబడిన ప్రతి ఒక్కరిని కరుస్తూ 9వ వార్డులో లక్ష్మి టాకీస్ వెనక గల్లీవైపు వచ్చి అక్కడ 5 గురిని కరిచింది. దానికి ఎదురుగా వచ్చిన రెండు కుక్కలను కూడా కరిచినట్లు స్థానికులు తెలిపారు. పొట్టిరాణి(చేగుంట), శిరుగౌజి జశ్వంత్, మచ్చ సుస్మిత పి.అవినాష్, ధన్‌రాజు, శశిధన్‌రెడ్డి, సాత్విక్, నరేష్, సిద్దిరాంరెడ్డి, చరణ్‌సింగ్ ప్రభుదాస్, నవీన్, ప్రకాశ్‌లు గాయపడ్డారు. కొందరు ప్రైవేటు ఆసుపత్రిల్లో చికిత్స నిర్వహించగా ప్రైవేట్‌లో వారికి రేబీస్ ఇంజక్షన్లు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వారికి ప్రథమ చికిత్స నిర్వహించారు. వీరిని మరింత మెరుగైన వైద్యం అందించేందుకు సోమవారం హైదరాబాద్‌లోని కోరంటి ఆసుపత్రికి వెళ్లాలని వైద్యులు సూచించారు. కాగా, పిచ్చి కుక్కను స్థానికులు రాళ్ళు, కట్టెలతో చంపి వేసారు.

పవన్..నా ప్రశ్నలకు బదులేది?

- పవన్ ఫ్యాన్స్ సామాజిక దాడి చేస్తున్నారు
- అభిమానులను నియంత్రించలేని పవన్ రాష్ట్రాన్ని ఏం పాలిస్తాడు?
- నా ప్రశ్నలకు పవన్, పూనమ్ కౌర్‌లు సమాధానాలు చెప్పగలరా?
- ప్రెస్‌మీట్‌లో కత్తి సంచలన వ్యాఖ్యలు





పవన్ అభిమానులను అడ్డుకుంటున్న పోలీసులు

‘కత్తి’ సంధించిన ప్రశ్నలివే?

- పూనమ్‌కౌర్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా ఎవరు ప్రతిపాదించారు?
- తిరుమలలో పవన్ పూనమ్‌తో ఒకే గోత్రంతో పూజలు జరిపించింది నిజం కాదా?
- పవన్ మోసం చేశాడని పూనమ్ ఆత్మహత్యాయత్నం చేసుకున్నప్పుడు కాపాడిందెవరు? ఆసుపత్రి బిల్లు ఎవరు చెల్లించారు?
- పూనమ్ అమ్మకు పవన్ ఇచ్చిన ప్రామిస్ ఏమిటి? అది నెరవేరిందా లేదా?
- దర్శకుడు త్రివిక్రమ్ అంటే పూనమ్‌కు ఎందుకు కోపం?
- క్షుద్ర మాంత్రికుడు నర్సింగ్‌తో పవన్, త్రివిక్రమ్ క్షుద్ర పూజల సమయంలో పూనమ్ ఏంచేశారు?

మన తెలంగాణ/పంజాగుట్ట : సినీనటుడు పవన్ కల్యాణ్, దర్శకుడు త్రివిక్రమ్‌లు కలిసి క్షుద్రపూజలు చేశారని, దీనికి సంబంధించిన విడియో కూడా తన వద్ద ఉందని సినీ విమర్శకుడు కత్తి మహేష్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను పేర్కొంటున్న అంశాలపై పవన్ చర్చలకు రావాలని సవాల్ చేస్తూ ఆదివారం ఆయన హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ అభిమానులు తనపై చేస్తున్న దాడులను పవన్ కల్యాణ్ ఖండించడం లేదని అన్నారు. పవన్ రాజకీయ పార్టీ గురించి పది ప్రశ్నలు వేస్తే ఆయన ఎందుకు స్పందించలేదో చెప్పాలని అన్నారు. నటి పూనమ్ కౌర్‌కు తాను సంధించిన ఆరు ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఓ వైపు మహేష్ మాట్లాడుతుండగా ఆయనపై దాడి చేసేందుకు పవన్ అభిమానులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొద్ది సేపు క్లబ్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. తాను పవన్ కళ్యాణ్‌ను మాత్రమే చర్చలకు ఆహ్వానించానని, పవన్ అభిమానులను కాదని మహేష్ అన్నారు. సోషల్ మీడియాలో పవన్ అభిమానులు తనపై ఇష్టంవచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని, సామాజిక దాడికి పాల్పడుతున్నారని అన్నారు. తన సమస్యకు పవన్ నుంచి స్పందన వస్తుందని ఆశించినా ఇప్పటివరకు ఆయన స్పందించలేదని అన్నారు. తన అభిప్రాయం వ్యక్తం చేసేందుకు తాను ప్రెస్‌క్లబ్‌కు వచ్చానని అన్నారు. పవన్ వారిస్తే ఆయన అభిమానులు తనపై ఆరోపణలు చేయడం మానుకుంటారని, కాని ఆదిశగా పవన్ ఒక్క మాట కూడా మాట్లడటం లేదని అన్నారు. అభిమానులను నియంత్రించలేని పవన్ రాష్ట్రాన్ని ఏం పాలిస్తాడని అన్నారు. తాను దళితుడినని, సామాజిక బహిష్కరణ అనేది దళితులపై ఎప్పటి నుంచో కొనసాగుతుందని అన్నారు. తన వెనుక ఏ రాజకీయ పార్టీ లేదని చెప్పారు. పూనమ్ కౌర్ విషయంలో తాను వేసిన ప్రశ్నలు ఒక్క పూనమ్ కౌర్‌కు సంబంధించినవే కాదని మరో ఆరుగురు మహిళలకు కుడా అవి వర్తిస్తాయన్నారు.

అగ్నిప్రమాదంలో మూడు స్కూలు బస్సులు దగ్ధం



మన తెలంగాణ/మియాపూర్ : మియాపూర్‌లోని జనప్రియనగర్‌లో అగ్నిప్రమాదం ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. జనప్రియనగర్‌లోని జనప్రియ ఒలంపియాడ్ పాఠశాల సుమారు 8 స్కూల్ బస్సులు పాఠశాల ప్రక్కన నిర్మానుష ప్రదేశం నిలిపిన బస్సుల నుంచి ఒక్కసారి మంటలు చెలరేగడంతో పక్క పక్కనే ఉన్న 5 బస్సులకు మంటలు అంటుకున్నాయి. వెంటనే కూకట్‌పల్లి, మాదాపూర్ ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే మూడు బస్సులు పూర్తిగా దగ్దమయ్యాయి. మరో రెండు బస్సులు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఆదివారం కావడంతో పాఠశాల లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పిందని పోలీసులు, స్థానికులు పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తామన్నారు.

ఎన్నో అనుమానాలు : ఈ పాఠశాలకు చెందిన రెండు బస్సులు గతంలో కూడా అగ్నిప్రమాదం సంభవించి కాలిపోయాయని స్థానికులు తెలిపారు. వాటిపై కొంత అనుమానాలు ఉన్నాయన్నారు. పాఠశాల బస్సులకు పార్కింగ్ స్థలం లేక కాలనీ ప్రక్కనే ఉన్న నిర్మానుష ప్రదేశంలో పార్కు చేయడంతో అక్కడ తరచుగా కొంత మంది మద్యం సేవించడం, బస్సులలో సేదతీరడం వంటి చేస్తున్నారని తెలిపారు. అగ్నిప్రమాదం సంభవించిన కూడా పాఠశాల యాజమాన్యం చాలా సేపటి వరకు రాకపోవడంతో అనుమానంగా ఉందని, ఈ బస్సులకు కూడా పత్రాలు లేవనే వారన్నారు. కాగా, పాఠశాలకు ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ లేదని కూకట్‌పల్లి ఫైర్ స్టేషన్ అధికారి ఫజల్ తెలిపారు.

కులవృత్తుల ప్రోత్సాహానికి కెసిఆర్ కృషి

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



మన తెలంగాణ/గద్వాల న్యూటౌన్: రాష్ట్రంలో ఉన్న ప్రతి గొల్ల, కురవ యాదవ కులస్థులకు ప్రతి ఒక్కరికి సబ్సిడీ గొర్రెల పెంపకం పథకం అందించేందుకు చర్యలు తీసుకుంటామని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆదివారం కొండెరులోని మాజీ ఎంపి మందా జగన్నాధం నివాసంలో గద్వాల నియోజకవర్గానికి చెందిన కురవ ప్రజాప్రతినిధులతో తెరాస రాష్ట్ర కార్యదర్శి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ని కలిసి కురువలకు సబ్సిడీ గొర్రెలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ గద్వాల, అలంపూర్ లోని కురువలకు గతంలోనే సబ్సిడీ గొర్రెలను తీసుకోవాలని చెప్పామన్నారు. కొంత మంది ధృవీకరణ కోసం దూరంగా ఉన్నారు. ప్రతి కురవ,యాదవ కులస్థుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి కెసిఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. దేశంలోనే ఎవరు చేయని సహసాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్ కులవృత్తులను పెంచి పోషించేందుకు ప్రత్యేకంగా అణగారిన వర్గాల కోసం ప్రత్యేకంగా సబ్సిడీ గొర్రెల పెంపకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయాల ఛైర్మన్ బిఎస్ కేశవ్ ,ఎంపిపి సుభాన్,కురువ సంఘం నాయకులు జమ్మిచేడు చెన్నయ్య, రాజశేఖర్, ఉరుకుందు, తెరాస నాయకులు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో బావిలో దూకి తల్లి ఆత్మహత్య



మన తెలంగాణ/వీపనగండ్ల : వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలంలోని గోపల్‌దిన్నె గ్రామంలో ఆదివారం అత్తామామల వేధింపుల కారణంగా ఇద్దరి పిల్లలతో సహా తల్లిఆత్మహత్య చేసుకుంది. గోపల్‌దిన్నె గ్రామానికి చెందిన కుమార్‌రెడ్డికి 8 సంవత్సరాల క్రితం అదే మండలం రంగవరం గ్రామానికి చెందిన రోజాతో వివాహమైంది. వందన (3) లక్ష్మీలాస్య (5 , అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తన భర్త కుమార్‌రెడ్డి మానసిక పరిస్థితి బాగాలేనందున తమ ఆడపడుచు శోభారాణికి అత్తామామలు తరుచుగా ఆస్తి, డబ్బు కట్టబెట్టడంపై అత్త అలివేలమ్మ, మామ ఈశ్వర్‌రెడ్డిలను అడుగగా అత్త కోడళ్లు గొడవ పడుతుండేవారు. పుట్టింటి నుండి కోడలు అదనపు కట్నం తేవాలని అత్త అలివేలమ్మ, మామ ఈశ్వర్ రెడ్డిలు కోడలును వేధింపులకు గురి చేస్తుండే వారు. ఆదివారం ఇద్దరి పిల్లలు వందన (3) లక్ష్మీలాస్య (5) లను తీసుకొని ఊరికి దగ్గరలో ఉన్న స్వంత బావి దగ్గరికి చేరుకొని పిల్లలిద్దరిని బావిలోకి తోసి తాను బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకొంది. పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

ఆర్‌టిసి సూపర్ లగ్జరీ బస్సు బోల్తా

15మందికి గాయాలు, ఇద్దరి పరిస్థితి విషమం



మన తెలంగాణ/సూర్యాపేట : ఆర్టీసి బస్సు బోల్తా పడి 15 మందికి గాయాలయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషయంగా ఉంది. ఆదివారం తెల్లవారుజామున చివ్వెంల మండలంలో చోటు చేసు కున్న సంఘటన వివరాలను ఎస్సై బి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. విజయవాడ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు (ఏపి 16 జెడ్ 0151) 32 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు శనివారం రాత్రి బయలుదేరింది. ఆదివారం తెల్లవారుజామున మండల పరిధిలోని దురాజ్‌పల్లి ఆవాస గ్రామం తెడ్లబండ కాలనీ వద్దకు చేరుకోగానే డ్రైవర్ నిద్ర మత్తులోకి వెల్లడంతో బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణాజిల్లాకు చెందిన చిరంజీవి, సాంబశివరావు, శ్రీనివాస్, బానుమూర్తి, డ్రైవర్‌తో సహా, మరో 11 మందికి స్వల్ప గాయాల య్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి 108 వాహనం ద్వారా సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే సర్కారు లక్ష్యం

- అటవీ, పర్యావరణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న



మన తెలంగాణ/బేల : మారుమూల గ్రామాల అభివృద్ధే టిఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని అటవీ, పర్యావరణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని కొగ్దూర్ గ్రామంలో మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి వస్తున్న మంత్రికి గ్రామ యువకులు పాటన్ ఎక్స్ రోడ్డు నుంచి భారీ బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. గ్రామానికి వచ్చిన తరువాత మహిళలు మంగళహారతులు ఇచ్చి తిలటకం దిద్ది ఆహ్వానించారు. అంతకు ముందు గ్రామంలో రూ. 4.03 లక్షలతో నిర్మించే నీటి ట్యాక్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న నీటి సమస్యను తొలగించి కిలోమీటర్ నుంచి వేసిన పైప్‌లైన్ నుంచి వస్తున్న నీటిని మోటర్‌ను ఫోన్ ద్వారా స్టార్ట్ చేసి నల్ల తిప్పి నీటిని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వం అన్ని విధాలుగా గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో బేల ఎంపిపి రఘుకుల్ రెడ్డి, టిఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అవినీతి, అక్రమాలకు మారుపేరు కాంగ్రెస్

- ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి
- ఆరు నెలల్లో ప్రతి ఇంటికీ మంచి నీరు
- ఆడపడుచులకు అండగా తెలంగాణ ప్రభుత్వం



మనతెలంగాణ/అచ్చంపేటటౌన్ :తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పనులను చూస్తే కాంగ్రెస్ ఒర్వలేని మాటలను మాట్లాడుతుందని తెలంగాప్రభుత్వం అనేక మైన సంక్షేమ పథకాలు చేపడుతుంటే చేతకాని ప్రభుత్వం ఇదివరకు అనేకమైన అవినితికి పాల్పడి ఏపని చేయకపోవంతో మీద బురద జల్లేవిదంగా ఉంటుందని ఆదివారం నాడు రాష్ట్ర ఉపముఖ్య ముఖ్యమత్రి అచ్చంపేట నియోజక వర్గంలో సుడిగాలి పర్యటనలు చేపట్టి మాట్లాడారు. రాయలగండి లోని చేన్నకేశవ దేవాలయం దగ్గర ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేసి అక్కడే ఉన్న కస్తూర్బా పాఠశాలను సందర్శించి మాట్లాడారు. క్కడ విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన గురించి తెలుసుకున్నారు.అమ్రాబాద్‌లోని 1950 నుంచి 2017 వరకు చదివిన జడ్పి హేచ్ ఎస్ పాఠశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం లో పాల్గొని మాట్లాడారు. అచ్చంపేటలో బస్టాండ్ పక్కన ఉన్న వాటర్ ట్యాంకు దగ్గర 37 కోట్ల వ్యయంతో మిషన్ భగీరథ పనులను శంకుస్థాపన చేశారు. పట్టణంలో కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు 6 దశాబ్ధాల పోరాటం తర్వాత కేసిఆర్ నాయకత్వంలో తెలంగాణ సాధించుకున్నామని అన్నారు. తెలంగాణలో 2019 ఎన్నికల్లో 100 స్థానాలను టిఆర్ఎస్ కైవసం చేసుకుంటుందన్నారు. ఎంఎల్ఏ గువ్వల బాల్‌రాజు, నాయకులు పోకల మనోహర్, ఎంపిపి పర్వతాలు జడ్పిటిసి రామకృష్ణారెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ తులసిరాం, వైస్ చైర్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మన తెలంగాణ
8
హైదరాబాద్
సోమవారం
8 జనవరి 2018
wraw.manatelangana.news

ఈ ఏడాది సత్తా చాటబోతున్నాడు

2018 సంవత్సరంలో స్టార్ కమేడియన్ బ్రహ్మానందం బిజీబిజీగా ఉండనున్నాడు. వరుసగా అతని సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. గత ఏడాది అతను ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. అతనికి గత సంవత్సరం అవకాశాలు కూడా తక్కువగానే వచ్చాయి. కానీ కొత్త సంవత్సరంలో బ్రహ్మానందం సత్తా చాటబోతున్నాడు. ఈ ఏడాది ఆయన నటించిన అర డజనుకు పైగా సినిమాలు విడుదలకానున్నాయి. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా తెరకెక్కిన 'జై సింహా' చిత్రంతో మొదటగా అతను ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఆతర్వాత మంచు విష్ణు 'ఆచారి అమెరికా యాత్ర', కళ్యాణ్‌రామ్ 'ఎమ్మెల్యే', శ్రీనువైట్ల కొత్త చిత్రం, త్రివిక్రమ్ కొత్త చిత్రంలో అతను దర్శనమివ్వనున్నాడు. బ్రహ్మానందం ఈ ఏడాది స్టార్ కమేడియన్‌గా ఓ వెలుగు వెలగడం ఖాయంగా కనిపిస్తోంది. కమేడియన్‌గా ఇప్పటికే 1000కి పైగా చిత్రాల్లో నటించాడు. తెలుగు సినీ చరిత్రలో ప్రముఖ హాస్య నటుడిగా బ్రహ్మానందం చిరస్థాయిగా నిలిచిపోయాడు.





పవన్‌కళ్యాణ్

సరికొత్త రికార్డు దిశగా...

పవన్‌కళ్యాణ్ 'అజ్ఞాతవాసి' చిత్రం ట్రైలర్ విడుదలై సంచలనం సృష్టిస్తోంది. ఈ ట్రైలర్ విడుదలకాగానే రికార్డు స్థాయిలో ప్రేక్షకులు, అభిమానులు వీక్షించడం మొదలుపెట్టారు. దాంతో అప్పటికప్పుడే ట్రైలర్ ట్రెండింగ్స్‌లో అగ్ర స్థానంలోకి వెళ్లిపోయింది. ఇక యూట్యూబ్‌లో అయితే ఇప్పటికే 4 మిలియన్ వ్యూస్ మార్కుకు చేరువై సరికొత్త రికార్డు సృష్టించేందుకు దూసుకుపోతోంది. హారికా అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈనెల 10న విడుదలకానుంది. టీజర్‌లో పాత్రల తీరు తెన్నులను చూపిస్తే ఇప్పుడు ట్రైలర్‌లో అసలు కథను కాస్త కూడా చెప్పకుండా... ఇద్దరమ్మాయిల మధ్యన నలిగిపోయే ఓ హీరో అన్నట్లు ఒక హింటిచ్చాడు దర్శకుడు త్రివిక్రమ్. అలాగే ఆది విలన్ అంటూ ఒక ఫ్రేములో చెప్పాడు. పవన్‌కళ్యాణ్ స్టార్ ఇమేజ్, త్రివిక్రమ్ మాటలు, అనిరుధ్ సంగీతం, కీర్తిసురేష్, అను ఇమాన్యుయల్‌ల హొయలు ఈ సినిమాను ఘన విజయం దిశకు తీసుకెళ్తాయని అంటున్నారు ఫిల్మ్‌మేకర్స్.

అదే నన్ను ఒప్పుకునేలా చేసింది

సూర్య కథానాయకుడిగా విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గ్యాంగ్'. యువి క్రియేషన్స్ బ్యానర్‌లో నిర్మాతలు ప్రమోద్, వంశీ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ చిత్రం ఈనెల 12న విడుదలకానుంది. ఈ సందర్భంగా సూర్యతో ఇంటర్వ్యూ..



సూర్య

☞ కొత్త తరహా సినిమా...

నా కెరీర్‌లో స్పెషల్ మూవీ 'గ్యాంగ్'. ఈ చిత్రం నా యంగర్ డేస్‌ను నాకు గుర్తుచేసింది. చాలా రోజుల తర్వాత కొత్త తరహా సినిమాను చేశాననే ఫీలింగ్ కలిగింది. ఈమధ్య ఇలాంటి పాత్రను నేనెప్పుడూ చేయలేదు. ఈ సినిమా చేయడం వల్ల నా వయసు పదేళ్లు తగ్గినట్టు అనిపించింది.

☞ నిజమైన సంఘటనల ఆధారంగా...

1980లో జరిగిన పెద్ద దోపిడీకి సంబంధించిన నిజమైన సంఘటనలను ఆధారంగా చేసుకొని ఈ సినిమా చేయడం జరిగింది. అంతేకాకుండా అప్పట్లో దేశంలో ఉన్న నిరుద్యోగ సమస్యను కూడా ఈ సినిమాలో చూపిస్తున్నాం. నా కెరీర్‌ను 1987లో ప్రారంభించడం వల్ల ఈ బ్యాక్‌డ్రాప్‌కు కనెక్ట్ అయ్యాను. దీంతో నా పాత రోజులకు వెళ్లినట్లుగా నాకు అనిపించింది.

☞ కొత్త కథను చెప్పడానికి...

బాలీవుడ్ సినిమా 'స్పెషల్ 26'కు రీమేక్ 'గ్యాంగ్'. రెండు, మూడు సన్నివేశాలు మాతృకలో ఉన్నట్లే ఉంటాయి. మిగిలిన సినిమాను విఘ్నేష్ తనదైన శైలిలో కొత్త కథను చెప్పడానికి ప్రయత్నించాడు. చాలా క్యారెక్టర్స్, ఎమోషన్స్ సినిమాలో కనపడతాయి.

☞ తెలుగు మధురమైన భాష...

ఈ సినిమా కోసం నేను తెలుగులో డబ్బింగ్ చెప్పాను. ఇండియాలోని భాషలన్నింటిలో తెలుగు చాలా మధురమైన భాష అని నేను చిన్నప్పుడు చదువుకునే రోజుల్లోనే తెలుసుకున్నాను. తమిళ డబ్బింగ్‌ను ఎనిమిది రోజుల్లో చెబితే... తెలుగు డబ్బింగ్‌ను 46 రోజుల్లో చెప్పేశాను. వైజాగ్, హైదరాబాద్, కారైకూడి, చెన్నై సహా డిఫరెంట్ లొకేషన్స్‌లో సినిమాను షూట్ చేశాం.

☞ ప్రతి పనిలోనూ కొత్తదనం...

దర్శకుడు విఘ్నేష్ శివన్ కథను చెప్పిన విధానం, సన్నివేశాలు, పాత్రలు, మాటలను రాసిన తీరు నన్ను బాగా ఆకట్టుకున్నాయి. ఆయన చేసే ప్రతి పనిలోనూ కొత్తదనం ఉంటుంది. అదే నన్ను ఈ సినిమాను ఒప్పుకునేలా చేసింది. ఇక అనిరుధ్ సంగీతం కూడా చాలా బాగుంటుంది. అది కూడా సినిమాకు మంచి ప్లస్ పాయింట్ అవుతుంది.

☞ వారి నుంచి చాలా నేర్చుకున్నాను...

ఈ సినిమా కోసం రమ్యకృష్ణ, కార్తిక్‌లాంటి పెద్ద నటులతో నటించడం గొప్ప అనుభవం. వారి నుంచి చాలా నేర్చుకున్నాను. కార్తిక్ అయితే నాలుగు నిమిషాల సన్నివేశాన్ని సింగిల్ టేక్‌లో చేసేశారు. అలాగే లెజెండ్ కమేడియన్ సెంథిల్‌తో పనిచేయడం గొప్పగా ఉంది.

☞ తదుపరి చిత్రాలు...

ప్రస్తుతం సెల్వ రాఘవన్‌తో ఒక సినిమా చేస్తున్నాను. అందులో సాయిపల్లవి, రకుల్‌ప్రీత్ సింగ్ హీరోయిన్లు. ఆతర్వాత కె.వి.ఆనంద్‌తో ఒక సినిమా చేస్తాను.

☞ గొప్ప నాయకుల్ని చూడబోతోంది...

తమిళ రాజకీయాల్లోకి ప్రస్తుతం రజనీకాంత్, కమల్‌హాసన్ ప్రవేశించారు. పరిస్థితులన్నీ మారుతున్నాయి. మరి ఏం జరుగుతుందో వేచి చూడాలి. ఏమైనా తమిళనాడు మళ్లీ గొప్ప నాయకుల్ని చూడబోతోంది.

త్వరలో విదేశాల్లో చిలుకూరి బాలాజీ

శ్రీమీడియా ప్రొడక్షన్స్ ప్రై.లి. పతాకంపై అల్లాణి శ్రీధర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'చిలుకూరి బాలాజీ'. ఈ చిత్రం తాజాగా విడుదలై థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్ ఏర్పాటైన సక్సెస్‌మీట్‌లో అల్లాణి శ్రీధర్, అశోక్‌కుమార్, డా.రామచంద్ర వారణాసిలు పాల్గొన్నారు. కార్యక్రమంలో అల్లాణి శ్రీధర్ మాట్లాడుతూ ''విడుదలైన ప్రతి చోట సినిమాకు చాలా మంచి స్పందన వస్తోంది. ముఖ్యంగా సాయికుమార్, బాలసుబ్రమణ్యం నటనకు మంచి ప్రశంసలు వస్తున్నాయి. ఈ సినిమా విడుదలవడానికి, విజయవంతం కావడానికి ముగ్గురు కీలక పాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా.కె.వి.రమణాచారి, చిలుకూరు ఆలయ ప్రధాన అర్చకులు డా.సి.రంగరాజన్, ఈ సినిమా ఆడియోను విడుదల చేసిన చినజీయర్ స్వామి ఆశీస్సులతో మా సినిమా బాగా ఆడుతోంది. ఈ సినిమా విజయం మాకు చిన్న సినిమాలు తీయవచ్చనే ధైర్యాన్ని ఇచ్చింది. త్వరలో ఈ సినిమాను విదేశాల్లో కూడా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాము''అని అన్నారు. నటుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ ఇలాంటి మంచి సినిమాలు తీసే వాళ్లకు నటుడిగా నా వంతు సహకారాన్ని అందించడానికి సిద్ధంగా ఉంటానని తెలిపారు. డా.రామచంద్ర వారణాసి మాట్లాడుతూ ఈ సినిమా విడుదల కావడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు.



డా.రామచంద్ర వారణాసి, అల్లాణి శ్రీధర్, అశోక్ కుమార్



మంచు విష్ణు

కామెడీతో ఆచారి సందడి

మంచు విష్ణు హీరోగా జి.నాగేశ్వరరెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఆచారి అమెరికా యాత్ర'. ఈ చిత్రం టీజర్ విడుదలైంది. కామెడీ ప్రధానంగా సాగే టీజర్ అందరినీ ఆకట్టుకుంటోంది. విష్ణు, బ్రహ్మానందంల క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ఢీ, దేనికైనా రెడీ, దూసుకెళ్తా వంటి చిత్రాల్లో వీరిరువురు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. ఇక జి.నాగేశ్వరరెడ్డి, విష్ణుల కలయికలో దేనికైనా రెడీ, ఈడో రకం ఆడో రకం వంటి సూపర్ హిట్ కామెడీ చిత్రాలు వచ్చాయి. 'ఆచారి అమెరికా యాత్ర' కూడ అదే తరహా వినోదాన్ని అందించనుందని నిర్మాతలు ధీమా వ్యక్తంచేశారు. ప్రజ్ఞ జైస్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి ఎస్ఎస్ తమన్ సంగీతాన్ని అందించారు. ఈనెల 26న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. పద్మజ పిక్చర్స్ బ్యానర్‌పై కీర్తి చౌదరి, కిట్టు నిర్మిస్తున్న ఈ చిత్రానికి యం.ఎల్.కుమార్ చౌదరి సమర్పిస్తున్నారు. తనికెళ్ల భరణి, కోట శ్రీనివాసరావు, పోసాని కృష్ణమురళి, పృథ్వీ, ప్రవీణ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరాః సిద్ధార్థ్, ఎడిటింగ్ః వర్మ, మాటలుః డార్లింగ్ స్వామి, ఆర్ట్ః కిరణ్, యాక్షన్ః కనల్ కన్నన్.

'ఒక్క క్షణం'తో నా నమ్మకం నిజమైంది



అల్లు శిరీష్, వి.ఐ.ఆనంద్, సీరత్ కపూర్

అల్లు శిరీష్, సురభి, అవసరాల శ్రీనివాస్, సీరత్ కపూర్ ప్రధాన తారగణంగా నటించిన చిత్రం 'ఒక్క క్షణం'. వి.ఐ.ఆనంద్ దర్శకత్వంలో చక్రి చిగురుపాటి నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైంది. ఈ చిత్రం థాంక్స్ మీట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అల్లు శిరీష్, వి.ఐ.ఆనంద్, చక్రి చిగురుపాటి సహా సినిమా యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్లు శిరీష్ మాట్లాడుతూ ''ఒక్క క్షణం సినిమాను పెద్ద హిట్ చేసినందుకు ప్రేక్షకులకు నా ప్రత్యేక కృతజ్ఞతలు. నా తొలి సినిమా 'గౌరవం' బాక్సాఫీస్ వద్ద పెద్దగా సక్సెస్ సాధించలేదు. దాంతో ఏదైనా కొత్తగా చేద్దామనే ఆలోచన తగ్గిపోయింది. ఆతర్వాత కొత్తజంట, శ్రీరస్తు శుభమస్తు వంటి కమర్షియల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌ను చేశాను. మళ్లీ ధైర్యం తెచ్చుకొని ఏదైనా కొత్తగా చేస్తే ప్రేక్షకులు ఆదరిస్తారనిపించింది. ఆ ప్రయత్నంలో భాగంగా 'ఒక్క క్షణం' సినిమా చేశాను. నా నమ్మకం నిజమై ఈ చిత్రం ఘన విజయం సాధించింది. భవిష్యత్తులో కూడా మరిన్ని మంచి సినిమాలు చేస్తాను''అని అన్నారు. వి.ఐ.ఆనంద్ మాట్లాడుతూ ''ఈ సినిమా థియేటర్లలో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. దర్శకుడిగా ఈ చిత్రం నాకు మంచి పేరును తెచ్చిపెట్టింది''అని చెప్పారు. సీరత్ కపూర్ మాట్లాడుతూ 2018 ఏడాదిని మాకు 'ఒక్క క్షణం' సక్సెస్‌తో స్వాగతం పలికిన ప్రేక్షకులకు థాంక్స్ అని పేర్కొన్నారు.

చెల్లెళ్ల కోసం నిర్మాతగా...



కత్రినా కైఫ్

బాలీవుడ్ బ్యూటీ కత్రినా కైఫ్ టాప్ హీరోయిన్‌గా తనకంటూ ఓ ప్రత్యేకమైన క్రేజ్‌ను తెచ్చుకుంది. ఇటీవల ఈ భామ సల్మాన్‌ఖాన్‌తో కలిసి నటించిన 'టైగర్ జిందా హై' చిత్రంతో ఓ బ్లాక్‌బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. దీంతో ఈ భామ ఎంతో సంతోషంగా ఉంది. ఇటు టాప్ బ్యూటీగా తన స్టేటస్‌ను కొనసాగిస్తూనే మరో యాంగిల్‌లో కూడా సత్తాచాటేందుకు సిద్ధమవుతోంది ఈ బార్బీ డాల్. ఈ భామ నిర్మాతగా కొత్త అవతారం ఎత్తబోతోందట. ఇందులో కమర్షియల్ యాంగిల్‌తో పాటు వ్యక్తిగత ప్రయోజనాలు కూడా ఉన్నాయి. తన చెల్లెళ్లు ఇద్దరిని కూడా హీరోయిన్‌లు చేసేయాలన్నది అమ్మడి చిరకాల కోరిక. చెల్లెళ్లు ఇసాబెల్, సోనియాలు ఇద్దరనీ హీరోయిన్‌లుగా చేసేసి తన స్థాయికి తీసుకురావాలని కత్రినా కోరుకుంటోంది. వారిని హీరోయిన్‌లుగా ప్రమోట్ చేసేందుకు తనే సినిమాలు తీసేయాలని నిర్ణయించుకుంది. ఇంకా ఈ ప్రాజెక్ట్‌లు ఫైనల్ కాకపోయినా తాను సినిమా తీయడం మాత్రం ఖాయమంటోంది కత్రినా కైఫ్. ఇక ఆమె చెల్లెలు ఇసాబెల్ 2014లో వచ్చిన డా.క్యాబీ అనే మూవీతో సినీ అరంగేట్రం చేసేసింది.



తమన్నా

రేడియో జాకీగా తమన్నా

మిల్కీ బ్యూటీ తమన్నా ప్రస్తుతం వరుసగా సినిమాలు చేస్తూ బిజీ బిజీగా ఉంటోంది. కెరీర్ ప్రారంభంలోనే స్టార్ హీరోలతో సినిమాలు చేసి రాణించింది ఈ భామ. అయితే ఈమధ్యన కొన్ని అపజయాలతో ఆమె సతమతమైంది. కానీ తన అందచందాలతో ప్రేక్షకులను అలరిస్తూ యంగ్ హీరోయిన్స్‌కు గట్టి పోటీనిస్తోంది. వరుసగా అవకాశాలను అందుకుంటున్న ఈ ముద్దుగుమ్మ స్పెషల్ సాంగ్స్‌లోనూ అందాలొలికిస్తోంది. ప్రస్తుతం తమన్నా తెలుగులో మూడు సినిమాలతో బిజీగా ఉంది. సందీప్ కిషన్ కొత్త సినిమాతో పాటు బాలీవుడ్ 'క్వీన్' రీమేక్‌లో కూడా నటిస్తోంది. ఇక కళ్యాణ్‌రామ్ సినిమాలో కూడా తమన్నా హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రంలో ఆమె రేడియో జాకీగా కనిపించనుందట. కూల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ఉండే ఈ కథలో అమ్మడి పాత్ర అందరికీ నచ్చుతుందని అంటున్నారు. కళ్యాణ్‌రామ్ కూడా చాలా కొత్తగా కనిపిస్తాడని తెలిసింది. జయేంద్ర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి పిసి శ్రీరామ్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు.

ఓ కలలా జరిగిపోయిందట



అనుపమా పరమేశ్వరన్

అమ్మాయిలకు షాపింగ్ అన్నా, మేకప్ అన్నా ఎంత ఇష్టమో తెలిసిందే. కానీ యంగ్ బ్యూటీ అనుపమా పరమేశ్వరన్‌కు ఇవంటే అస్సలు ఇష్టం ఉండదట. మేకప్ లేకుండా సహజంగా ఉండడమే తనకిష్టమని ఆమె చెబుతోంది. ప్రస్తుతం తెలుగులో మంచి విజయాలను అందుకుంటున్న అనుపమా పరమేశ్వరన్ రింగు రింగుల జుట్టు, అమాయకపు చూపులతో కుర్రకారును ఎంతగానో ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ భామ తెలుగు, తమిళ, మలయాళ చిత్రాలతో బిజీగా గడుపుతోంది. మేకప్ అంటే ఇష్టం లేని ఈ బ్యూటీ అనూహ్యంగా సినిమాల్లోకి రావడం, తనకు నచ్చని మేకప్‌తోనే ఎక్కువగా కనిపించడం ఇదంతా ఓ కలలా జరిగిపోయిందని అంటోంది. ఏదేమైనా సినీ రంగంలోకి అడుగుపెట్టాక తన ఆలోచనల్లో చాలా మార్పులు వచ్చాయని చెప్పింది. సినిమాల్లో ఎలా కనిపించినా బయట మాత్రం సింపుల్‌గానే కనిపిస్తానని అంటోంది. అలాగే తనకు ఫొటోగ్రఫీ అంటే చాలా ఇష్టమట. వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ అంటే ఇంకా ఇష్టమంటోంది. ఒకవేళ నటిని కాకపోయి ఉంటే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌ను అయ్యేదాన్నని ఈ ముద్దుగుమ్మ పేర్కొంది. గత ఏడాది సంక్రాంతికి 'శతమానం భవతి' సినిమాతో బిగ్గెస్ట్ హిట్‌ని తన ఖాతాలో వేసుకుంది మలయాళ కుట్టి అనుపమా పరమేశ్వరన్. ప్రస్తుతం నాని హీరోగా తెరకెక్కుతున్న 'కృష్ణార్జున యుద్ధం' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. సాయిధరమ్‌తేజ్ హీరోగా కరుణాకరన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో కూడా కథానాయికగా చేస్తోంది. ఇదొక క్యూట్ రొమాంటిక్ లవ్ స్టోరీ.

మన తెలంగాణ
9
హైదరాబాద్
సోమవారం
8,జనవరి 2018
www.manatelangana.news



8500 రైల్వే స్టేషన్లకు వైఫై

న్యూఢిల్లీ: దేశంలో అన్ని రైల్వే స్టేషన్లకు..దాదాపు 8500కు పైచిలుకు రైల్వే స్టేషన్లకు వైఫై విస్తరించాలని భారత రైల్వే శాఖ నిర్ణయించుకుంది. ఇందుకు రూ. 700 కోట్లు(110 మిలియన్ డాలర్లు) ఖర్చు కాగలదని అంచనా. ప్రభుత్వ డిజిటల్ ఇండియాలో భాగంగానే రైల్వేస్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 216 ప్రధాన రైల్వే స్టేషన్లలో వైఫై సేవలు లభిస్తున్నాయి. దాదాపు 70 లక్షల మంది రైలు ప్రయాణికులు రైల్వే స్టేషన్‌లోని ఇంటర్నెట్ సదుపాయాన్ని ఉపయోగించుకుంటున్నారు. 'దైనందిన కార్యక్రమంలో ఇంటర్నెట్ వినియోగం అన్నది సర్వసాధారణంగా మారిపోయింది' అని రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన ఓ సీనియర్ అధికారి చెప్పారు. ప్రస్తుతం వైఫై వసతిని విస్తరించేందుకు 1200 స్టేషన్లను గుర్తించారు. దాదాపు 7300 స్టేషన్లలో కూడా దానిని విస్తరించి గ్రామీణ ప్రాంతాల్లోని స్టేషన్ల ప్రయాణికులకు , అలాగే స్థానికులకు కూడా సేవలు అందించాలనుకుంటున్నారు. గ్రామీణ ప్రాంత స్టేషన్లలో వైఫై కియోస్క్‌లను ప్రైవేట్ సంస్థల ద్వారా నిర్వహించనున్నారు. 2018 మార్చి కల్లా 600 స్టేషన్లలో వైఫై అందించే లక్ష్యం నిర్ధారించుకున్నారు. 2019 మార్చి నాటికి మొత్తం 8500 స్టేషన్లు కవర్ చేయాలని కూడా లక్ష్యంగా పెట్టుకున్నారు.

ప్రైవేటీకరించొద్దు

ఎయిరిండియాపై ప్రభుత్వానికి పార్లమెంటరీ కమిటీ సూచన

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ అయిన ఎయిరిండియాను ఇప్పుడే ప్రైవేటీకరించొద్దని, దాని పునరుద్ధరణకు, అప్పులు తీర్చేసేందుకు కనీసం మరి ఐదేళ్ల సమయాన్ని ఇవ్వాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ప్రభుత్వానికి తెలుపనున్నది. అప్పులో కూరుకుపోయిన ఎయిరిండియాకు ఉపశమనం కలిగించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిందిగా సూచించింది. దీనికి సంబంధించిన సవరణల ముసాయిదాను రూపొందించింది.

టర్న్ ఎరౌండ్ ప్లాన్(టిఎపి)లో భాగంగా ఎయిరిండియాలో జొప్పించిన ఈక్విటీ 'పీస్ మీల్ బేసిస్' మాదిరిగా ఉందని, అది దాని ఆర్థిక స్థితిపై , నిర్వహణ తీరుపై ప్రతికూలత ప్రభావాన్ని చూపుతోందని, అది నిలదొక్కుకునేందుకు అధిక వడ్డీరేటుకు మరిన్ని రుణాలు తీసుకోవలసి వస్తోందిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అర్థం చేసుకుంది. రవాణా, పర్యాటకం, సంస్కృతిపై ఏర్పడిన స్టాండింగ్ కమిటీ ఎయిరిండియాలో పెట్టుబడుల ఉపసంహరణపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మరోసారి పునఃపరిశీలించాలని కమిటీ కోరింది. ఎయిరిండియా మన జాతి గౌరవమని ఈ సందర్భంగా పేర్కొంది. దేశవిదేశాల్లో ప్రకృతి విపత్తులు, సామాజిక, రాజకీయ అశాంతి నెలకొన్న సమయాల్లో ఎయిరిండియా గురుతర బాధ్యత నిర్వహించిందని ఉటంకించింది.

ప్రతిపాదిత పెట్టుబడి ఉపసంహరణపై సవరించిన ముసాయిదా నివేదికలో కమిటీ ఆర్థిక పునర్నిర్మాణ పథకం(ఎఫ్ఆర్‌పి) కింద 2012 నుంచి 2022 వరకు పదేళ్లలో ఎయిరిండియా కోలుకునేందుకు సమయాన్ని ప్రభుత్వం ఇచ్చిందని, టర్న్ ఎరౌండ్ ప్లాన్ కాలంలో అదే విధానాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సూచించింది. ఆ గడువు ముగిసేలోపు ఎయిరిండియా పనితీరు ఎలా ఉందన్నది పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది.



ఎయిరిండియా వాటాదారుల వాదనను పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పరిశీలించింది. ఇప్పుడిప్పుడే ఎయిరిండియా లాభాలను ఆర్జించడం జరుగుతోంది, ఇలాంటి సమయంలో పెట్టుబ డుల ఉపసంహరణ నిర్ణయం సరైనది కాదని ప్యానెల్ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఎయిరిండియా అనుబంధ సంస్థలు ఎయిరిండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్(ఎఐఎటిఎస్ఎల్), ఎయిరిండియా ఎస్ఎటిఎస్ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్(ఎఐఎస్ఎటిఎస్), అలియెన్స్ ఎయిర్ అండ్ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ లాభాల్లో పయనిస్తున్నాయని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పేర్కొంది. అందువల్ల ఈ యూనిట్లను తొలగించడం సరైనది కాదని తెలిపింది. ప్రైవేటీకరణ నిర్ణయం వల్ల ఆయా సంస్థల్లో పనిచేస్తున్న పలువురు తమ ఉద్యోగాలను కోల్పోవలసి వస్తుందని ప్యానెల్ ఆందోళన వ్యక్తం చేసింది. ఒక వేళ ఎయిరిండియా వాటాలను అమ్మాలనుకున్నప్పుడు అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులకు వేరే మార్గం చూపించాల్సిందిగా పార్లమెంటరీ సంఘం తన నివేదికలో పేర్కొంది.

2017 మార్చి నాటికి ఎయిరిండియా అప్పు మొత్తం రూ. 48,877 కోట్లుంది. దానిలో రూ. 17,360 కోట్లు విమాన రుణాలు కాగా, రూ. 31,517 వర్కింగ్ క్యాపిటల్ రుణం. 2017–18 ఆర్థిక సంవత్సరంలో ఎయిరిండియా రూ. 3579 కోట్లు నికర నష్టాన్ని చూపెట్టనున్నదని భావిస్తున్నారు. ఎయిరిండియా తన ఆపరేటింగ్ లాభాన్ని పెంచుకోనున్నదని పార్లమెంటుకు సమర్పించిన డేటాలో పేర్కొంది. 2016–17లో ఆపరేటింగ్ లాభం రూ. 215 కోట్లుండగా, 2017–18లో అది రూ. 531 కోట్లకు పెరుగనుందని తెలిపింది.

పతంజలి 'ఆన్‌లైన్' ఒప్పందాలు



న్యూఢిల్లీ: బాబా రామ్‌దేవ్‌కు చెందిన పతంజలి ఆయుర్వేద ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయించనున్నారు. ఫాస్ట్ మూవింగ్ కన్జూమర్ గూడ్స్(ఎఫ్ఎంసిజి) స్వదేశీ ఉత్పత్తులను పెద్ద ఎత్తును ఆన్‌లైన్‌లో అమ్మేందుకు ఎనిమిది ప్రముఖ ఇటెయిలర్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకునేందుకు ఒప్పందం చేసుకోబోతుంది. అమేజాన్, ఫ్లిప్‌కార్ట్, పేటియం మాల్, 1ఎంజి, బిగ్‌బాస్కెట్, గ్రోఫర్స్, షాప్‌క్లూస్, స్నాప్‌డీల్ వంటి ఇ–కామర్స్ దిగ్గజ సంస్థలతో ఈ నెలలోనే ఒప్పందాలు కుదుర్చుకోబోతోంది. న్యూఢిల్లీలో జనవరి 16న పతంజలి సంస్థ ఓ వేడుకను కూడా ఏర్పాటు చేయబోతోంది. ఆ వేడుకకు ఆన్‌లైన్ కంపెనీల ప్రతినిధులు, బాబా రామ్‌దేవ్, పతంజలి కంపెనీ ఎండి ఆచార్య బాలకృష్ణ పాల్గొననున్నారు. 'మేము పెద్ద ఎత్తున ఇ–మార్కెట్‌లోకి వెళ్లబోతున్నాం. అందుకు ఆన్‌లైన్‌లో మా ఉత్పత్తులు అమ్మగల సమర్థ ఆన్‌లైన్ కంపెనీలతో పద్ధతి ప్రకారం ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాం. మారుమూలలో ఉండే వినియోగదారుడికి సైతం మా ఉత్పత్తులు చేరేలా చూడనున్నాం' అని పతంజలి ఆయుర్వేద కంపెనీ ప్రతినిధి ఎస్.కె. తిజరావాల తెలిపారు. పతంజలి ఆయుర్వేద డాట్ నెట్ పోర్టల్‌కు అదనంగా ఇటెయిలర్స్‌లో భాగస్వామ్యం కుదుర్చుకుంటున్నట్లు తెలిపారు. 2016–17 ఆర్థిక సంవత్సరంలో పతంజలి ఉత్పత్తుల వ్యాపారం రూ. 10,500 కోట్లను దాటేసింది. ఇదే ఆర్థిక సంవత్సరంలో రెండితల వ్యాపారం పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

3.14 ట్రిలియన్ డాలర్లకు చైనా విదేశీ మారక నిల్వలు



బీజింగ్: చైనా విదేశీ మారకం నిల్వలు వరుసగా 11వ నెల కూడా 3.14 ట్రిలియన్ డాలర్లకు పెరిగింది. ప్రపంచంలో అత్యధిక విదేశీ మారకం నిల్వలు కలిగిన దేశంగా చైనా నిలిచింది. ఈ విషయాన్ని పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా తన డిసెంబర్ డేటాలో పేర్కొంది. 2016 సెప్టెంబర్ నుంచి ఇదే అత్యధిక స్థాయి అని పేర్కొంది. గత కొన్ని దశాబ్దాలుగా చైనా విదేశీ మారకాన్ని సేకరిస్తోంది. అందుకు ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఎగుమతులు చేస్తోంది. ఇక చైనా బంగారం నిల్వలు డిసెంబర్ చివరి వరకు 76.47 బిలియన్ డాలర్లు అని చైనా బ్యాంకు పేర్కొంది.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.89
యూరో	75.33
బ్రిటిష్ పౌండ్	85.18
ఆస్ట్రేలియన్ డాలర్	49.84
కెనెడియన్ డాలర్	50.64
ఎమిరైట్ దిర్హామ్	17.67
స్విస్ ఫ్రాంక్	64.97
చైనీస్ యువాన్	9.76
మలేషియన్ రింగిట్	15.3
న్యూజిలాండ్ డాలర్	44.67
హాంగ్‌కాంగ్ డాలర్	8.31
జపనీస్ యెన్	0.57
కువైట్ దినార్	214.41
సౌతాఫ్రికన్ రాండ్	4.59

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	28180	30139.04	0.43%
ముంబై	28930	30941.18	– 0.1%
ఢిల్లీ	28350	30320.86	– 0.53%
కోల్‌కతా	28930	30941.18	–0.52%
కేరళ	27350	29251.34	0.55%
బెంగళూరు	27600	29518.72	0.73%
హైదరాబాద్	28200	30160.43	0.53%
గల్ఫ్	1346.4	1440.00	0.65%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	సోమవారం	శనివారం	మార్పు (%)
చెన్నై	41700.00	42000.00	–0.71
ముంబై	41700.00	42000.00	–0.71
ఢిల్లీ	41700.00	42000.00	–0.71
కోల్‌కతా	41700.00	42000.00	–0.71
హైదరాబాద్	41700.00	42000.00	–0.71



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	390	విశాఖపట్నం	395
వరంగల్	392	చిత్తూరు	398
విజయవాడ	388	చెన్నై	405
గోదావరి	388	బెంగళూరు	395

తిరుపతి నుంచి హైదరాబాద్, బెంగళూరులకు

ఇండిగో విమానాలు



తిరుపతి: తక్కువ ధరలో బడ్జెట్ విమానాలు నడిపే ఇండిగో విమాన సంస్థ తిరుపతి నుంచి హైదరాబాద్ ప్రతిరోజు మూడు, బెంగళూరుకు ప్రతి రోజు రెండు విమానాలను నడిపే సేవలను ఆదివారం ఆరంభించింది. కేంద్ర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతి రాజు, ఇండిగో ప్రెసిడెంట్ ఆదిత్య ఘోష్ తిరుపతికి 15 కిమీ. దూరంలో ఉండే రేణిగుంటలోని శ్రీ వెంకటేశ్వర అంతర్జాతీయ విమానాశ్రయంలో జెండా ఊపి ఆరంభించారు. దీనికి ముందు అశోక గజపతి రాజు శ్రీవారిని దర్శించుకున్నారు.

జోరును కొనసాగించనున్న సహ ఉద్యోగ స్థలాలు



ముంబయి: పనిచేసే స్థలాలకు(వర్కింగ్ ప్లేసెస్) ప్రత్యామ్నాయం సహ ఉద్యోగ స్థలాలు(కో–వర్కింగ్ ప్లేసెస్). గత ఏడాది ఈ సహఉద్యోగ స్థలాలు ఊపందుకున్నందున ఈ ఏడాది కూడా జోరు కొనసాగించగలవని నిపుణులు భావిస్తున్నారు. సహ–ఉద్యోగ స్థలం అనేది ఓ కొత్త ఆలోచన. పనిచేసే స్థలాన్ని వేర్వేరు సంస్థల శ్రామికులు పంచుకోవడం అనేదే ఈ విధానం. ప్రపంచంవ్యాప్తంగా ప్రైవేట్ రంగంలో ఈ పద్ధతి బాగా విస్తరిస్తోంది. ప్రాపర్టీ కన్సల్టెంట్ సంస్థ జోన్స్ ల్యాంగ్ లాసల్లే అధ్యయనం ప్రకారం 2018కల్లా సహఉద్యోగ స్థలాలు 400 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పొందనున్నాయని తెలిపింది. ప్రస్తుతం భారత్‌లో ఈ సహఉద్యోగ స్థలాలు 1 కోటి 20 లక్షలు మొదలుకుని 1 కోటి 60 లక్షల సీట్ల వరకు స్థలాన్ని ఆక్రమిస్తున్నాయి. ఈ సహఉద్యోగ స్థలాలు అనేవి కేవలం ఫ్రీలాన్సర్లకు లేక స్టార్టప్ ఉద్యోగులకే పరిమితం కాలేదు. చిన్న తరహా వ్యాపార సంస్థలు మొదలుకుని పెద్ద కార్పొరేట్ కార్యాలయాల వరకు అన్ని సహఉద్యోగ స్థలాల కోసం చూస్తున్నాయి' అని జెఎల్ఎల్ ఇండియా సిఇఒ రమేశ్ నాయర్ అన్నారు.

ఫ్రీలాన్సర్‌లు సాధారణంగా వ్యయం మీదే దృష్టి పెడుతున్నారు. ఇక స్టార్టప్‌లు, చిన్నమధ్య తరహా వ్యాపార సంస్థలు వ్యయంపైనే కాక మౌలికవసతులపై కూడా దృష్టి పెడుతున్నాయి. మరోవైపు బడా కార్పొరేట్ సంస్థలు రాకపోకల రవాణాకు ప్రాధాన్యతను ఇస్తున్నాయి. తమ కార్యాలయం ప్రదేశం, మౌలికవసతులు ముఖ్యంగా భావిస్తున్నాయి.


'సహఉద్యోగ ప్రదేశాల రాశి పరంగానేకాక, వివిధ వ్యాపార సంస్థలు వాటిని కోరుతుండడం వల్ల అవి జోరందుకున్నాయి. ఇప్పుడు చాలా మంది సహఉద్యోగ స్థలాలకు లైను కడుతున్నారు' అని నైట్ ఫ్రాంక్ ఇండియా చీఫ్ ఎకనామిస్ట్, జాతీయ పరిశోధన డైరెక్టర్ సమంతక్ దాస్ చెప్పారు. 'సహఉద్యోగ స్థలాలు అనేక మైక్రో మార్కెట్లను కవర్ చేయడమే కాక, 2018లో మరింత ప్రణాళికబద్ధ ఎదుగుదలను చూడగలవు' అని రియల్టీ సేవలందించే 'సిలా' సంస్థ వ్యవస్థాపకుడు సాహిల్ వోరా చెప్పారు. రానున్న సంవత్సరాల్లో అనేక మార్కెట్లలో కొంత మంది ఈ సహ–ఉద్యోగ స్థలాల షేరింగ్‌ను పెంచుకుంటారని తెలుస్తోంది.

రూ. 100 కోట్లకు మించిన రుణ ఎగవేత ఖాతాలు 1463



న్యూఢిల్లీ : బ్యాంకులు నిరర్థక ఆస్తులతో సతమతమవుతున్న విషయం తెలిసిందే. 21 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూ.100 కోట్ల కంటే ఎక్కువ రుణాలు తీసుకొని ఎగవేసిన ఖాతాల సంఖ్య 1,463 వరకు ఉన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన ఎస్‌బిఐలోనే రూ.100కోట్లకు పైగా రుణాలు తీసుకొని ఎగ్గొట్టిన ఖాతాల సంఖ్య 265 వరకు ఉన్నాయి. ఆ రుణాల మొత్తం సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి రూ.77,538 కోట్లకు చేరింది. ఈ బ్యాంకుల జాబితాలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ కూడా టాప్‌లోనే ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. రూ.100 కోట్ల కంటే ఎక్కువ రుణాలు కలిగిన 143 నిరర్థక ఆస్తుల అకౌంట్లు పిఎన్‌బి వద్ద ఉన్నాయి. వీటి మొత్తం విలువ రూ.45,973 కోట్లు. ఆ తర్వాతి స్థానంలో కెనరా బ్యాంకు ఉంది. ఇక చిన్న ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఇలాంటి 79 ఖాతాలతో యూనియన్ బ్యాంక్ ముందుంది. ఆతర్వాతి స్థానంలో 68 ఖాతాలతో ఓరియంటల్ బ్యాంక్, 62 ఖాతాలతో యూకో బ్యాంక్ ఉన్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం చివర్లో ప్రభుత్వ రంగ బ్యాంకుల నిరర్థక ఆస్తుల మొత్తం విలువ రూ. 7.34 లక్షల కోట్లుగా ఉంది. ఫండ్ అండ్ నాన్–ఫండ్ ఆధారిత అప్పులు రూ. 5000 కోట్లకు మించినవి 12 ఖాతాలున్నాయని ప్రస్తావించిన కొన్ని బ్యాంకులకు ఆర్‌బిఐ ఆదేశాలు జారీ చేసింది. 60 శాతం కన్నా ఎక్కువ నిరర్థక ఆస్తులున్నవని వర్గీకరించిన ఖాతాలపై ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంకరప్టసీ కోడ్ 2016 కింద దివాలా చర్యలను చేపట్టాలని సూచించింది. ప్రభుత్వ రంగ బ్యాంకులను ఆదుకోడానికి, బలోపేతం చేయడానికి ప్రభుత్వం రూ. 2.12 లక్షల కోట్ల రీక్యాపిటలైజేషన్ ప్లాన్‌ను ఇప్పటికే చేపట్టింది. 2018 మార్చి చివరికల్లా రిక్యాపిటలైజేషన్ బాండ్ల ద్వారా రూ. 80 వేల కోట్లను ఇచ్చేందుకు ప్రభుత్వం పార్లమెంటు సమ్మతి కూడా పొందింది.

చైనా ఫార్మా కంపెనీలకు నోటీసులు



న్యూఢిల్లీ: నాసిరకం నాణ్యతతో ఔషధాలు సరఫరా చేస్తున్న ఎనిమిది చైనా ఫార్మాస్యూటికల్ కంపెనీలకు భారత ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. త్వరలో వాటిని బ్లాక్‌లిస్ట్‌లో కూడా పెట్టనున్నారని సమాచారం. డ్రగ్ కంట్రోల్ జనరల్ ఆఫ్ ఇండియా(డిసిజిఐ)కు చెందిన ప్రత్యేక పరిశీలక బృందం ఎనిమిది చైనా ఫార్మా కంపెనీలను తనిఖీ చేశాక ఈ నోటీసలు ఇచ్చారు. ఆ ఎనిమిది కంపెనీల ఖిలు తియన్హే ఫార్మాస్యూటికల్స్, హినన్ జిన్‌జియాంగ్ ఫార్మాస్యూటికల్స్, జుహై యునైటెడ్ లాబరేటరీస్, గ్వాంగ్జోవో బైయుంషన్ ఫార్మాస్యూటికల్స్, షోగ్వాంగ్ ఫుకంగ్ ఫార్మాస్యూటికల్స్, క్విలు యాంటీబయోటిక్స్(లిన్‌యి) ఫార్మాస్యూటికల్స్, ఖిండవో బ్రైట్‌మూన్ సీవుడ్స్, షాంఘై జియాండియా హసెన్(షాంగ్‌ఖ్యు) ఫార్మాస్యూటికల్స్.ఈ కంపెనీలు భారతీయ ఔషధ తయారీ కంపెనీలకు ముడి సరుకును పెద్ద ఎత్తున అందిస్తున్నాయి. ఈ కంపెనీలు అందించే సరుకు నాసిరకమైనవని ఆరోపణ. 'వాటిపై ఎలాంటి చర్య చేపట్టాలో త్వరలో ప్రభుత్వమే నిర్ణయిస్తుంది,ఇలాంటి నాసిరకం ఔషధాలపై భారత్ రాజీపడబోదు, కఠినంగా వ్యవహరిస్తుంది' అని డిసిజిఐ సీనియర్ అధికారి తెలిపారు. భారత్ 70 శాతం ఔషధాల ముడిసరుకును చైనా నుండే పొందుతోందని రసాయన, ఎరువుల మంత్రిత్వ శాఖ డేటా వెల్లడించింది. 2016–17లో రూ. 12,254.97 కోట్లు విలువచేసే యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్స్(ఎపిఐ)ను చైనా నుంచి దిగుమతి చేసుకున్నట్లు ఇది 2015–16లో రూ. 13,853.20 కోట్లుండేదని ప్రభుత్వం పార్లమెంటుకు తెలిపింది. గమనించాల్సిన విషయమేమిటంటే చైనాకు చెందిన ఎపిఐలు భారత్‌లో తయారయ్యేదానికన్నా నాలుగు రెట్లు చౌక అని ప్రస్తుతం రక్షణ మంత్రిగా పనిచేస్తున్న నాటి వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2017 మార్చిలో చెప్పారు.

న్యూజెన్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ ఐపిఒ

న్యూఢిల్లీ: ఆర్థిక సంస్థలకు సాఫ్ట్‌వేర్లను తయారు చేసే న్యూజెన్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ ఐపిఒ తీసుకొచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ ఐపిఒ జనవరిలోనే మార్కెట్‌లోకి వచ్చే అవకాశం ఉంది. ఈ ఐపిఒ విలువ రూ.450 కోట్లు ఉండవచ్చని అంచనా. దీనిపై కంపెనీ ఎండి దివాకర్ నిగమ్ మాట్లాడుతూ ' ఈ ఐపిఒ ద్వార సమకూరే నిధులతో కంపెనీలోని కొందరు పెట్టుబడిదారులు వైదొలగనున్నారు. ముఖ్యంగా కొందరు ఉద్యోగులకు కేటాయించిన షేర్లను కూడా విక్రయించే అవకాశం ఉంది. దీంతోపాటు రూ.100 కోట్ల వ్యయంతో నొయిడాలో కొత్త ఆఫీస్‌ను నెలకొల్పనున్నాము. ఈ మేరకు ఆర్ఒసికు దరఖాస్తు చేసుకొన్నాము. ఈ ఐపిఒలో 25–26శాతం వాటాను విక్రయిస్తాం. ప్రమోటర్ల వాటాలను మాత్రం విక్రయించడంలేదు. ' అని చెప్పారు. న్యూజెన్ సాఫ్ట్ సంస్థ 2016–17లో రూ.433.76 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. దీనిలో రూ.52.36 కోట్లు నికర లాభాన్ని సాధించింది. ఈ సంస్థ తొలిసారి 1992లో వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించింది. ప్రస్తుతం మొత్తం 60 దేశాలకు సాఫ్ట్‌వేర్‌లను ఎగుమతి చేస్తోంది. అమెరికా, కెనడా, సింగపూర్, ఇంగ్లాండ్‌లలో ఈ సంస్థకు కార్యాలయాలు ఉన్నాయి.



ప్రజలను పిచ్చోళ్లను చేస్తున్న బిజెపి : అఖిలేశ్



లక్నో : ఉత్తరప్రదేశ్‌లో అధికార బిజెపిపై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రజలను కాషాయ పార్టీ పిచ్చివాళ్లను చేస్తుందంటూ మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌లో పెద్ద ఎత్తున రాష్ట్రానికి నిధులను రాబట్టాల్సిందిపోయి సమయాన్ని వృథా చేస్తున్నదని ధ్వజమెత్తారు. ఆదివారం అఖిలేశ్ యాదవ్ లక్నోలో విలేకరులతో మాట్లాడారు. లక్నోలో బుల్లెట్ ట్రైన్ సేవలను ప్రారంభించాలని సూచిస్తూ అందుకు ఎక్కువ మొత్తంలో అవసరమైన బడ్జెట్‌ను కేంద్రం నుంచి రాబట్టడానికి బదులు అధికార పార్టీ సమయాన్ని వృథా చేస్తూ ప్రజలను పిచ్చివాళ్లను చేస్తున్నదన్నారు. రానున్న రోజుల్లో సమాజ్‌వాదీ పార్టీని జాతీయ పార్టీ స్థాయికి విస్తరింపజేసేందుకు ప్రయత్నిస్తానని, పార్టీని బలోపేతం చేసేందుకు అవసరమైతే రథయాత్ర చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఇవిఎం అంశంపై భావసారూప్యతగల ప్రతిపక్షాలతో శనివారం అఖిలేశ్ చర్చించారు. దీనిపై విలేకరులు ప్రశ్నించగా, లోక్‌సభ ఎన్నికలు జరగడానికి ముందే గోరఖ్‌పూర్, ఫుల్పూర్‌లో జరిగే ఉప ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లను ఉపయోగించాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో ఇతర పార్టీలతో కలిసి కూటమిగా ఏర్పడేందుకు చర్చలు జరుపుతున్నామని ఆయన చెప్పారు. కాగా, చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున చిన్నారులకు స్వెట్టర్ల పంపిణీని ఇంకా ప్రారంభించక పోవడంపై అఖిలేశ్ ప్రశించారు.

మోడీ, పాక్ మిత్రులుగా మెలగాలి : ముఫ్తీ

శ్రీనగర్ : సరిహద్దులోని కశ్మీరీలు, జవానుల కోసం ప్రధాన నరేంద్ర మోడీ, పాకిస్తాన్‌లు వైరాలను వదులుకుని స్నేహితులుగా మెలగాలని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ విజ్ఞప్తి చేశారు. 'సరిహద్దులో ఉన్న పాకిస్తానీలు, భారత ప్రధాన నరేంద్ర మోడీలు ఈ చట్రం నుంచి బయటకు వచ్చి కశ్మీరీలకు సహాయం చేయాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. సమస్యకు పరిష్కారాలు కొనుగొని, చర్చలు నిర్వహించి, మిత్రులుగా మారండి' అని అన్నారు. ఆదివారం ఆయన అనంత్‌నాగ్ జిల్లాలో జరిగిన ర్యాలీలో ప్రసంగించారు. బారాముల్లా జిల్లాలోని సోపోర్‌లో జరిగిన బాంబుపేలుడులో నలుగురు పోలీసులు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఒకరోజు అనంతరం మెహబూబా ముఫ్తీ ఈ విజ్ఞప్తి చేయడం గమనార్హం. గత ఏడాది డిసెంబరు 31న పాకిస్తాన్‌కు చెందిన జైషే ఇ అహ్మద్ ఉగ్రవాద సంస్థ చేసిన దాడిలో ఐదుగురు సిఆర్‌పిఎఫ్ సిబ్బంది మృతి చెందారు.

26న మళ్లీ కేరళకు ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్

న్యూఢిల్లీ : వామపక్ష పాలిత రాష్ట్రమైన కేరళలో గత ఏడాది ఆగస్టు 15న జాతీయ జెండా ఎగురవేత వివాదాస్పదమైనప్పటికీ, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ గణతంత్ర దినోత్సవం నాడు మరోసారి జెండాను ఎగురవేసేందుకు సిద్ధపడుతున్నారు. పలాక్కడ్ శివార్లలో ఉన్న ఓ పాఠశాలలో జనవరి 26న జెండాను ఎగురవేయనున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు వెల్లడించారు. 26 నుంచి మూడు రోజుల పాటు ఆ పాఠశాలలో జరిగే ఆర్‌ఎస్‌ఎస్ క్యాంపుకు భగవత్ హాజరుకానున్నారు. అయితే స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం నాడు భగవత్ ఎక్కడ ఉన్నా జాతీయ జెండాను ఎగురవేస్తారని ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ నాయకుడు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆయన జనవరి 26న కేరళకు విచ్చేయనున్నారని, అక్కడే భగవత్ జాతీయ జెండాను ఎగురవేస్తారని చెప్పారు.

ప్రధానికి కేరళ సిఎం లేఖ

తిరువనంతపురం : కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాశారు. కోస్టు గార్డ్ అకాడమీని కన్నౌర్ జిల్లా నుంచి కర్నాటకలోని మంగళూరుకు తరలించే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని ఆ లేఖలో సిఎం పేర్కొన్నారు. కేరళ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా కేంద్రం వ్యహరించవద్దని, కోస్టుగార్డు అకాడమీని తరలించాలని ప్రతిపాదనలు చేయడం అన్యాయమని, ఈ చర్యను వెంటనే మానుకోవాలని లేఖలో కోరినట్లు సిఎంఒ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అకాడమీకి అవసరమయ్యే మౌలిక వసతులకు రూ.65.56 కోట్లు వ్యయం చేయడంతో పాటు 164 ఎకరాల భూమిని బదలాయించినట్లు సిఎం చెప్పారు. అయితే ఆ భూమి మడ అడవులకు గొప్ప స్టోర్‌హౌస్‌గా ఉందని, అక్కడ నిర్మాణాలు చేపట్టరాదని కేంద్ర పర్యావరణ శాఖ అనుమతిని నిరాకరించింది.

సచిన్ కూతురుకు వేధింపులు



ముంబయి : ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ కూతురికి కూడా వేధింపులు తప్పలేదు. తనను పెళ్లి చేసుకోవాలని, లేకపోతే కిడ్నాప్ చేస్తానంటూ సారా టెండూల్కర్‌ను ఫోన్‌లో బెదిరించిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని ఈస్ట్ మిడ్నాపూర్ జిల్లాకు చెందిన అతని పేరు దేబ్‌కుమార్ మైతీ. తనను పెళ్లి చేసుకోవాల్సిందిగా దేబ్ ఎన్నోసార్లు సారాకు ఫోన్ చేశాడని ముంబయి పోలీసులు వెల్లడించారు. తనను పెళ్లి చేసుకోకపోతే కిడ్నాప్ చేస్తానని కూడా అతను సారాను బెదిరించాడు. సచిన్ ఇంట్లో ఉన్న ల్యాండ్‌లైన్‌కు ఆ వ్యక్తి ఫోన్ చేసినట్లు పోలీసులు తెలిపారు. దీంతో సచిన్ కుటుంబం బాంద్రా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన పోలీసులు వెస్ట్ బెంగాల్‌లోని ఈస్ట్ మిడ్నాపూర్ నుంచి ఫోన్ వస్తుందని, అతడు దేబ్‌కుమార్ అని గుర్తించారు. అక్కడి పోలీసుల సాయంతో దేబ్‌ను అరెస్ట్ చేశారు. పన్నెండో తరగతితో చదువు ఆపేసిన అతడు స్థానికంగా ఆర్టిస్ట్. అయితే దేబ్‌కుమార్ కొన్ని నెలలుగా మానసిక రోగంతో బాధపడుతున్నాడని, కొన్ని రోజులుగా చికిత్స కూడా తీసుకుంటున్నాడని అతని తల్లి కనక్, సోదరుడు రాజ్‌కుమార్ తెలిపారు. మానసిక స్థితి సరిగా లేకే అతను ఇలాంటి పని చేసినట్లు వాళ్లు చెబుతున్నారు. దేబ్ మాత్రం సారాను పెళ్లి చేసుకోవాలనుకోవడంలో ఎలాంటి తప్పులేదని వాదించాడు. సచిన్ ఎవరని అడిగితే.. 'నా మామ' అని సమాధానమివ్వడం విశేషం.

లాలూ ప్రసాద్‌కు తోటమాలి పని



రాంచీ : దాణా కుంభకోణంలో శిక్ష అనుభవిస్తున్న ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తోటమాలిగా మారారు. రోజుకు 93 రూపాయల కూలీ పొందనున్నారు. ఇంత కాలం రాంచీలో బిర్సాముండా జైలులో శిక్ష అనుభవించిన లాలూను ఆదివారం హజారీబాగ్ ఓపెన్ జైలుకు తరలించారు. అక్కడ లాలూ తోటమాలిగా అనేక పనులను చేయాల్సి ఉంటుంది. అందుకు గాను కేవలం 93 రూపాయల దినసరికూలీ లభించనుంది. గత ఏడాది డిసెంబర్ 23 న లాలూతో పాటు మరో 15 మందిని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం దోషులుగా నిర్ధారించింది. అప్పటి నుంచి రాంచీలోని బిర్సాముండా జైలులో పోలీసుల కస్టడీలో లాలూ ఉన్నారు. జనవరి 6 న సిబిఐ న్యాయస్థానం లాలూకు శిక్ష ఖరారు చేసింది. మూడేళ్ల జైలు శిక్ష, 10 లక్షల జరిమానా విధించింది.

థాంక్యూ వెరీమచ్ నితీష్ : బిజెపి, నితీష్ కుమార్‌లు చేసిన కుట్ర కారణంగా లాలూ ప్రసాద్ యాదవ్ బాధితుడిగా మారాల్సి వచ్చిందని లాలూ తనయుడు తేజస్వి యాదవ్ మండిపడ్డారు. దర్యాప్తు సంస్థను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు.ఆర్‌జెడిని విభజించడానికి కుట్ర జరుగుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్విట్టర్ లో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ పట్ల వ్యంగంగా స్పందించారు. థాంక్యూ వెరీమచ్ నితీష్ కుమార్ అంటూ ట్వీట్ చేశారు. అదే విధంగా బీహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవి కూడా నితీష్ తీరును ఎండగట్టారు. నితీష్ కుమార్ బిజెపితో చేతులు కలిసి ప్రజాతీర్పును అపహాస్యం చేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

లాలూ సోదరి మృతి : తన సోదరుడు లాలూ ప్రసాద్‌కు మూడున్నరేళ్ల జైలు శిక్ష ఖరారు కావడంతో అతని సోదరి గంగ్రోత్రి దేవి తీవ్రంగా కుంగిపోయారు. శనివారం రాత్రంతా ఆమె తీవ్ర ఆవేదన చెందారు. ఆదివారం చనిపోయారు. ఈ విషయాన్ని లాలూకు జైలు అధికారుల ద్వారా కుటుంబ సభ్యులు చేరవేశారు. ఆదివారం సెలవు కావడంతో పెరోల్‌పై బయటకు వచ్చేందుకు అవకాశం లేకుండా పోయింది. సోదరి కర్మకాండలకైనా లాలూ ప్రసాద్ హాజరయ్యేందుకు తేజస్వీ యాదవ్ ప్రయత్నిస్తున్నారు. పెరోల్ పొందేందుకు కృషి చేస్తున్నారు.

పతంగుల పండుగొచ్చింది



అహ్మదాబాద్ : అంతర్జాతీయ పతంగుల పండుగ గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ప్రారంభమైంది. ఆదివారంనాడిక్కడ అట్టహాసంగా మొదలైన ఈ పండుగకు ఔత్సాహితులకు భారీ ఎత్తున తరలివచ్చారు. సబర్మతి నది ఒడ్డున ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక ప్రాంతంలో ఈ పండుగను సిఎం విజయ్ రూపానీ, గవర్నర్ ఒపి కోహ్లీ ప్రారంభించారు. దేశం నలుమూలలతో పాటు వివిధ దేశాల నుంచి ఔత్సాహికులు తరలివచ్చి భిన్న రకాల పతంగులను ఆకాశంలోకి ఎగురవేయడం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఆదివారంనాడు ఆరంభమైన అంతర్జాతీ పతంగుల పండుగ ఈ నెల 14వరకు నిర్వహిస్తారు. 44దేశాల నుంచి 150మంది ప్రతినిధులు తొలిరోజు హాజరైనట్లు నిర్వహకులు తెలిపారు. వచ్చిన వారిలో అమెరికా, ఇంగ్లాండ్, దక్షిణ కొరియా, న్యూజీలాండ్, చైనా తదితర దేశాల వారు ఉన్నారని వెల్లడించారు. భారత్‌లోని 18రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారని చెప్పారు.

కశ్మీర్‌లో మోడీ వైఫల్యం



దినేశ్వర్ నియామకం ఎన్నికల జిమ్మిక్కు : చిదంబరం

న్యూఢిల్లీ : జమ్మూకశ్మీర్‌లో శాంతిని పునరుద్ధరించడంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.చిదంబరం ధ్వజమెత్తారు. కృషి, కండ, సైనికబలం ఉన్నప్పటికీ ప్రభుత్వ విధానం వల్ల ఉగ్రవాదాన్ని నివారించకపోగా ఈ రాష్ట్రంలో సమస్య మరింత జటిలంగా మారిందని ఆదివారం ట్విటర్‌లో విమర్శించారు. హోం మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలను ప్రస్తావిస్తూ...జమ్మూకశ్మీర్‌లో మరణించిన పౌరులు, ఉగ్రవాదుల సంఖ్య 28 నుంచి 57కు పెరుగగా, 2017లో 110 నుంచి 218కి పెరిగిందని పేర్కొన్నారు. ఇదే సమయంలో భద్రతా బలగాల సంఖ్య కూడా 47 నుంచి 83కు పెరిగిందని వివరించారు. కశ్మీర్ అంశంలో మధ్యవర్తిగా దినేశ్వర్ శర్మ నియామకంపై ఆయన మాట్లాడుతూ ఈ నియామకాన్ని ఎన్నికల ముందు జిమ్మిక్కుగా రాజకీయ పార్టీలు విమర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. 'గుజరాత్‌లో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో దినేశ్వర్ శర్మను ప్రత్యేక ప్రతినిధిగా ప్రభుత్వం నియమించింది. అంటే అతన్ని కలుసుకోవాలనుకునే వారితో శర్మ మాట్లాడతారు. కాని, రాజకీయ పక్షాలు ఈ నియామకాన్ని ఓ రాజకీయ జిమ్మిక్కుగా కొట్టిపారేశాయి' అని చిదంబరం పేర్కొన్నారు. 1989 నుంచి వేర్పాటువాద ఉద్యమం నేపథ్యంలో వేలాది మంది మృత్యువాత పడిన జమ్మూకశ్మీర్‌లో సమస్యలకు రాజకీయ పరిష్కారానికి విజ్ఞతతో వ్యవహరించాల్సింది ఉందని అన్నారు. 'సైనికులు, పోలీసులు ప్రతి రోజూ ప్రాణాలు కోల్పోతున్నారు. దీనిపై ప్రభుత్వం వివరణ ఇవ్వగలదా? ఈ మరణాలకు ఆపగలిగేది ఎప్పుడు?' అని మరో సీనియర్ నేత కపిల్ సిబాల్ ట్విటర్ వేదికగా ప్రధాని నరేంద్ర మోడీని ప్రశ్నించారు. బారాముల్లా జిల్లాలోని సోపోర్‌లో జరిగిన బాంబుపేలుడులో నలుగురు పోలీసులు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన నేపథ్యంలో ఈ ఇరువురు సీనియర్ నేతలు ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.



కాగా, కశ్మీర్‌కు గ్రేటర్ అటానమీపై చిదంబరం మాట్లాడుతూ ఈ విషయాన్ని సీరియస్‌గా పరిశీలించాలని, ఏఏ ప్రాంతాలకు దీన్ని మంజూరు చేశారో ఆ ప్రాంతాలపై సీరియస్‌గా పరిశీలన చేయాల్సివుందని సూచించారు. ఇది పెద్ద వివాదాన్నే లేపింది.

జమ్మూకశ్మీర్‌లో మరణ గణాంకాలు

ఏడాది	పౌరులు	ఉగ్రవాదులు	బలగాలు
2014	28	110	47
2015	17	108	39
2016	15	150	82
2017*	40	206	75
2017**	57	218	83

* డిసెంబర్ 14 వరకు ** వివిధ ఘర్షణల్లో

మద్యాన్ని అరికట్టేందుకు సమగ్ర విధానం

కేంద్రం, రాష్ట్రాలకు సూచించాలని రాష్ట్రపతికి సురవరం లేఖ

హైదరాబాద్ : మద్యం వినియోగాన్ని అరికట్టేందుకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఓ విధానాన్ని రూపొందించు కునేలా చూడాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి రాష్ట్రపతి రాంనాధ్ కోవింద్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన రాష్ట్రపతికి లేఖ రాశారు. మద్యం వినియోగాన్ని అరికట్టేందుకు కేంద్రం, రాష్ట్రాల్లో ఏకరూప విధానమంటూ ఏదీ లేదని, పైగా అనేక రాష్ట్రాలు మద్యం విక్రయాలను ప్రధాన ఆదాయ వనరుగా భావిస్తున్నాయని సురవరం ఆ లేఖలో పేర్కొన్నారు. అయితే, రోడ్డు ప్రమాదాలు, నేరాలకు మద్యం వినియోగం ప్రధాన కారణంగా నిలుస్తోందని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో మద్యం విక్రయాలను అరికట్టేందుకు ఓ సమగ్రమైన విధానాన్ని రూపొందించుకునేలా కేంద్రం, రాష్ట్రాలకు సూచించాలని ఆయన రాష్ట్రపతిని కోరారు.



పాత్రికేయుడిపై యుఐడిఎఐ ఫిర్యాదు

కేసు నమోదు చేసిన పోలీసులు



న్యూఢిల్లీ : ఆధార్ సమాచారాన్ని వాట్సాప్ ద్వారా విక్రయిస్తున్నారంటూ వార్త ప్రచురించిన 'ది ట్రిబ్యూన్' పత్రిక, వార్త రాసిన పాత్రికేయునిపై విశిష్ట గుర్తింపు ప్రాధికారి సంస్థ (యుఐడిఎఐ) పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' తెలియజేసింది. యుఐడిఎఐ డిప్యూటీ డైరెక్టర్ బిఎం పట్నాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు జర్నలిస్టు రచనా ఖైరాతో పాటు అనిల్ కుమార్, సునీల్ కుమార్, రాజ్‌లపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ జరుగుతోందని జాయింట్ కమిషనర్ (క్రైం బ్రాంచ్) అలోక్ కుమార్ తెలిపారు. రూ.500 చెల్లిస్తే పది నిమిషాల్లో ఇతరుల ఆధార్ సమాచారం వాట్సాప్ ద్వారా నిమిషాల వ్యవధిలో బయటకు వస్తుందని 'ది ట్రిబ్యూన్' పత్రిక వార్తను ప్రచురించింది. దీనిపై యుఐడిఎఐ వెంటనే స్పందించింది. ఆధార్ సమాచారం భద్రంగా ఉందని, ప్రజలెవరూ ఆందోళన పడొద్దని తెలిపింది. మరోవైపు జర్నలిస్టుపై కేసు నమోదు చేయడాన్ని ఎడిటర్స్ గిల్డ్ ఖండించింది. భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమేనని పేర్కొంది.

సరిహద్దు వెంట 14వేల బంకర్లు!

జమ్ము: సరిహద్దుల్లో నిత్యం పొరుగుదేశం కాల్పుల ఉల్లంఘనలకు పాల్పడుతుండడం, వీటిల్లో అమాయకులైన సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోవడంతో పాటు జనజీవనానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి వాటిని కొంతైనా అధిగమించేందుకు కేంద్రం ఒక నిర్ణయానికి వచ్చింది. ఈ మేరకు జమ్మూ కశ్మీర్ అధికారులు ఆదివారంనాడు సూచనప్రాయంగా వెల్లడించారు. పాక్‌తో ఉన్న నియంత్రణ రేఖ(ఎల్‌ఒసి), అంతర్జాతీయ సరిహద్దు(ఐబి) వెంట 14వేలకుపైగా బంకర్లను నిర్మించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. సరిహద్దుల్లో పాక్ రేంజర్లు తరచూ కాల్పులు జరుపుతుండటంతో షెల్స్ తగలడం వల్ల ఎంతో మంది సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఉన్నాయి. వీటి నుంచి ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం బంకర్లను నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. పూంచ్, రాజౌరిలోని నియంత్రణ రేఖ వెంబడి 7,298 బంకర్లు, జమ్ము, కథువాలోని ఐబి వెంట 7,162 భూగర్భ బంకర్లను నిర్మించనున్నట్లు తెలిపారు. సరిహద్దు వెంట నివసించే వారి రక్షణ నిమిత్తం కేంద్రం ఈ బంకర్ల నిర్మాణానికి అంగీకారం తెలిపింది. రూ.415.73కోట్ల వ్యయంతో మొత్తం 14,460 బంకర్లను నిర్మించనున్నారు. 160 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఎనిమిది మంది నివసించే విధంగా వ్యక్తిగత బంకర్లు, 800 చదరపు అడుగుల విస్తీర్ణంలో 40 మంది ప్రజలు నివసించే విధంగా కమ్యూనిటీ బంకర్లను నిర్మించనున్నారు.



మరో వివాదంలో యోగి ప్రభుత్వం

లక్నో : యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం రాష్ట్రం మొత్తాన్ని కాషాయమయం చేసే పనిలో ఉన్నట్లు స్పష్టమౌతోంది. ఇటీవలే హజ్ కార్యాలయం సరిహద్దు గోడ (బౌండరీ వాల్) విషయంలో వివాదం తలెత్తినా ప్రభుత్వం వెనకడుగు వేయడం లేదు. తాజాగా లక్నో పోలీస్ స్టేషన్ కూడా కాషాయ రంగుతో అలంకరించింది. 80 ఏళ్ల క్రితం నాటి ఈ పోలీస్ స్టేషన్ ఇంతకు ముందు వరకు ఎరుపు, పసుసు రంగులతో ఉండేది. 1939 నాటి ఈ రక్షకభట కార్యాలయం లక్నోలోని కైజర్ బాగ్‌లో ఉంది. ఉత్తర ప్రదేశ్‌లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి రాష్ట్రంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. యోగి కార్యాలయమైన శాస్త్రి భవన్‌ను కాషాయంగా మార్చేశారు.

ఆచరణాత్మక సలహాలు ఇవ్వండి

ఎలక్టోరల్ బాండ్లపై మంత్రి జైట్లీ పిలుపు

న్యూఢిల్లీ : రాజకీయ పార్టీలు తీసుకునే విరాళాల విషయంలో పారదర్శకత తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఎలక్టోరల్ బాండింగ్ విధానం ఎంతో గణనీయమైన మార్పులకు దారితీస్తుందని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత విరాళాల స్వీకరణ విధానం కన్నా ఎలక్టోరల్ బాండింగ్ విధానం ఎంతో మెరుగైనదని అన్నారు. పొలిటికల్ ఫండింగ్ విధానం మరింత పారదర్శకంగా ఉండేందుకు తాము సలహాలు స్వీకరిస్తామని తెలిపారు. ఈ విధానంలో మరింత పారదర్శకత తెచ్చేందుకు సలహాలు ఇచ్చేవారు ఆచరణాత్మక సలహాలు మాత్రమే ఇవ్వాలని ఆయన సూచించారు. ఆదివారం ఫేస్‌బుక్ పోస్టింగ్‌లో జైట్లీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటి వరకు విరాళాలు గానీ ఖర్చులు గానీ అంతా నగదు రూపంలోనే జరిగేదని ఆయన అన్నారు. విరాళాల రూపంలో ఎంత మొత్తం వచ్చేదో, ఎక్కడి నుంచి వచ్చేదో ఎవరికీ తెలిసేది కాదని ఆయన గుర్తుచేశారు. దేశంలో చాలా రాజకీయ పార్టీలకు ఈ విధానం చాలా బాగుందని, ఆ విధానాన్నే యథాతథంగా కొనసాగించాలని కోరుకుంటున్నాయని ఆయన తెలిపారు. కొత్త విధానంలో ఎటువంటి అవకతవకలు జరిగే అవకాశమే లేదని ఆయన అన్నారు. నగదు రూపంలో విరాళాలు ఇవ్వాలో లేదా పారదర్శక విధానాలైన చెక్కులు, ఆన్‌లైన్ లావాదేవీలు, ఎలక్టోరల్ బాండుల ద్వారా విరాళాలు ఇవ్వాలో ఎంచుకునే సమయం వచ్చిందని జైట్లీ ఫేస్‌బుక్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం ఏడు దశాబ్దాలు గడుస్తున్నా ఎలక్షన్ ఫండింగ్ విధానంలో పారదర్శకతను తీసుకురాలేకపోయిందని ఆయన విచారణ వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది అడ్డు అదుపు లేకుండా కోట్లాది రూపాయలను రాజకీయ పార్టీలు ఖర్చు చేస్తున్నాయని, వాటిని నియంత్రించే విధానం ఇప్పటి వరకు లేకపోవడం శోచనీయమని జైట్లీ అన్నారు.

వణుకుతున్న ఉత్తరాది

చండీగఢ్ : గత వారం రోజులుగా పంజాబ్, పర్యానాలో చలి తీవ్రంగా ఉంటోంది. దీనితోడు చలి గాలలు అధికమవడంతో ప్రజలు గజగజలాడుతున్నారు. ఆదివారం అనేక ప్రాంతాల్లో సాధారణ ఉష్ణోగ్రత 2–5 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదైంది. కనిష్ఠంగా 0.7 డిగ్రీల సెల్సియస్‌తో పంజాబ్‌లోని అదమ్‌పూర్ రెండు రాష్ట్రాల్లోనే అతి శీతల ప్రాంతంగా మారినట్లు చండీగఢ్ లోని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. హర్యానా లోని నార్నౌల్ కూడా మంచుతో గడ్డకట్టుకుపోయింది. అక్కడ కనిష్ఠ ఉష్ణోగ్రత 1.5 డిగ్రీలుగా నమోదైంది. అయితే రోహ్‌తక్, హిస్సార్, భివానీ సహా దక్షిణ హర్యానా మినహా, పంజాబ్‌లోని నిర్మానుష్య ప్రాంతాల్లో పొగమంచు క్రమంగా తగ్గుముఖం పట్టినట్లు అధికారులు చెప్పారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు కాస్త పెరిగినప్పటికీ కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోవడంతో ఆకాశం నిర్మలంగా మారిందని, మరో రెండు రోజుల్లో హర్యానా, పంజాబ్‌లోని మిగతా ప్రాంతాల్లో కూడా మంచు తగ్గుముఖం పట్టనుందని వారు చెప్పారు. కాగా, పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో కనిష్ఠంగా 2.6 డిగ్రీల సెల్సియల్ ఉష్ణోగ్రత రికార్డయింది. అదే విధంగా బతిందాలో 2.5, హల్వారలో 3.7, పటాన్‌కోట్‌లో 3.8, గుర్దాస్‌పూర్‌లో 3.8, ఫరిద్‌కోట్‌లో 3.8, లుధియానాలో 4.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చడీగఢ్‌లోనూ 5.8 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. హిస్సార్‌లో సాధారణ స్థాయి కంటే ఒకటి తక్కువగా 2.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.



అలహాబాద్ రైల్వే స్టేషన్‌లో చలికి వణుకుతూ రైలుకోసం ఎదురుచూపులు



చంద్రునిపై నడిచిన ఆస్ట్రోనాట్ కన్నుమూత

హూస్టన్ : చంద్రునిపై నడిచిన అమెరికా ఆస్ట్రోనాట్ జాన్ యంగ్(87) కన్నుమూశారు. ఆరుసార్లు అంతరిక్షంలోకి వెళ్లిన యంగ్ శనివారం మృతి చెందినట్లు నాసా ఒక ప్రకటనలో తెలిపింది. 1972లో చంద్రునిపై ఆయన అడుగుపెట్టారు. ఈ ఘనత సాధించిన 12 మందిలో ఒకరిగా నిలిచాడు. యంగ్ రెండుసార్లు చంద్రునిపైకి వెళ్లాడు. జాన్ యంగ్ మృతి మమ్మల్ని ఎంతగానో బాధించింది అని నాసా ట్వీట్ చేసింది. 1962లో నాసాతో పనిచేయడం మొదలుపెట్టాడు జాన్. యంగ్ మృతికి కారణం మాత్రం తెలియలేదు. అమెరికా అంతరిక్ష పరిశోధనలో విజయవంతమైన ఆస్ట్రోనాట్లలో యంగ్ ఒకరు. 1960ల్లో రెండుసార్లు జెమినిలో, రెండుసార్లు అపోలో లూనార్ మిషన్లలో, 1980ల్లో రెండుసార్లు స్పేస్ షటిల్స్‌లో యంగ్ అంతరిక్షానికి వెళ్లారు. నాసాలో 42 ఏళ్లు పనిచేసిన తర్వాత 2004లో యంగ్ రిటైరయ్యాడు. యంగ్ పలు వివాదాల్లో కూడా ఉన్నారు. తనతోపాటు నాసా కళ్లుగప్పి కక్ష్యలోకి బీఫ్ శాండ్‌విచ్ తీసుకెళ్లడం కలకలం రేపింది. ఇది అప్పట్లో పెద్ద సంచలనానికి కూడా కారణమైంది.

అమెరికాతో స్నేహం కొనసాగుతుంది

కరాచీ: అమెరికాతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగుతాయని పాకిస్థాన్ విదేశాంగ శాఖ కార్యదర్శి తెహ్మీనా జన్‌జ్వా అన్నారు. అమెరికా నుంచి వస్తు న్న ఆరోపణలకు స్పందించాల్సిన బాధ్యత ఉందని పాకిస్థాన్ విదేశీ విధానంపై కరాచీలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఐబిఎ)లో ప్రసంగస్తూ ఆమె వెల్లడించారు. అంతర్జాతీయంగా శక్తిమంతమైన దేశంగానే కాకుండా దక్షిణాసియాలో అమెరికా ప్రభావం ఉందని దీంతో అమెరికాను పొరుగు దేశంగా భావిస్తున్నామని అమెరికాతో స్నేహపూర్వకంగా మెలగాలని అనుకుంటున్నట్లు ఆమె తెలిపారు. జనవరి 1న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, ఆయన అలా అనడానికి గల కారణాలను పాకిస్థాన్ విశ్లేషించే ప్రయత్నంలో ఉందన్నారు. పాకిస్థాన్‌కు భద్రత, రక్షణ విభాగాల్లో సహాయాన్ని నిలిపేస్తూ ట్రంప్ జనవరి 1న ప్రకటించకముందు అగ్రరాజ్యంతో జరిగిన అన్ని సమావేశాలు సానుకూలంగా జరిగిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. గత 15 ఏళ్లలో పాకిస్థాన్‌కు దాదాపు వందల కోట్ల డాలర్ల సాయం చేస్తే పాకిస్థాన్ అమెరికాను మోసం చేసిందని నూతన సంవత్సరం రోజున అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ట్వీట్ చేసిన విషయం తెలిసిందే.

సయీద్‌పై పాకిస్థాన్ చర్యలు



ఇస్లామాబాద్ : అమెరికా దెబ్బకు పాకిస్తాన్ దిగొచ్చింది. ఉగ్రవాద సంస్థ జెయుడి అధినేత, ముంబయి దాడుల సూత్రధారి హాఫీజ్ సయీద్‌కు వ్యతిరేకంగా సంచలన నిర్ణయం తీసుకుం ది. హాఫీజ్ సంస్థలకు బయట ఆర్థిక మూలాలను అడ్డకుంటూ కీలక ప్రకటన చేసింది. పాకిస్తాన్‌లో ఉగ్రవాదంతోపాటు హాఫీజ్ కార్యకలాపాలను అడ్డుకోకపోవడంతో అగ్రరాజ్యం అమెరికా పాకిస్తాన్‌కు నిధులను నిలిపివేసింది. దీంతో దిక్కుతోచని పాక్, హాఫీజ్‌కు చెందిన సంస్థల ఆర్థిక మూలాలకు అడ్డకట్టవేసింది. హాఫీజ్ సయీద్‌కు చెందిన సంస్థలకు విరాళాలిస్తే జైలు శిక్షను ఎదుర్కొవాల్సి ఉంటుందని పాక్ అంతర్గత వ్యవహారాలశాఖ వెల్లడించింది. సయీద్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ జమాత్‌ఉల్‌దవా(జేయూడీ), ఫలాఫ్ ఈఇన్సానియత్ ఫౌండేషన్(ఎఫ్ఐఎఫ్) సంస్థలతో పాటు మొత్తం 72 సంస్థలపై నిషేధం విధిస్తూ బ్లాక్ లిస్ట్‌లోకి చేర్చుతున్నట్లు పాక్ ప్రకటించింది. ఈ సంస్థలకు ఎవరైనా ఆర్థికంగా విరాళాలు అందజేస్తే 10ఏళ్ల జైలు శిక్షతో పాటు, భారీ జరిమానా ఎరుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.

మంత్రి హరీష్‌ను కలిసిన 1998 డిఎస్‌సి అభ్యర్థులు

హైదరాబాద్: తెలంగాణకు చెందిన 1998 డిఎస్‌సిలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆదివారం మంత్రి హరీష్‌రావును కలిశారు. తమకు ఉద్యోగాలు ఇప్పించాలంటూ వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఇదే విషయమై సిఎం కెసిఆర్ ఉద్యోగాలిస్తామని అభ్యర్థులకు హామీ ఇచ్చిన విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికైనా సిఎం తన హామీని నెరవేర్చాలని అభ్యర్థులు కోరారు. దీంతో సమస్యని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు న్యాయం జరిగేలా చూస్తానని మంత్రి హరీష్‌రావు.. అభ్యర్థులకు హామీచ్చిన్నట్లు సమాచారం.

మ్యాన్‌హోల్‌లో పడి ముగ్గురు మృతి

బెంగళూరు : మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేస్తుండగా అందులో పడి ముగ్గురు పారిశుద్ధ్య కార్మికులు మృతి చెందారు. బెంగళూరులోని బండెపాల్యలో ఈ ఘటన జరిగింది. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని అధికారులు తెలిపారు. ఈ ఘటనతో ఆ కార్మికుల కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

విమానాలు అత్యవసర ల్యాండింగ్

హైదరాబాద్ : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం నాలుగు విమానాలు అత్యవసరంగా ల్యాండ్ అయ్యాయి. ఉత్తర భారత్‌లో పొగమంచు అధికంగా ఉండడంతో ఈ అంతర్జాతీయ విమానాలను ఇక్కడ అత్యవసర ల్యాండింగ్ చేశారు. జెడ్డా లక్నో, సౌదీ అరేబియా ఢిల్లీ , దుబాయ్ బంగ్లాదేశ్, సింగపూర్ ఢిల్లీ విమానాలను ఇక్కడ అత్యవసర ల్యాండింగ్ చేసినట్టు విమానాయాన అధికారులు తెలిపారు.

మేడారం జాతరకు 4 వేల బస్సులు

హైదరాబాద్ : ఈనెల 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు మేడారం సమ్మక్క సారలమ్మ జాతర జరగనుంది. ఈ జాతర కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. జాతర సందర్భంగా నాలుగు వేల బస్సులు నడపాలని టిఎస్ ఆర్‌టిసి నిర్ణయించింది. తెలంగాణలోని 50 కేంద్రాల నుంచి ప్రత్యేక బస్సులునడపాలని నిర్ణయించినట్ట ఆర్‌టిసి అధికారులు తెలిపారు. జాతర సందర్భంగా 10 లక్షల నుంచి 12 లక్షల మంది ఆర్‌టిసి సేవలను వినియోగించుకునే అవకాశం ఉంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మేడారంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ జాతరకు ప్రజలు భారీ ఎత్తున తరలిరానున్నారు.

పోలవరం కోసం మహాపాదయాత్ర



అమరావతి : పోలవరం కోసం మహాపాదయాత్ర పేరిట కాంగ్రెస్ పార్టీ ధవళేశ్వరం కాటన్ విగ్రహం నుంచి పోలవరం ప్రాజెక్టు వరకు చేపట్టిన పాదయాత్ర ఆదివారం ప్రారంభమైంది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పాండిచ్చేరి ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ గత కాంగ్రెస్ సీఎం అంజయ్య ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రణాళికలు రచిస్తే.. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇందిరా పోలవరం సాగర్‌గా నామకరణం చేసి ప్రాజెక్టు పనులను వేగవంతం చేశారన్నారు. వైఎస్ సీఎంగా ఉన్న సమయంలో సుమారు రూ.5,200 కోట్లతో కుడి, ఎడమ కాల్వల నిర్మాణాలు పూర్తి చేస్తే.. నేటి ముఖ్యమంత్రి అంతా తన ఘనతే అని చాటుకోవడం హాస్యాస్పదం అన్నారు. ఈ మూడేళ్లలో ఏ మేరకు అభివృద్ధి సాధించారంటూ ప్రశ్నించారు. 2019లో తాము తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టును తామే ప్రారంభిస్తామన్నారు. పిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలోనే జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి కేంద్రం నిర్మించాల్సి ఉంటే రాష్ట్ర ప్రభుత్వం నిర్మించాల్సిన అవసరం ఏముందన్నారు. పోలవరం కాంగ్రెస్‌కు మానసపుత్రిక అని, నాణ్యతతో కూడిన పనులతో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే వరకు పోరాడతాం అన్నారు.





అమెరికాను మంచు దుప్పటి వదలిపెట్టడం లేదు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో జనజీవనం స్తంభించిపోతోంది. రవాణాకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఉద్యోగులు ఇంటికే పరిమితం కావాల్సి వస్తోంది. ఇంటి చుట్టుపక్కల పేరుకుపోయిన మంచు దిబ్బలను తొలగించడానికి సమయం వెచ్చిస్తున్నారు. న్యూజెర్సీ తదితర ప్రాంతాల్లో పరిస్థితి దయనీయంగా ఉంది.

కిమ్‌తో మాట్లాడుతా



వాషింగ్టన్: ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్‌తో ఫోన్లో మాట్లాడతానని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ అన్నారు. ఉ.కొరియా వరుస క్షిపణి ప్రయోగాల నేపథ్యంలో కొద్ది రోజులుగా ట్రంప్, కిమ్ మధ్య మాట ల యుద్ధం జరుగుతున్న సంగతి తెలిసిందే. ట్రంప్ శనివారం మేరీల్యాండ్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిమ్ తో మాట్లాడుతారా? అని మీడియా అడిగిన ప్రశ్నకు తప్పకుండా మాట్లాడుతా అని సమాధానమిచ్చారు. 'నాకు ఆయనతో మాట్లాడటంలో ఎలాం టి అభ్యంతరం లేదు. కాకపోతే అందుకు కొన్ని షరతులు ఉంటాయి. వింటర్ ఒలింపిక్స్ నేపథ్యంలో ద.కొరియా, ఉ.కొరియా మధ్య చర్చలు జరగబోతున్నాయి. ఇది నిజంగా చాలా గొప్పవిషయం.నేను కలగజేసుకోపో యి ఉంటే ఆ ఇరు దేశాల మధ్య ఎప్పటికీ చర్చలు జరిగేవి కావు. చర్చలు ఫలిస్తే ప్రపంచానికే అది శుభవార్త' అని వ్యాఖ్యానించారు. ఉ.కొరియా, దక్షిణ కొరియా ప్రతినిధులు రెండేళ్ల అనంతరం మొదటిసారిగాఈ నెల 9న సమావేశం కానున్నారు. చర్చల కోసం సియోల్ పంపిన అభ్యర్థనకు ప్యాం గ్యాంగ్ అంగీకారం తెలపడంతో ఈసమావేశాలకు మార్గం సుగమమైంది. అమెరికా, ద.కొరియా నిర్వహించే సంయుక్తం సైనిక విన్యాసాలు వాయిదా పడిన కొన్ని గంటల్లోనే ఈ సమావేశం ఖరారు కావడం గమనార్హం.

పాక్‌ను చైనా ఒప్పించాలి – అమెరికా : తమ దేశంలో ఉన్న ఉగ్రవాద సురక్షిత స్థావరాలను ధ్వం సం చేసేలా పాకిస్థాన్‌ను చైనా ఒప్పిస్తుందని అమెరికా ఆశాభావం వ్యక్తం చేసింది. ఆదివారం వైట్ హౌజ్ సీనియర్ అధికారి ఒకరు మీడియాతో మాట్లాడారు. ఉగ్రవాద సురక్షిత స్థావరాలను ధ్వంసం చేస్తే , అఫ్ఘనిస్థాన్‌తోపాటుఈప్రాంతంలో సుస్థిరత నెలకొంటుందని తెలిపారు. పాక్‌తో చైనాకు చారిత్రక సంబంధాలు ఉన్నాయని, అనేక ఏళ్లుగా ఇరు దేశాల మధ్యసైనిక సన్నిహిత సంబంధాలు ఉన్నాయ న్నారు. వారి మధ్య ఆర్థిక సంబంధాలు బలోపేతమయ్యాయని, చైనా, పాక్ ఎకనామిక్ కారిడర్‌ను(సిపిఇసి) ఏర్పాటు చేసుకున్నాయన్నారు. ఉగ్రవాద సమస్యపై అమెరికా ఆందోళనను చైనా అర్థం చేసుకొ గలదని పేర్కొ న్నారు. ఈ సమస్యను ప్రాంతీయంగా ఎదుర్కొనేందుకు ఇతర దేశాలతో కలిసి పని చేస్తామని, సమస్య పరిష్కారంలో చైనా కీలక పాత్ర పోషిం చాలన్నారు అఫ్ఘన్, పాక్‌ల మధ్య సత్సంబంధాలు ఏర్పడటంలో చైనా కీలక పాత్ర పోషించిందని తెలిపారు. పాక్‌లో ఉగ్రస్థావరాలు ఉన్నంత వరకు చైనా ప్రయోజనాలు నెరవేరబోవన్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేయడం చైనాకు కూడా అవసరమని పేర్కొన్నారు. తాలిబన్లు, హక్కానీ నెట్‌వర్క్, ఉగ్రవాద కీలక స్థావరాలను ధ్వంసం చేయడంలో పాక్ విఫలమైందన్నారు.

ఇంధన పొదుపులో అగ్రభాగాన ఎస్‌సిఆర్

● మార్చి నాటికి ఎల్ఇడి వెలుగులు ఫుల్ ● ఏటా రూ.135 కోట్ల ఇంధన బిల్లుల ఆదా



మన తెలంగాణ / హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే (ఎస్సిఆర్) ఇంధన వనరుల పొదుపు చర్యలను మరింత వేగవంతం చేసింది. ఇంధన పొదుపులో విద్యుత్ మంత్రిత్వ శాఖ ద్వారా 2017 సంవత్సరానికి గాను రెండు జాతీయ అవార్డులను సాధించిన ఎస్‌సిఆర్ విద్యుత్ పొదుపుపై ప్రత్యేక దృష్టి సారించింది. విద్యుత్ పొదుపు చర్యల్లో భాగంగా జోన్ పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లు, కార్యాలయాలు, లోకో షెడ్లలో మార్చి నాటికి ఎల్ఇడి లైట్ల ఏర్పాటును వంద శాతం పూర్తి చేయాలని లక్ష్యంగా ఎస్‌సిఆర్ నిర్ణయించింది. ఇప్పటికే దాదాపు 157 ఎ1 స్టేషన్లలో ఎల్ఇడి లైటను ఏర్పాటు చేశారు. హైదరాబాద్, కాచిగూడ, నిజామాబాద్, బెల్లంపల్లి స్టేషన్లతో పాటు 21 ఎంఎంటిఎస్ స్టేషన్లలో ఎల్ఇడి లైట్లను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశారు. ఫలక్‌నుమా, లింగంపల్లి, సికింద్రాబాద్, హైదరాబాద్ రూట్లలో ఎల్ఇడిల ఏర్పాటు పూర్తయింది. ఇప్పటివరకు 795 రైల్వే క్రాసింగ్‌లలో ఎల్ఇడి లైటింగ్స్ ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్ల పరిసర ప్రాంతాలు, రైల్వే కాలనీలు తదితర ప్రాంతాల్లో 280 వీధి లైట్లను ఏర్పాటు చేశారు. ఎల్ఇడి లైట్లు, బ్రష్ లెస్ డిసి ఎలక్ట్రిక్ మోటార్ ఎనర్జీ సేవింగ్ ఫ్యాన్లు, ఇన్వర్టర్ ఏసి తదితర ఇంధన పొదుపు పరికరాలను స్టేషన్లలో ఏర్పాటు చేసి జోన్‌లన్నింటికి ఆదర్శంగా నిలిచింది. సౌర, పవన, డే లైట్ పైప్ టెక్నాలజీ ద్వారా ఇంధన ఉత్పత్తి చేస్తూ సంప్రదాయ ఇంధన వనరులను ఆదా చేసి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతోంది. ఇప్పటికే రైల్వేలోని జోన్ ప్రధాన కార్యాలయాలలో సంపూర్ణ ఎల్ఇడి లైట్లు గల జోనల్ కార్యాలయంగా ఎస్‌సిఆర్ ప్రధాన కార్యాలయం రైల్ నిలయానికి ప్రథమ స్థానం దక్కింది. మరో వైపు ఇంధన పరిరక్షణలో ఎస్‌సిఆర్ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. మొత్తం 3048 సంప్రదాయ లైట్ల స్థానంలో ఇంధన సామర్థంతో కూడిన ఎల్ఇడి లైట్లను అమర్చడం ద్వారా ఎస్‌సిఆర్ ఈ ఘనతను సాధించింది. గతంలో సంప్రదాయ లైట్ల కోసం 112.25 కిలో వాట్ల విద్యుత్‌ను ఉపయోగించగా ఎల్ఇడి లైట్ల అమరికతో విద్యుత్ వినియోగం 65.8 కిలోవాట్లకు తగ్గింది.రైల్ నిలయంలో ఎల్ఇడి వినియోగంతో ఏటా రూ.1.33లక్షలు ఆదా కావడంతో పాటు రూ.10.64 లక్షల ఖర్చు తగ్గుతుంది.పునరుత్పాదక ఇంధన వనరులు, స్టార్ కేటగిరి గల విద్యుత్ పరికరాలు, ఎల్ఇడి ఉత్పత్తులను స్టేషన్లు, కార్యాలయాల్లో ఉపయోగించడంలో దృష్టి సారిస్తోంది. తద్వారా ఇప్పటివరకు జోన్ ఇంధనవినియోగంలో 2.2 శాతం తగ్గుదలసాధించింది.ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఎలక్ట్రిక్ ట్రాక్షన్, ట్రాక్షనేతర అవసరాలకు వివిధ కొత్త పద్ధతులను అవలంబించి ఇంధన పొదుపు పాటించాలని ఎస్‌సిఆర్ యోచిస్తున్నది.

ట్రాక్షన్, నాన్ ట్రాక్షన్‌పై దృష్టి : ట్రాక్షన్, నాన్ ట్రాక్షన్, డీజిల్ ఇంజన్ల నిర్వహణలో ఇంధన పొదుపుపై కూడా ఎస్‌సిఆర్ దృష్టి సారించింది. ఇంధన పొదుపు చర్యల ద్వారా ఎస్‌సిఆర్ ఏటా రూ.135 కోట్లను ఆదా చేస్తోంది. నాన్ ట్రాక్షన్ (స్టేషన్లు, కార్యాలయాల భవనాలు) విభాగంలో 2016 – 17లో మొత్తం రూ.2.45 కోట్ల విలువైన 30.46 లక్షల యూనిట్ల విద్యుత్‌ను, ఎలక్ట్రిక్ ట్రాక్షన్‌లో రూ.42.89 కోట్ల విలువైన 838.52 లక్షల యూనిట్ల విద్యుత్ పొదుపు చేసింది.ఈచర్యలను మరింత ముమ్మరం చేయాలని ఎస్‌సిఆర్ నిర్ణయించింది.2016–17లో ఎలక్ట్రిక్ ట్రాక్షన్ కోసం రూ. 1027 కోట్లు, డీజిల్ ఇంధనం కోసం రూ.1725కోట్లు,నాన్ ట్రాక్షన్ ఇంధనం కోసం రూ.107 కోట్లు ఖర్చు చేసింది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో సుమారు 687 కెవి సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసింది. ఒక్క సికింద్రాబాద్ స్టేషన్‌లోనే 500 కెవి సోలార్ గ్రిడ్‌ను ఏర్పాటు చేయడం గమనార్హం. వీటి ద్వారా 115 రైల్వే స్టేషన్లకు సోలార్ విద్యుత్‌ను అందిస్తుంది.

సముద్రంలో ప్రమాదం

● ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న కార్గో నౌక ● 32 మంది సిబ్బంది గల్లంతు




బీజింగ్ : చైనా తూర్పుతీరంలో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. కార్గో షిప్పును ఆయిల్ ట్యాం కర్ ఢీ కొట్టింది. దీంతో రెండు నౌకలు ధ్వంసమయ్యాయి. భారీగా మంటలు చెలరేగాయి. ఆకాశమంతా పొగలు కమ్ముకున్నాయి. శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం సంభవించింది. ఆదివారం ఉదయం వరకు మంటలు చెలరేగుతూనే ఉన్నాయి. ఇరాన్ షిప్పింగ్ కంపెనీకి చెందిన సాంచీ అనే ట్యాంకర్ 1,36,000 టన్నుల ఆయిల్‌తో దక్షిణ కొరియా వైపు ప్రయాణిం చేస్తోంది. చైనా తూర్పు తీరం వద్ద.. కార్గో షిప్పును ఢీకొంది. దీంతో ఆయిల్ ట్యాంకర్ ధ్వంసమయింది. తీవ్రంగా మంటలు వ్యాపించాయి. 32 మంది ఆయిల్ ట్యాంకర్ సిబ్బంది గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో 30 మంది ఇరానియన్లు కాగా ఇద్దరు బంగ్లాదేశీయులు ఉన్నారని చైనా రవాణా మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన ద్వారా తెలిపింది. సముద్ర పై భాగం అంతా ఆయిల్‌తో నిండిపోయిందని, ఎంత మేరకు కలుషితం జరిగిందో తెలియాల్సి ఉందని మంత్రిత్వ శాఖ తెలిపింది. గల్లంతైన సిబ్బంది కోసం వేట కొనసాగుతోందని రవాణా శాఖ అధికారులు తెలిపారు. ఎనిమిది షిప్పులు సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయి.ఈ ప్రమాదంలో కార్గో షిప్పు సిఎఫ్ క్రిస్టల్ కూడా పాక్షికంగా ధ్వంసమయింది. చైనీస్ కంపెనీకి చెందిన ఈ కార్గో షిప్పు అమెరికా నుంచి గోంగ్‌డాంగ్‌కు ప్రయాణమౌతోంది.



ఎన్ఆర్ఐల వల్లే ఆసియాన్‌తో పటిష్ట సంబంధాలు : సుష్మ

సింగపూర్: ఆసియాన్ దేశాలతో భారత్ సంబంధాలు బలోపేతానికి ప్రవాస భారతీయ వేదిక కీలక పాత్ర పోషిస్తోందనివిదేశాంగ శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ తెలిపారు. ఆదివారం ప్రవాస భారతీయ దినోత్సవంలో ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆసియాన్ పట్ల భారత్ నిబద్ధతను ఆమె పునరుద్ఘాటించారు. ఆసియాన్‌తో భాగస్వామ్యానికి 25 ఏళ్లు పూర్తి అయిందన్నారు. ఆసియాన్‌తోభారత్ వ్యూహాత్మక భాగస్వామ్యం కలిగి ఉందని విదేశాంగ మంత్రి తెలిపారు. ఆసియాన్‌లో భాగస్వామ్యదేశాలన్నింటికీ అంతర్జాతీయ నియమ, నిబంధనలు తెలుసని భావిస్తున్నామని, సార్వభౌమ సమానత్వం, పరస్పర గౌరవంతో దేశాలు సురక్షితంగా, ఆర్థిక వ్యవస్థలు అభివృద్ధి చెందుతాయని సుష్మ పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందితే, వాణిజ్యం, పెట్టుబడులు పెరుగుతాయన్నారు. భారత్ యాక్ట్ ఈస్టు పాలసీలో ఆసియాన్ భాగస్వామిగా ఉందన్న విషయాన్ని ఆమె నొక్కి చెప్పారు. సమావేశంలో పాల్గొన్న అసోం ముఖ్యమంత్రి సర్బానంద సోనోవాల్‌ను ప్రస్తావిస్తూ అగ్నేయాసియా దేశాలకు ఈశాన్య రాష్ట్రాలు వంతెనగా నిలుస్తాయన్నారు.

ఉత్సాహంగా అమరావతి మారథాన్




అమరావతి: విజయవాడలో ఆదివారం ఉదయం నిర్వహించిన అమరావతి మారథాన్‌లో వేలాది మంది ఔత్సాహికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, కలెక్టర్ లక్ష్మీ కాంతం, నగర మున్సిపల్ కమిషనర్, పోలీసు కమిషనర్ గౌతం సవాంగ్ ఈ పరుగును ప్రారంభించారు. హాఫ్ మారథాన్, 5కే రన్, 10కే రన్ విభాగాల్లో పరుగు నిర్వహించారు. ఇందిరా గాంధీ స్టేడియం నుంచి ఉండవల్లిలోని మంతెన ఆశ్రమం వరకు పరుగు సాగింది. నగరవాసుల్లో ఆనందం, ఆరోగ్యం పెంపొందించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి ఉమా తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం సంతోషంగా ఉందని కలెక్టర్, కమిషనర్ తెలిపారు. అమరావతి మారథాన్‌లో సినీ తారలు గౌరి ముంజల్, శాన్వి శ్రీవాస్తవ పాల్గొని సందడి చేశారు. ఇక్కడి ప్రజల ఉత్సాహం చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు.

2019 నాటికి 3లక్షల ఉద్యోగాలు

ఏపి మంత్రి నారా లోకేశ్

రాజమహేంద్రవరం: రాష్ట్రంలో ఐటీ, తయారీ రంగాల ద్వారా 2019 నాటికి 3 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తున్నామని ఏపి పంచాయితీ రాజ్, ఐటీ శాఖ మంత్రి లోకేష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో ఉన్న ఆయన పెద్దాపురంలోని ఏపిఐఐసి పారిశ్రామిక వాడలో 250 కోట్లతో నూతనంగా ఏర్పాటుచేసిన అపర్ణ వెటిరో సిరామిక్స్ పరిశ్రమను ప్రారంభించి ప్రసంగించారు. అనంతరం పెద్దాపురం మండలం వాలుతిమ్మాపురంలో నూతనంగా నిర్మిస్తున్న పేదల గృహ సముదాయాలను మంత్రి పరిశీలించారు. లోకేష్ పర్యటనలో హోంమంత్రి చినరాజప్ప, ఎంపీ తోట నరసింహం, కలెక్టర్ కార్తికేయ మిశ్రా, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థుల మృతి



దెందులూరు: పశ్చిమగోదావరి జిల్లా పెదపాడు మండలంలో విషాదం చోటుచేసుకుంది. ఏలూరు రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు వట్లూరులో చెరువులో పడి మృతిచెందారు. శనివారం వీరు నలుగురు చెరువుకు సమీపంలోని జామతోటలో కొంత సమయం గడిపిన తర్వాత స్నానాల కోసం చెరువులోకి దిగినట్లు పోలీసులు, స్థానికులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో చింతలపూడికి చెందిన గుమ్మి విజయశంకర్(22), అంకాల సాయికిరణ్ పరశురాం(22), కలిదిండి హరికృష్ణ రాజు(22), కోట సాయి(21) మృతిచెందారు. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం పోలీసులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మన తెలంగాణ
12
హైదరాబాద్
సోమవారం
8, జనవరి 2018
www.manatelangana.news

రోడ్డు ప్రమాదంలో నలుగురు అథ్లెట్లు మృతి



న్యూఢిల్లీ: చండీగఢ్–ఢిల్లీ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు మృతి చెందారు. మరోవైపు ప్రపంచ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ సాక్షమ్ యాదవ్‌తో మరో అథ్లెట్ తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి ఆందో ళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. స్విఫ్ట్ డిజైర్ కారులో హైవేపై వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. వీరు ప్రయాణిస్తున్న కారు డివైడర్ ఢీకొట్టిన అనంతరం పల్టీలు కొట్టి కరెంట్ స్థంభాన్ని ఢీకొట్టింది. ప్రమాద సమయంలో కారులో ఆరుగురు ఉన్నారు. వారిలో నలుగురు సంఘటన స్థలంలోనే ప్రాణాలు విడిచారు. ప్రపంచ చాంపియన్ సాక్షమ్‌తో పాటు మరో పవర్ లిఫ్టర్ తీవ్రంగా గాయపడ్డాడు. కారును అతి వేగంగా నడపడం వల్లే ప్రమాదం సంభవించిందని పోలీ సులు తెలిపారు. చనిపోయిన వారిలో పవర్ లిఫ్టర్లు హరీశ్, టింకు, సూరజ్‌లు ఉన్నారు. మరో వ్యక్తి పేరు తెలియరాలేదు. కాగా, సాక్షమ్ కిందటి ఏడాది రష్యాలో జరిగిన ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణ పతకం గెలుచుకొని చరిత్ర సృష్టించాడు. కాగా, గాయపడిన ఇద్దరిని ఢిల్లీలోని షామి మార్ మ్యాక్స్ ఆసుపత్రికి తరలించారు.

హెచ్‌సిఎ సమావేశంలో రసాభాస

అజార్‌కు అనుమతి నిరాకరణ.. వివేక్‌తో విహెచ్ వాగ్వాదం



మన తెలంగాణ/ హైదరాబాద్: ఆదివారం జరిగిన హైదరాబాద్ క్రికెట్ సంఘం ప్రత్యేక సాధారణ సమావేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టీమిండియా మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్‌ను సమావేశంలో పాల్గొనేం దుకు హెచ్‌సిఎ అధ్యక్షుడు వివేక్ అనుమతించలేదు. అజారుద్దీన్‌పై ప్రధాన గేట్ వద్దే ఆపివేశారు. అతన్ని సమావేశానికి అనుమతించే ప్రసక్తే లేదని వివేక్ తేల్చి చెప్పారు. దీంతో సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నేత ఒక్కసారిగా ఆగ్రహంతో ఊగిపోయారు. హెచ్‌సిఎ అధ్యక్షుడి తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతేగాక సహనం కోల్పోయిన విహెచ్ మైక్‌ను నేలకేసి కొట్టారు. ఇదేమైనా టిఆర్‌ఎస్ పార్టీ మీటింగ్ అనుకుంటు న్నారా అంటూ అధ్యక్షుడిపై చిందులు వేశారు. అజారుద్దీన్‌ను సమావేశా నికి రాకుండా అడ్డుకునే హక్కు మీకెవరూ ఇచ్చారని విహెచ్ ప్రశ్నించారు. హెచ్‌సిఏలో అరాచకం రాజ్యమేలుతోందని, అధ్యక్షుడు అన్ని నిబంధనలు తుంగలో తొక్కి నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. కాగా, తనను సమావేశంలో పాల్గొనకుండా గేటు బయటే నిలిపి వేసిన హెచ్‌సిఏ అధ్యక్షుడిపై అజారుద్దీన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు జరి గిన అవమానంపై న్యాయ పోరాటం చేస్తానని హెచ్చరించారు. టీమిండి యాకు సుదీర్ఘకాలంపాటు సేవలు చేసిన తనను ఇలా గేటు బయట ఆపేసి అవమానించడం హెచిసిఏకు తగదని అజారుద్దీన్ అన్నారు. కాగా, అజారు ద్దీన్‌కు హెచ్‌సిఏ మాజీ అధ్యక్షుడు శివలాల్ యాదవ్, టీమిండియా మాజీ క్రికెటర్ వెంకటపతి రాజు తదితరులు మద్దతుగా నిలిచారు. కాగా, హెచ్ సిఏ అధ్యక్షుడి తీరుపై శివలాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కమిటీని రద్దు చేసి తాజాగా ఎన్నికలు జరపాలని ఆయన బిసిసిఐను డిమాండ్ చేశారు. హెచ్‌సిఏ అధ్యక్షుడు తన ఇష్టానుసారం వ్యవహరిస్తూ ఇతర సభ్యు లను చులకన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మరోవైపు ఈ సమావే శంలో తీసుకున్న నిర్ణయాలకు అనుమతి ఇవ్వకూడదని శివలాల్ బిసిసిఐ పాలక మండలికి విజ్ఞప్తి చేశారు.

నిక్‌కు బ్రిస్బేన్ టైటిల్

బ్రిస్బేన్: ప్రతిష్ఠాత్మకమైన బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో మూడో సీడ్ నిక్ కిర్గియాస్ (ఆస్ట్రేలియా) టైటిల్ గెలుచుకున్నాడు. ఆది వారం ఏకపక్షంగా సాగిన ఫైనల్లో నిక్ 6–4, 6–2 తేడాతో అమెరికా ఆట గాడు రియాన్ హారిసన్‌ను ఓడించాడు. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన నిక్ పైచేయి సాధించాడు. ప్రత్యర్థిపై ఏస్‌ల వర్షం కురిపించాడు. నిక్ వరుసగా ఏస్‌లను సంధించడంతో హారిసన్ వద్ద సమాధానం లేకుండా పోయింది. ఈ క్రమంలో నిక్ ఏకంగా 18 ఏస్‌లతో చెలరేగి పోయాడు. తొలి సెట్‌లో హారిసన్ నుంచి కొద్ది ప్రతిఘటన ఎదురైనా చివరి వరకు ఆధి క్యాన్ని కాపాడుకుంటూ నిక్ ముందుకు సాగాడు. ఇదే క్రమంలో సెట్‌ను సొంతం చేసుకున్నాడు. ఇక, రెండో సెట్‌లో నిక్‌కు ఎదురేలేకుండా పోయింది. సొంత అభిమానుల మద్దతుతో నిక్ మరింత చెలరేగి పోయాడు. అద్భుత షాట్లతో హారిసన్‌ను ముప్పుతిప్పలు పెడుతూ టైటిల్‌ను దక్కించుకు న్నాడు. నిక్‌కు ఇదే తొలి ఎటిపి టైటిల్ కావడం విశేషం.





మూడో రోజు వర్షార్పణం

భారీ వర్షంతో ఆట రద్దు, పెవిలియన్‌కే పరిమితమైన క్రికెటర్లు
భారత్–దక్షిణాఫ్రికా టెస్టు సమరం

కేప్‌టౌన్: భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టుకు వర్షం అడ్డంకిగా మారింది. ఆదివారం మూడో రోజు భారీ వర్షం వల్ల ఒక్క బంతి కూడా పడకుం డానే ఆట రద్దయ్యింది. దీంతో రెండు జట్లు నిరాశలో కూరు కుపోయాయి. బౌలర్లు ఆధిపత్యం చెలాయిస్తున్న ఈ మ్యాచ్‌లో మూడో రోజు ఆట ఇరు జట్లకు కీలకమని విశ్లేష కులు భావించారు. అయితే ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. మధ్యలో కాస్త నెమ్మదిం చినా మళ్లీ జోరందుకుంది. దీతో భోజన విరామం సమయం వరకు ఆట ప్రారంభం కాలేదు. అయితే ఈ సమ యంలో వర్షం తగ్గుముఖం పట్టడంతో లంచ్ తర్వాత ఆట జరుగుతుందని అందరు భావించారు. అయితే మళ్లీ వరు ణుడు తన ప్రతాపాన్ని చూపాడు. దీంతో అప్పటి వరకు పిచ్‌ను మ్యాచ్‌కు అనుకూలంగా మార్చిన స్టేడియం సిబ్బంది శ్రమ వృథాగా మారింది. టి–విరామం వరకు వర్షం పడుతూనే ఉంది. దీంతో చేసేది లేక అంపైర్లు మూడో రోజు ఆటను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. తొలి రోజు సౌతాఫ్రికా 286 పరుగులకు ఆలౌటైంది. తర్వాత బ్యాటింగ్ చేపట్టిన టీమిండియా ఆట ముగిసే సమయానికి మూడు వికెట్ల నష్టానికి 28 పరుగులు చేసింది. శనివారం రెండో రోజు భారత్ 209 పరుగులకు ఆలౌటైంది. 92 పరు గులకే ఏడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో చిక్కుకున్న భారత్‌ను హార్దిక్ పాండ్య (93) అసాధారణ బ్యాటింగ్‌తో ఆదుకున్నాడు. అతనికి భువనేశ్వర్ అండగా నిలిచాడు. దీంతో టీమిండియా మొదటి ఇన్నింగ్స్‌లో 209 పరుగు లకు ఆలౌటైంది. తర్వాత రెండో ఇన్నింగ్స్ చేపట్టిన ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు రెండు వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. ఇప్పటి వరకు సౌతాఫ్రికాకు 142 పరుగుల ఆధిక్యం లభించింది.

సర్వత్రా ఆసక్తి...

మూడో రోజు ఆట వర్షార్పణం కావడంతో సోమవారం నాలుగో రోజు ఆటపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. బౌలర్లు హవా సాగిస్తున్న ఈ మ్యాచ్‌లో స్వల్ప లక్ష్యాన్ని సైతం ఛేదిం చడం కష్టమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఇప్పటికే 142 పరుగుల ఆధిక్యాన్ని సాధించిన సౌతాఫ్రికా మరో 150 పరుగులు చేస్తే మాత్రం భారత్‌కు కష్టాలు ఖాయమని వారు విశ్లేషిస్తున్నారు. బౌలర్లకు సహకరిస్తున్న పిచ్‌పై చివరి రెండు రోజులు బ్యాటింగ్ చేయడం అనుకు న్నంత తేలికకాదు. ఒకవేళ నాలుగో రోజు దక్షిణాఫ్రికాకు తక్కువ స్కోరుకే పరిమితం చేస్తే మాత్రం భారత్ గెలుపు అవకాశాలు మెరుగవుతాయి. దీంతో ఇప్పుడు జట్టు ఆశ లన్నీ బౌలర్లపైనే నిలిచాయి. రెండో ఇన్నింగ్స్‌లో హార్దిక్ పాండ్య సత్తా చాటాడు. రెండు వికెట్లతో దక్షిణాఫ్రికాను ఆత్మరక్షణలో పడేశాడు. నాలుగో రోజు ప్రారంభంలోనే కీలక వికెట్లు తీస్తే దక్షిణాఫ్రికాను తక్కువ స్కోరుకే కట్టడి చేయడం భారత్‌కు కష్టమేమి కాదని చెప్పాలి. ఈ పరిస్థి తుల్లో బౌలర్లు అసాధారణ రీతిలో రాణించాల్సి ఉంది. భువ నేశ్వర్, షమి, బుమ్రా, అశ్విన్‌లతో కూడిన బౌలింగ్ లైనప్ తమ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిస్తే సఫారీలకు ఇబ్బం దులు ఖాయం.

స్టెయిన్‌కు గాయం..

మరోవైపు సౌతాఫ్రికాకు కోలుకోలేని షాక్ తగిలింది. వారి ప్రధాన బౌలర్ డేల్ స్టెయిన్ గాయం బారిన పడ్డాడు. దీంతో అతను మ్యాచ్‌లో మళ్లీ బౌలింగ్ చేసే అవకాశాలు లేకుండా పోయాయి. అతనికి నిర్వహించిన వైద్య పరీక్షల్లో గాయం తీవ్రమైందని తేలింది. అతను కనీసం నాలుగు వారాల పాటు క్రికెట్‌కు దూరంగ ఉండాలని వైద్యులు సూచిం చారు. ఈ పరిస్థితుల్లో సిరీస్ మొత్తానికి అతను అందుబా టులో లేకుండా పోయాడు. ఇక, మొదటి టెస్టులో అతను బ్యాటింగ్ చేసే అవకాశాలు మాత్రం ఉన్నాయి. కానీ, బౌలింగ్‌కు దిగే ఛాన్స్ లేకుండా పోయింది. స్టెయిన్ దూరం కావడం సౌతాఫ్రికా పెద్ద ఎదురుదెబ్బేనని విశ్లేషకులు అంటున్నారు. అతను దూరం కావడంతో బౌలింగ్ లైనప్ బలహీనంగా మారడం ఖాయమని వారంటున్నారు. ఒక వేళ సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో తక్కువ స్కోరుకే ఆలౌటైతే జట్టుకు కష్టాలు ఖాయమని జోస్యం చెబుతున్నారు.

అభిమానుల సందడి..

ఒక వర్షం పడుతున్నా అభిమానులు మాత్రం ఆట ప్రారంభం అవుతుందని ఎంతో ఆశతో ఎదురు చూశారు. తమ అభిమాన క్రికెటర్ల ఆటను చూసేందుకు భారత అభిమానులు పెద్ద సంఖ్యలో స్టేడియానికి తరలివచ్చారు. ఆదివారం సెలవు కావడంతో మ్యాచ్‌ను చూసేందుకు క్రికెట్ ప్రేమి-కులు భారీగా వచ్చారు. దీంతో న్యూలాండ్స్ స్టేడియంలో సందడి వాతావరణం కనిపించింది. భారత జాతీయ జెండాను చేతబూని వారు సందడి చేశారు. అయితే వర్షం వల్ల ఒక్క బంతి పడకుండానే మూడో రోజు ఆట రద్దు కావడంతో నిరాశతో ఇంటిదారి పట్టారు.



స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్: డీన్ ఎల్గర్ (సి) సాహా (బి) భువనేశ్వర్ కుమార్ 0, మార్ క్రామ్ ఎల్బీ(బి) భువనేశ్వర్ 5, హాషిం ఆమ్లా (సి) సాహా (బి) భువనేశ్వర్ 3, ఎబి.డివిలి యర్స్ (బి) జస్‌ప్రిత్ బుమ్రా 65, డుప్లెసిస్ (సి) సాహా (బి) హార్దిక్ పాండ్య 62, డికాక్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 43, ఫిలాండర్ (బి) షమి 23, కేశవ్ మహారాజ్ రనౌట్ 35, రబడా (సి) సాహా (బి) అశ్విన్ 26, డేల్ స్టెయిన్ నాటౌట్ 16, మోర్నె మోర్కెల్ ఎల్బి (బి) అశ్విన్ 2, ఎక్స్‌ట్రాలు 6, మొత్తం 73.1 ఓవర్లలో 286 ఆలౌట్.

బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 19–4–87–4, షమి 16–6–47–1, జస్‌ప్రిత్ బుమ్రా 19–173–1, హార్దిక్ పాండ్య 12–1–53–1, రవిచంద్రన్ అశ్విన్ 7.1–1–21–2.

భారత్ మొదటి ఇన్నింగ్స్: మురళీ విజయ్ (సి) ఎల్గర్ (బి) ఫిలాండర్ 1, శిఖర్ ధావన్ (సి) అండ్ (బి) స్టెయిన్ 16, చటేశ్వర్ పుజారా (సి) డుప్లెసిస్ (బి) ఫిలాండర్ 26, విరాట్ కోహ్లి (సి) డికాక్ (బి) మోర్కెల్ 5, రోహిత్ శర్మ ఎల్బీ (బి) రబడా 11, రవిచం ద్రన్ అశ్విన్ (సి) డికాక్ (బి) ఫిలాండర్ 12, హార్దిక్ పాండ్య (సి) డికాక్ (బి) రబడా 93, వృద్ధిమాన్ సాహా ఎల్బీ (బి) స్టెయిన్ 0, భువ నేశ్వర్ కుమార్ (సి) డికాక్ (బి) మోర్నె మోర్కెల్ 25, మహ్మద్ షమి నాటౌట్ 4, జస్ ప్రిత్ బుమ్రా (సి) ఎల్గర్ (బి) రబడా 2, ఎక్స్ ట్రాలు 14, మొత్తం 73.4 ఓవర్లలో 209 ఆలౌట్.

బౌలింగ్: ఫిలాండర్ 14.3–8–33–3, స్టెయిన్ 17.3–6–51–2, మోర్కెల్ 19–6–57–2, రబడా 16.4–4–34–3, కేశవ్ మహా రాజ్ 6–0–20–0.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్‌క్రామ్ (సి) భువనేశ్వర్ (బి) హార్దిక్ పాండ్య 34, డీన్ ఎల్గర్ (సి) సాహా (బి) హార్దిక్ పాండ్య 25, రబడా (బ్యాటింగ్) 2, హాషిం ఆమ్లా (బ్యా టింగ్) 4, ఎక్స్‌ట్రాలు 0, మొత్తం 20 ఓవ ర్లలో 65/2.

బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 6–3–16–0, జస్‌ప్రీత్ బుమ్రా 4–0–14–0, మహ్మద్ షమి 5–1–15–0, హార్దిక్ పాండ్య 4–0–17–2, రవిచంద్రన్ అశ్విన్ 1–0–3–0.

కష్టాల్లో ఇంగ్లాండ్

- యాషెస్ చివరి టెస్టు



సిడ్నీ: ఆస్ట్రేలియాతో జరుగుతున్న యాషెస్ చివరి టెస్టు లో ఇంగ్లాండ్ ఓటమి కోరల్లో చిక్కు కుంది. భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ చేపట్టిన ఇంగ్లాండ్ ఆది వారం ఆట ముగిసే సమయానికి 93 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది. ఈ మ్యాచ్‌లో ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే సోమవారం చివరి రోజు ఇంగ్లాండ్ మరో 210 పరుగులు చేయాలి. ఓపెనర్ అలి స్టర్ కుక్ (10), మార్క్ స్టోన్‌మన్ (0) నిరాశ పరిచారు. జేమ్స్ విన్స్ (18), డేవిడ్ మలాన్ (5) కూడా పెవిలియన్ చేరారు. కెప్టెన్ కుక్ 42, వికెట్ కీపర్ బైర్‌స్టో 17 పరుగులతో క్రీజులో ఉన్నారు. అంత కుముందు 479/4 ఓవర్‌నైట్ స్కోరుతో నాలుగో రోజు ఆట కొన సాగించిన ఆస్ట్రేలియాకు మార్ష్ బ్రదర్స్ అండగా నిలిచారు. ఇద్దరు సోదరులు శతకాలతో కదం తొక్కారు. దీంతో ఆస్ట్రేలియా భారీ స్కోరును నమోదు చేసింది. కీలక ఇన్నింగ్స్ ఆడిన షాన్ మార్ష్ 291 బంతుల్లో 18 ఫోర్లతో 156 పరుగులు చేశాడు. మిచెల్ మార్ష్ కూడా శతకంతో సత్తా చాటాడు. దూకుడుగా ఆడిన మిచెల్ 15 ఫోర్లు, రెండు సిక్సర్లతో 101 పరుగులు చేశాడు. వికెట్ కీపర్ 38(నాటౌట్), కమిన్స్ 24 (నాటౌట్) తమవంతు పాత్ర పోషించడంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లకు 649 పరుగులు చేసి డిక్లేర్డ్ చేసింది. దీంతో ఆసీస్‌కు భారీ మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

దిగ్గజాల సరసన కుక్

ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్ మరో అరుదైన మై లురాయిని అందుకున్నాడు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న యాషెస్ చివరి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో పది పరుగుల వ్యక్తిగత స్కోరును సాధించడం ద్వారా కుక్ టెస్టు క్రికెట్‌లో 12వేల పరుగుల మైలురాయికి చేరుకున్నాడు. ఈ క్రమంలో 12 వేల పరుగులు సాధించిన ఐదో క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఇదే సిరీస్‌లో కుక్ మరో రికార్డును కూడా తన పేరిట లిఖించుకున్న విషయం తెలిసిందే. నాలుగో టెస్టులో 244 పరుగులు చేయడం ద్వారా ఒక టెస్టు మ్యాచ్‌లో ఓపెనర్‌గా ఇన్నింగ్స్‌ను ఆరంభించి చివరి వరకు అజేయంగా నిలువడమే కాకుండా అత్యధిక పరు గులు సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు.



తాజాగా తన టెస్టు కెరీర్‌లో 12 వేల పరుగులను పూర్తి చేశాడు. ఇంతకు ముందు టెస్టు క్రికెట్‌లో నలుగురు మాత్రమే ఈ ఘనత సాధించారు. వీరిలో మాస్టర్ బ్లాస్టర్ సచిన్ (15,921), రికి పాంటింగ్ (13,378), కలిస్ (13,289), కుమార సంగక్కర (12,400) పరుగులు ఉన్నారు. తాజాగా వీరి సరసన కుక్ కూడా చేరాడు.

పాండ్య ఇన్నింగ్స్ అద్భుతం: పుజారా





కేప్‌టౌన్: కీలక సమయంలో అసాధారణ ఇన్నిం గ్స్‌తో భారత్ పరువును కాపాడిన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యపై టీమిండియా కొత్త వాల్ చటే శ్వర్ పుజారా ప్రశంసల వర్షం కురిపించాడు. 92 పరుగులకే ఏడు వికెట్లను కోల్పోయిన జట్టు ను పాండ్య అద్భుతంగా ఆదుకున్నాడన్నాడు. క్లి ష్టమైన సమయంలో అద్భుత ఇన్నింగ్స్‌తో చెలరే గిన హార్దిక్‌ను ఎంత పొగిడిన తక్కువేనన్నాడు. బౌలర్లకు సహకరిస్తున్న పిచ్‌పై బ్యాటింగ్ చేయ డం ఇరు జట్ల బ్యాట్స్‌మెన్‌కు కష్టంగా మారింద న్నాడు. అయితే ఇదే పిచ్‌పై హార్దిక్ అద్భుత ఆట ను కనబరచడం ఆనందాన్ని ఇచ్చిందన్నాడు. రా నున్న రోజుల్లో పాండ్య జట్టులో కీలకపాత్ర పో షించడం ఖాయమన్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అతని సేవలు జట్టుకు ఎంతో కీలకమ న్నాడు. ఒత్తిడిలోనూ అద్భుతంగా ఆడిన ఘనత పాండ్యకే దక్కుతుందన్నాడు. అతనికి అండగా నిలిచిన భువనేశ్వర్‌పై కూడా పుజారా ప్రశం సలు కురిపించాడు. వీరిద్దరూ అద్భుతంగా ఆడి జట్టు పరువును కాపాడారని పేర్కొన్నాడు. కాగా, ఈ మ్యాచ్‌లో టీమిండియా విజయవకాశాలు ఇంకా మిగిలే ఉన్నాయన్నాడు. ఈ పిచ్‌పై 350 పరుగుల లక్ష్యాన్ని సైతం అందుకోవడం తమకు సాధ్యమేనని పుజారా అన్నాడు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.